తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

డిశంబర్-2022

వెల: రూ.20



ప్రముఖ

హాస్య రచయిత

**శ్రీ కోనే నాగ వెంకట ఆంజనేయులు**

ప్రత్యేక సంచిక



# బాపురమణ అకాడమీ

ఆత్రేయపురం-హైదరాబాద్

గౌరవాధ్యక్షులు: 'కళారత్న' బ్నిం

ప్రధాన కార్యదర్శి: 'కళామిత్ర' వేగిరాజు సుబ్బరాజు

# బాపురమణల అవార్డు ప్రదానోత్సవం 2022

**డిశంబర్ 15 గురువారం- సాయంత్రం 6 గంటలకి**

**తెలుగు యూనివర్శిటీ-నాంపల్లి, హైదరాబాద్**

## బాపు పురస్కారం



శ్రీ శంకర్ గారికి

## రమణ పురస్కారం



శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి గారికి

## పుస్తక ఆవిష్కరణలు

'అక్షజ్ఞ' ప్రచురించిన

**ముళ్లపూడి వెంకటరమణ రచనలు:**

1. రాధాగోపాళం
2. సీతాకల్యాణం

Cartoonist Ramakrishna Foundation

సమర్పిస్తున్న

రాగతి పండరి కార్టూన్స్

ప్రముఖ హాస్య రచయిత

కోనే నాగ వెంకట ఆంజనేయులు గారి

హాస్యానందం ప్రత్యేక సంచిక

బాపురమణీయ లోగిలి సమర్పణ

## బాపురమణల మధుర స్నేహ పురస్కారం-2022



**డా॥ ఎ.వి.గురవారెడ్డి,**

**డా॥రొంపిచర్ల భార్గవి గార్లకు**



ప్రముఖుల సమక్షంలో
జరిగే ఈ వేడుకకి

# అందరూ ఆహ్వానితులే

Regd Off: Plot No - 51/2P, Road No-2, Tulasi Nagar, Opp. JNTU, HMT Hills Road, Kukatpally, Hyderabad-72
Ph: 9490608899, 9848208899. Email: aatreyapuram@gmail.com

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక

# హాస్యానందం

డిశంబర్-2022

20వ సంవత్సరం

222 వ సంచిక

ప్రముఖ రచయిత
శ్రీ కోనే నాగ వెంకట ఆంజనేయులు
ప్రత్యేక సంచిక

*Publisher& Editor-*
*Ramu.P*


*Full Pillar* :
Bnim

*Cartoon Feature Editor*:
Bachi

*D.T.P:*
P. Ramalakshmi, 9440304993

*Digital Media Director:*
Surya

*Well Wishers:*
Dr.K.V.Ramanachary, (I.A.S.Retd)
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Dr.V.V.Rama Kumar
Gudibandi Venkata Reddy




ముఖచిత్రం:
కీర్తి సురేష్

*Prize Sponsers*
K.V.V.Satyanarayana,
G.Venkat Reddy,
Dr. Rama Kumar
*Cartonist* JSR,
K.Sundaresayya&
Satyavathi,
Padmadas

సంవత్సర చందా-రూ.300/-
(పోస్టల్ చార్జీలతో)

2 సంవత్సరాల చందా-రూ.500/-
(పోస్టల్ చార్జీలతో)

**జీవిత చందా- రూ.5000/-లు**

*Creative Team*
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar
Dayakar
Sangram
Krishna
Bomman
GopalKrishna
Venkat
Ramsheshu

Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**

email:
**hasyanandam.mag@gmail.com**
web:
**www. hasyanandam.com**

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad.
Cell. 9666680857.

గమనిక:

ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది మా అభిమతం కాదు. ఈ పత్రికలో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

**ఆనందానికి కారణం- నవ్వు!... నవ్వుకి కారణం హాస్యానందం!**

## కొసమెరుపుల కోనే

**'నీ నగుమోము కనలేని...'** అంటూ ఆ రఘురాముని నగుమోముతో దర్శనం ఇవ్వమని... త్యాగరాజు మొర పెట్టుకున్నాడంటేనే... మానవుడికైనా... దైవానికైనా వారి వారి ముఖారవిందాలకు చిరు'నగ'వు ఎంతటి అందాన్నిస్తుందో... అది కన్న ఎదుటివారికి ఎంతటి ఆనందాన్నిస్తుందో తెలుసుకున్న మన 'కోనే' తెలుగు పాఠకుల నగుమోములో తానూ ఆ రాముని చూడాలని హాస్య రచనలు చేయటం తలపెట్టి... గత 50 సంవత్సరాలుగా నాటి చందమామ లాంటి మేటి పత్రిక మొదలు... నేటి ప్రముఖ పత్రికలెన్నింటిలోనో హాస్య కథా రచనలో పస గలిగిన 'కొస మెరుపు'తో ఆయా పత్రికల అంద'చందాలు' పెంచటంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. వీరు పనిచేసి పదవీ విరమణ చేసిన 'విశాఖ స్టీల్ 'గట్టి దనానికి' పేరైతే... వీరు పండించే హాస్యం సున్నిత హాస్యానికి మారు పేరు!



హాస్యంలో వీరి వైవిధ్యభరితమైన రచనాశైలితో అందరూ ఆసక్తిగా పత్రికలు చదువు 'కొనే'లా చేస్తున్న కోనేగారికి నవరసాల్లోకెల్లా కేవలం హాస్య రసం ఒక్కటే మనిషి ఆనందానికి, ఆరోగ్యానికి ఉపకరిస్తుందని బాగా తెలుసు!

బలవంతంగా నవ్వించే లాఫింగ్‌క్లబ్ కి వెళ్లి ఆర్టిఫిషియల్ నవ్వు నవ్వే కన్నా... హార్ట్‌ఫుల్‌గా నేచురల్‌గా నవ్వించే తన పవర్‌ఫుల్ హాస్యాన్ని మనకు అందిస్తున్నారు.

ఎప్పటికప్పుడు లేటెస్ట్‌గా, మన టేస్ట్‌కి తగినట్లు తన 'కొస మెరుపుల'తో ఆధునికతను... సమకాలిన జీవన పోకడల్ని ఔపోసన పడుతూ... మంచి హాస్య కథా రచయితగా కొనసాగుతున్న 'కోనే'వారి హాస్యానందం ప్రత్యేక సంచికలో ఆయన చమత్కారాలు, హాస్యప్రహసనాలు మీకు పూర్తి నవ్వుల విందు చేస్తుందనిగట్టిగా నమ్ముతూ....

**-'భగవాన్'**

## ఎక్కడెక్కడ ఏమేమున్నాయి?...

### కోనే కొంటె కథలు...


| | |
|---|---|
| శారద,ఎమ్.బి.ఎ | -10 |
| డ్రస్ రిహార్సల్ | -12 |
| ఎర | -16 |
| 'చిక్కు'డుకాయ | -22 |
| బస్సులో కస్సు బుస్సుల మిస్సు | -24 |
| వాకింగు-వా...క్వీనూ! | -28 |
| ఊరూ... పేరూ... | -30 |
| కూర'గాయాలు' | -32 |
| ఓ పెన్‌డ్రైవ్ కథ | -40 |
| పేలు | -43 |
| స్కూల్‌కెళ్ళనమ్మా! | -45 |
| మిస్టరీ | -47 |
| అమ్మగారి హత్య! | -49 |


### బాపు బొమ్మకు కోనే కథ


| | |
|---|---|
| శ్రీరామనవమి | -9 |
| ప్రేమాయణంలో | -17 |
| అర్థరూపాయి-అనర్థం | -21 |
| మీసాల భార్య | -35 |
| పందికొక్కు | -46 |


### బాలి బొమ్మకు కోనే కథ


| | |
|---|---|
| పండుగ పిండి వంటలు | -31 |
| రక్తి కట్టిన భక్తి | -39 |


### 'కోనే' స్పెషల్స్


| | |
|---|---|
| సెల్ఫీ | -8 |
| ఫన్ పంచ్ | -14 |
| శ్రీ కోనే గారితో ముఖాముఖి | -18 |
| ఫొటోలు | -26 |
| కోనే కనిపెట్టినవి... | -31 |


### కార్టూన్ శీర్షికలు


| | | |
|---|---|---|
| ఈ నెల దినం | -రామ్‌శేషు | **-36** |
| దెయ్యాల గోల | -ఎన్.పి.ఎస్.రావు | **-38** |


**గమనిక:** ఈ నెల ప్రత్యేక సంచికగా పత్రిక రూపొందించటం వలన శీర్షికలు, సీరియల్, కార్టూన్లు ప్రచురించబడలేదు... గమనించగలరు. **-॥సం॥**

## హాయ్...సానందంగా...



**హాస్యానందం అభిమానులకు...**
**ఆప్తులకు... హాస్యప్రియులకు,**
**సన్నిహితులకు హాస్యాభివందనాలు!**

ప్రతిదానికీ ఒక పరిధి ఉంటుంది... కానీ ఆలోచనలకు మాత్రం 'పరిధి' ఉండదు. మన ఆలోచన(ఆరోగ్యకరమైన) పరిధి ఎంత విస్తృతమైతే మన ఎదుగుదల అంత ఉన్నత మౌతుంది. ఒక చట్రం ఏర్పరచుకుని అందులోనే ఉంటూ పరిమితమైన ఆలోచనలతో గడుపుతూ ఇవే గొప్ప సిద్ధాంతమనుకునే వారు 'ఆ' చిన్ని ప్రపంచానికే పరిమితమైపోతారు. ఏ పనైనా చేస్తూంటేనే అందులో లోటుపాట్లు తెలుస్తాయి... కొత్త కొత్త విషయాలు అవగాహనలోకి వస్తాయి. ఏదో తెలుసుకోవాలనే ప్రయత్నం... చేసే కృషి మన ఆలోచనలను పదును పెట్టి, నలుగురిలో ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా నిలబెడతాయి. మనం ఏర్పరచుకున్న కొన్ని లిమిటేషన్స్‌ని దాటి ఆలోచిద్దాం... ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో ఎదుగుదాం!

పత్రికల్లో మంచి మంచి రచనలు చదివి ఆనందించి ఊరుకోక... వాళ్ళని అభినందిస్తూ... పత్రిక వాళ్ళకి ఉత్తరాలు రాస్తూ... అలా రచనా వ్యాసాంగానికి దగ్గరై... చిన్న పిల్లల కథలు రాయడం మొదలెట్టి... హాస్యకథలకి కేరాఫ్ అడ్రస్‌గా మారి, తెలుగుసాహితీ రంగంలో ఓ స్థానం ఏర్పరచుకున్న శ్రీకోనే నాగ వెంకట ఆంజనేయులు గారు అభినందనీయులు. ఇప్పటికీ ఒక మంచి రచనగానీ, కార్టూన్ చూస్తే ఆ వ్యక్తులు పరిచయం లేకున్నా వారిని అభినందించే సంస్కారం ఆయనకి ఆభరణం! ఈ ప్రత్యేక సంచిక రూపొందించడానికి ప్రేరణ ఇదే! ఉత్తరాలతోనే ఆగిపోయుంటే ఈ యాభై ఏళ్ళ సాహితీ ప్రస్థానం సాగేదా?... ఇన్ని మంచి కథలు మనకందించే వారా?... ఎదుటి వారి సక్సెస్ నుంచి మనం నేర్చుకోవలసినది ఇదే!... అదే మన ఆలోచనలని ఎదగనివ్వడం!

అందరూ హాయిగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని
కోరుకుంటూ.....

Ramu.P




✦ **వి.శ్రీప్రియ, ముంబై**

**'తాం**బూల చర్వణ వ్రతం' సూపర్! పుస్తకం మొత్తం ఆ వ్రతం పుణ్యమా అని తిరగేసేసాను.గుండుగారి ఆ వ్రతం గురించి చదివాక వావ్ అనిపించింది. మా వాట్సాప్ గ్రూప్‌ల్లో అందరికీ ఫార్వార్డ్ చేశాను... ఈ వ్రతం మీ 'ఆయన'లచే చేయించండి! అని. మీ నావెల్టీ ఆలోచనలకు అభినందనలు.



✦ **బి.కృష్ణకుమారి,కావలి**

**న**వంబర్ హాస్యానందం... మా నవ నాడులకు ఇంధనంగా పని చేసింది! నవ్వు ఎంత ఆహ్లాదనిస్తుందో... ప్రశాంతతని స్తుందో అనుభవిస్తేనే తెలుస్తుంది. ముఖ చిత్రం అమ్మాయి నవ్వు చాలా బాగుంది... ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేసిందా నవ్వు! ఈ సంచికలోని కథలు, కార్టూన్లు నవ్వించడంలో 100% సఫలీకృతమయ్యాయి.

✦ **కె.వి.రాజేశ్వరరావు, బెంగళూరు**

**న**వంబర్ హాస్యానందంలో 'హాయ్ సానందం'గా ఎడిటర్‌గారు చెప్పి నట్లు- 'మంచి మాటలు ఎవరు చెప్పినా ఆనందంగా స్వీకరిద్దాం... పాటించడానికి ప్రయత్నిద్దాం! చూద్దాం ఆనందం మన వెంట ఎందుకు రాదో!' అన్న మాటలు చాలా బావున్నాయి. మనం చేసే చిన్న చిన్న పనులే మనకి ఎలా ఆనందాన్ని కలిగిస్తుందో చాలా చక్కగా వివ రిస్తున్నారు. థ్యాంక్యూ!

✦ **ఆర్.గుర్నాథం, శ్రీకాకుళం**

**ఈ**నెల కథ స్వీట్‌బాక్స్ కథలో సుగర్ పేషెంట్ల భయాల గురించి, జాగ్రత్తల గురించి నవ్వులతో చాలా చక్కగా వివ రించారు రచయిత. రచయితకి అభినందనలు.అలాగే కార్టూ నిస్టు భగవాన్‌గారి ప్రశ్నలకు సుదర్శనం గారి సమాధానాలు సూపర్... ముఖచిత్రం మీద కార్టూన్ నేటి లైఫ్‌స్టైల్‌కి అద్దం పట్టింది. మొత్తం మీద పత్రిక నవ్వులతో ఆలోచింపజేసేవిగా ఉంది. మీకు మా అభినందనలు!

✦ **శ్రీహర్ష పారుపల్లి, తిరుపతి**

**హా**స్యానందం 'నవ్వులు' మా ఆరోగ్యాన్ని కాపాడే రక్షణ కవచంగా ఉంది అనడంలో ఏమాత్రం సందేహం లేదు. స్వచ్ఛ మైన హాస్యం హాస్యానందానికే స్వంతం! మీరు కథలు, కార్టూన్లు ఎంచుకునే విధం మీ అభిరుచికి నిదర్శనం! ఇదే విధంగా పత్రిక పది కాలాల పాటు వర్ధిల్లాలని మా ఆశ.


✦ **ఆర్.పద్మలత,హైదరాబాద్**

**న**వంబర్ హాస్యానందం నవ్వుల సుందరి ముఖచిత్రంతో వెలిగిపోతూ... నవ్వులతో నిండుగా ఉంది. కథలన్నీ బావు న్నాయి. చిన్న చిన్న కథలు ఉండటం బాగుంది. ఇక గుండు సుదర్శనంగారి ఫన్ సమాధానాలు చాలా చాలా బావుంటు న్నాయి. కార్టూన్ శీర్షికలు అన్నీ నవ్వుని పంచుతున్నాయి. 'పన్'చదార చిలుకలు పేజీలో తెలుగు భాషలో మాటలతో ఎలా గారడీ చేయొచ్చో నవ్విస్తూ చూపిస్తున్నారు శంకర నారా యణగారు! ఇన్ని నవ్వుల మధ్య చిన్న చిన్న కారణాలు మన ఆనందానికి ఎలా కారణాలౌతాయో తెలుపుతున్న 'హాయ్ సానందంగా'కి మా కృతజ్ఞతలు!



**కా**ర్టూనిస్టు శ్రీమతి పద్మగారు కార్టూనిస్టు మిత్రులతో 'కార్తిక వనభోజనాలు' నవంబర్,20న విజయవాడ, సర్ ఆర్థర్‌కాటన్ హై స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేశారు. సుమారు ముప్పైకి పైగా కార్టూనిస్టులు పాల్గొన్న ఈ కార్యక్రమం కుటుంబ సభ్యుల సమావేశంలా ఆహ్లాదంగా జరిగింది. ఇంతమంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన శ్రీమతి పద్మగారికి కార్టూనిస్టులందరి తరపున హాస్యానందం అభినందనలు తెలుపుతోంది.

**డా॥కె.వి.రమణ, ఐ.ఎ.ఎస్(రి)**
**ఆశీస్సులతో**
**గుదిబండి వెంకట రెడ్డి,**
**హాస్యానందం సౌజన్యంతో**
**నిర్వహిస్తున్న కార్టూన్ పోటీలు**



శ్రీ గుదిబండి వెంకట రెడ్డి గారు కార్టూనిస్టులను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. కార్టూనిస్టు మిత్రులు అందరూ పాల్గొనాలని మా మనవి

**మొదటి బహుమతి**
రూ.3000/-లు + మెమొంటో + సర్టిఫికెట్
**రెండవ బహుమతి**
రూ.2000/-లు + మెమొంటో + సర్టిఫికెట్
**5 ప్రత్యేక బహుమతులు**
రూ.1000/-లు ఒక్కొక్కరికి + మెమొంటో+ సర్టిఫికెట్

అంశం ఏదయినా అవచ్చు.
బహుమతుల ప్రదానోత్సవ సభ జనవరి 2023 లో హైదరాబాదులో జరుగుతుంది.

కార్టూన్లు చేరవలసిన ఆఖరి తేదీ:
డిశంబర్, 10, 2022
ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను-
hasyanandampoteelu@gmail.com

వివరాలకు :
9849630637, 9849882783

**గుళ్ళపల్లి అరుణకుమారి స్మారక**
**కార్టూన్ పోటీ-2022**



హాస్యానందం సౌజన్యంతో...

ప్రముఖ కార్టూనిస్ట్ **శ్రీ దాస్ గారి శ్రీమతి**
**గుళ్ళపల్లి అరుణ కుమారిగారి స్మారకార్థం**
వారి కుమార్తెలు
శ్రీమతి స్పందన, శ్రీమతి సునీలలు
ఈ కార్టూన్ పోటీ నిర్వహిస్తున్నారు.

| | |
|---|---|
| మొదటి బహుమతి | -రూ.3,500/- |
| రెండవ బహుమతి | -రూ.2,500/- |
| మూడవ బహుమతి | -రూ.1,500/- |
| 5 ప్రత్యేక బహుమతులు | -రూ.500/- |

కార్టూన్లు ఈ మెయిల్‌కి పంపవలెను
gcpadmadas@gmail.com

ఏమైనా సందేహాలుంటే ఈ కింది నెంబర్లకు ఫోన్ చేయండి
బాచి-9848992433
పద్మదాస్-8985226622

బహుమతి ప్రదానోత్సవ సభ
జనవరి26న విజయవాడలో నిర్వహించబడుతుంది.
వేదిక వివరాలు జనవరి హాస్యానందంలో ప్రకటిస్తాం!

**కార్టూన్లు చేరవలసిన ఆఖరు తేదీ :**
**20-12-2022**


# సెల్ఫీ

**అం**దరికీ నమస్కారం. కోనే నాగ వెంకట ఆంజనేయులు అను నేను హేలాపురి అనబడే ఏలూరులో పుట్టేను.

నా తల్లిదండ్రులు శ్రీ కోనే సూర్యనారాయణగారు, కోనే గిరి కుమారి గారు.

నా చదువు బి.కామ్.వరకూ ఏలూరులోనే జరిగింది.

విశాఖపట్టణంలో ఉద్యోగంలో జేరిన తరువాత ఎమ్ ఏ (హిందీ) చేశాను.



డిగ్రీ తరువాత ఆరేడేళ్ళు ఆంధ్రా యూని వర్సిటీలో ఉద్యోగం చేసి ఆ తరువాత విశాఖపట్టణం స్టీల్‌ప్లాంట్‌లో ముప్పై ఏళ్ళు వివిధ హోదాల్లో ఉద్యోగం చేసి రిటైరై పోయి ప్రస్తుతం విశ్రాంతి లేని జీవితం గడుపుతున్నాను.

ఇక నా రచనా వ్యాసంగం గురించి చెప్పాలంటే చిన్నప్పుడే అమ్మ నుండి సంక్రమించిన పత్రికలు చదవడం అనే అలవాటుతో కనిపించిన ప్రతీ పుస్తకం చదువుతూ చిన్న చిన్న జోక్స్, కథలు వ్రాయ డంతో మొదలు పెట్టి ఇప్పుడిప్పుడే అందరి దృష్టిలో పడుతున్నాను.

ఇప్పటి వరకూ 430 పైగా కథలు వ్రాశాను. ఇంకా అనేక వ్యాసాలు, కవితలు, జోకులూ యితర రచనలు చేశాను వివిధ పత్రికలలో గత 52 ఏళ్లుగా.

చిన్న చిన్న సరదా స్కిట్లు, రేడియో నాటికలు కూడా చాలా వ్రాశాను. నాటికలు అన్నీ ఆకాశవాణి విశాఖపట్టణం కేంద్రం నుండి ప్రసారం అయ్యాయి.

వ్రాసిన కథల్లో ముప్పైకి పైగా కథలు వివిధ పత్రికలు నిర్వ హించిన పోటీల్లో వివిధ బహుమతులు పొందేయి.

నా పేరు చెప్పగానే అందరూ చందమామ హేలాపురి కథల రచయితగా, హాస్య కథల రచయితగా గుర్తించడం ఆనందం కలిగిస్తుంటుంది. పాత పత్రికలు, పుస్తకాలు చదవడం, పాటలు వినడం, పాడుకోవడం ఇష్టమైన అభిరుచులు.

సరదాగా మాట్లాడుతూ, నవ్వుతూ నవ్వించడం సంతోషం కలిగిస్తుంది. కొత్త కొత్త ప్రదేశాలు చూడడం, పురాతన కోటలు దర్శించడం చాలా యిష్టం.

అలా దేశంలో చాలా కోటలు ఎక్కి, తిరిగి చూశాను.

ఇక కుటుంబ విషయానికి వస్తే నా భార్య రాజ్యలక్ష్మి గృహిణి. మాకు యిద్దరు పిల్లలు-కిరణ్, గౌతమి. ఇద్దరికీ వివాహాలు అయిపోయి ఉద్యోగాలు కూడా చేసుకుంటున్నారు. మా కోడలు ప్రసన్న సి.ఏ చేసి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తోంది. వాళ్లకు ఓ కుమార్తె. పేరు సంకీర్తన. ఏడవ తరగతి చదువుతోంది. నా మనుమరాలు ఏడెనిమిదేళ్లు నానమ్మ, తాతయ్య లైన మా దగ్గరే పెరిగి మాకు అంతులేని ఆనందం కలిగించి ప్రస్తుతం వాళ్ళ అమ్మానాన్నల దగ్గరకు చేరి పోయింది.

మా అల్లుడు భాను ప్రకాష్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగం చేసి వచ్చారు. అమ్మాయి గౌతమి బి.ఎడ్ చేసి టీచర్‌గా ఉద్యోగం చేస్తోంది. అల్లుడి ఉద్యోగరీత్యా దేశంలో చాలా ప్రదేశాలు తిరిగిన తరు వాత ప్రస్తుతం వాళ్ళు వాళ్ళ స్వంత ఊరైన ఉయ్యూరులో స్థిర పడ్డారు.

నా పెద్ద మనవడు సిద్ధు ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. వీలు దొరికినప్పుడు కార్టూన్స్ వేస్తుంటాడు. నా చిన్న మనవడు నందు (నిహార్) పదకొండవ తరగతి చదువుతున్నాడు. ఇంగ్లీషు లో చిన్న చిన్న కవితలు వ్రాయడానికి ఉత్సాహం చూపిస్తుంటాడు.

నా గురించిన మరి కొన్ని విషయాలు మీకు లోపలి పేజీల్లో లభిస్తాయి.

చివరిగా నా కథలు ప్రచురించి ప్రోత్సహిస్తూ, నా రచనలతో ప్రత్యేక సంచిక తీసుకువచ్చిన హాస్యానందం రామూ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

నా కథలు చదివి నా హాస్య స్ఫూర్తిని కొనియాడుతున్న పాఠకులకూ, నా సహ రచయితలకూ ధన్యవాదాలు సమర్పిస్తున్నాను.

**-కోనే నాగ వెంకట ఆంజనేయులు**

# 2-113-7, Srinivasa Nagar,
Opp Street- Surya Towers,
AGANAMPUDI,
**VISAKHAPATNAM-53**
Ph: 9290660220

బాపు బొమ్మకు కోనే కథ

'స్వాతి' సౌజన్యంతో

# శ్రీరామనవమి

"శ్రీరామచంద్రప్రభూ! భరతఖండంలో అందులోనూ ఆంధ్రదేశంలోని నీ 'నవమి' కడు రమ్యంగా జరుపుతారని తెలిసింది. ఈసారి 'శ్రీరామనవమి' వేడుకలు మీతో కలిసి ఆంధ్ర దేశం వెళ్ళి చూడాలని చాలా కోరికగా వుంది. ఆ చలువ పందిళ్ళలో రామాయణ పారాయణాలు, నీ మహిమలు కొలిచే భజనలు వినాలనీ, పానకం, వడపప్పు ప్రసాదాలు ఆరగించాలని కుతూహలపడుతున్నాను. అనుగ్రహించండి స్వామీ!" అని ప్రార్థించాడు హనుమంతుడు.

స్వామివారు చిరునవ్వుతో అంగీకరించేరు.

శ్రీరాములవారు హనుమ సమేతంగా శ్రీరామనవమికి ఆంధ్రదేశం విచ్చేశారు.

హనుమకు చాలా ఆనందంగా ఉంది రామలీలలు మరొకసారి కనే అదృష్టం కలుగుతున్నందుకు.

కానీ వారు వెళ్ళి చూసిన పందిరిలో రామ భజన వినిపించలేదు. ఎవరో కీచుకంఠాల వాళ్ళు మైకు పట్టుకుని ఊగిపోతూ ఆహా... ఉహు... అబ్బా... అమ్మా...అని పాటలు పాడుతున్నారు. దానిపేరు ఆర్కెస్ట్రా ఆట. రామ లక్ష్మణ సీతా హనుమల విగ్రహాలు ఎక్కడా కనిపించలేదు. హనుమ సూక్ష్మరూపం ధరించి వెతికితే పందిరి ప్రక్కన ఒక మూల వేలెడంత పరిమాణంలో రామ లక్ష్మణ సీతా హనుమల విగ్రహాలు... రెండు మూడు వాడిపోయిన పువ్వులు కనిపించాయి.

'రామా! రామా!!' అనుకుంటూ హనుమ నిర్ఘాంతపోయాడు. ఇదా రామలీలా వుత్సవం అని ఆశ్చర్యపోయాడు.

రామచంద్రుడు చిద్విలాసంగా నవ్వేడు.

మరొక పందిరిలోకి వెళ్తే అక్కడ 16 ఎమ్. ఎమ్. సినిమా వేస్తున్నారు. సినిమా పేరు 'యింద యింద తీసుకో'.



హనుమంతుడు హూంకరించాడు.

"ఒక్కరు కూడా రామనామం పలకడం లేదు. రామనామం పలకని ఈ నాలుకలెందుకు? అనుమతివ్వు ప్రభూ వీళ్ళ నాలుకలు తెగ గోస్తాను" అన్నాడు హనుమ.

స్వామివారు హనుమను శాంతింపజేసారు.

"స్వామి ఏమిటిదంతా! నేనెంత ఆశపడ్డాను. శ్రీరామనవమి అంటే ఎంతో ఘనంగా నీకు పూజలు, పునస్కారాలు... జరుగుతాయనుకున్నాను... ఇలాంటి దృశ్యాలు చూడవలసి వస్తుందనుకోలేదు" అని నొచ్చుకున్నాడు హనుమంతుడు.

"నాయనా! యిది కలికాలం. ఈనాటి మానవుడికి భక్తి కంటే భుక్తే ముఖ్యమైనది. కూటి కోసం కోటి విద్యలు. అందులో యివి కొన్ని. రా! వెళదాం" అని రాముడు హనుమను ఒక ఏకాంత ప్రదేశానికి తీసుకువెళ్ళాడు.

అక్కడ రాముడు వీణ చేతబూని కమ్మని రాగాలు పలికిస్తుంటే హనుమ ఆనంద పారవశ్యంతో నాట్యం చేస్తూ తన్మయుడైపోయాడు.




## అరుదనే చెప్పాలి!

శ్రీ కోనే నాగవెంకట ఆంజనేయులు గారి పేరుతో నాకు 1972 నుంచి పరిచయం. అపరాధ పరిశోధనలోని నా రచనలు చదివి ప్రోత్సహించే ఉత్తరాలు రాసేవారు. అందులో చిన్న చిన్న రచనలు కూడా చేసేవారు. అతని రచనలు సరదాగా, కామెడీగా సాగుతాయి. అలా వారు రాసిన ఎన్నో మినీ కథలని చదివాను. విశాలాక్షి మాసపత్రికలో బాలి బొమ్మకి ఎన్నో కథలని రాసి బహుమతి పొందారు.

ఏభై ఏళ్ళకి పైగా శ్రీ కోనే నాగ వెంకట ఆంజనేయులు పత్రికా పఠనాన్ని కొనసాగిస్తూ, రచనలని చేస్తూనే ఉన్నారు. ఇంతకాలంగా రాసే రచయితలు అరుదనే చెప్పాలి.

మేం ఓసారి కలిసినప్పుడు అతను స్నేహశీలే కాక పరోపకారి అని కూడా అర్థమైంది. నా రచనలున్న పాత 'అపన' సంచికలు కొన్ని ఇచ్చారు. ఏడాదికి పైగా వాట్సప్ ద్వారా నాకు పాత చందమామల పి.డి.ఎఫ్‌లని విడవకుండా రోజుకొకటి చొప్పున పంపుతున్నారు.

శ్రీ కోనే మీద హాస్యానందం ప్రత్యేక సంచికని వెలువరించడం అభినందనీయమైన విషయం. కోనే నాగ వెంకట ఆంజనేయులు గారికి అభినందనలు.

**–మల్లాది వెంకట కృష్ణమూర్తి**




# శారద, ఎమ్.బి.ఎ

**సోంబాబుకి ముప్ఫై అయిదేళ్ళు నిండినా యింకా పెళ్లి కాలేదు. పెళ్లి కాలేదు అనేకంటే... అతనే యింతవరకూ పెళ్లి చేసుకోలేదని చెప్పాలి. పెళ్ళి చేసుకోలేదంటే – అతనికేమీ పెళ్లి సంబంధాలు రాలేదని కాదు అర్థం. వచ్చాయి!...చాలా వచ్చాయి!!**

**సోంబాబు అందగాడు. ఐశ్వర్యవంతుడైన తండ్రికి ఒక్కగానొక్క పుత్రరత్నం! అలాంటి వాడికి సంబంధాలెందుకు రావు! వందలాది సంబంధాలొచ్చాయి.**

ఎన్ని సంబంధాలొచ్చినా సోంబాబుకి ఏ అమ్మాయీ నచ్చడం లేదు!

నచ్చడం లేదంటే అమ్మాయిలు అందంగా లేక నచ్చకపోవడం కాదండోయ్! అప్సరసల్లాంటి అందమైన అమ్మాయిలే అందరూ!


సోంబాబులాంటి అందమైన డబ్బున్న అబ్బాయిని పెళ్ళి చేసుకోవాలని ఏ అమ్మాయికుండదు?... మరి యింతవరకూ సోంబాబుకి ఏ అమ్మాయీ నచ్చకపోవడానికి కారణం ఏమిటి?

ఉంది సార్... ఉంది! అదే చదువు!! యింతమంది అందమైన అమ్మాయిల సంబంధాలొచ్చినా సోంబాబుకి వాళ్ళెవరూ నచ్చకపోవడానికి కారణం వాళ్ళ చదువేనండి బాబూ!

ఏ అమ్మాయీ అయిదో క్లాసు దాటి వెళ్ళడం లేదు. సోంబాబుకి బాగా చదువుకున్న అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని కోరిక.

కానీ చదువుకున్న అమ్మాయిలెందుకు సోంబాబుని పెళ్లి చేసుకుంటారు! ఎందుకంటే సోంబాబుది వానాకాలం చదువు... అయిదో తరగతి దాటి ససేమిరా ఒక్క క్లాసయినా ముందుకి సాగలేకపోయాడు. కొద్దోగొప్పో ఇంగ్లీషు అక్షరాలు చదవగలడు అంతే!

అంత 'తెలివైన' అబ్బాయిని బాగా చదువుకున్న అమ్మాయిలెలా యిష్టపడతారు సార్! ఎంత డబ్బుంటే మాత్రం? తన భర్త తనకంటే బాగా చదువుకున్నవాడై ఉండాలనీ, తెలివైనవాడై ఉండాలనే కదా ప్రతీ అమ్మాయి కోరుకునేది?






## హాస్యం ఈయన ఇంకులో ఉంది!

**బా**పు బొమ్మకు కథ అని స్వాతి వీక్లీలో వీరు రాసిన కథలను చూసి... వీరిని ప్రేమించడం మొదలు పెట్టాను. ఆ తర్వాత సెర్చి చేస్తే... వీరు చందమామ కథల్లో ఎన్ని కథలు అందించారో తెలిసింది... ఈయన సామాన్యుడు కాదు అని అనుకుంటుండగా... మా హాస్యానందానికి అద్భుతమైన రచనలు అందించారు... అందిస్తూనే ఉన్నారు...ఉంటారు! హాస్యం ఈయన ఇంకులో ఉంది...హాసం వీరి హృదయంలో ఉంది. ఇలాగే నిండు నూరేళ్లు నవ్విస్తూ ఉంటారని నమ్మకం కూడా ఉంది జయహో సారూ...!!!



-భ్రీం

అందుకే చదువుకున్న అమ్మాయిలెవరూ సోంబాబుని పెళ్లిచేసుకోడానికి యిష్టపడడం లేదు. సోంబాబుకి మాత్రం కనీసం డిగ్రీ వరకైనా చదువుకున్న అమ్మాయి కావాలి. మరి ఎలా ఈ సమస్య తీరుతుంది?... అందుకే సోంబాబుకి ముప్ఫై అయిదేళ్ళు దాటిపోతున్నా యింకా వివాహం కాలేదు.

అదండీ సంగతి!

యిలా వుండగా... ఎప్పటిలానే ఆ రోజు కూడా పెళ్ళిళ్ళ పేరయ్య... కొంతమంది అమ్మాయిల ఫోటోలు, బయోడేటాలతో సోంబాబు ముందు ప్రత్యక్షమయ్యాడు.

సోంబాబు... నిరాసక్తంగా ఆ అమ్మాయిల ఫోటోలు, బయోడేటాలు పరిశీలిస్తున్నాడు.

అమ్మాయి బాగుంది... కనుముక్కు తీరు లక్షణంగా ఉంది. బయోడేటా చూసాడు. పేరు అరుణ. చదువు నాలుగో క్లాసు.

ప్చ్! లాభం లేదు.

సోంబాబు విసుగుచెందని విక్రమార్కుడిలా ప్రతీ కవరు ఓపెన్ చెయ్యడం...పెదవి విరిచి ప్రక్కన పడేయడం! యిదండీ వరుస.

ఇంకో కవరు తెరిచి చూసాడు సోంబాబు.

ఫోటోలో అమ్మాయి అంత అందంగా లేక పోయినా ఫరవాలేదనిపించే రూపం! బయోడేటా పరిశీలించాడు. అందంగా టైప్ చేయబడి ఉంది బయోడేటా!

పేరు శారద MBA.

ఎగిరి గంతేసాడు సోంబాబు!

ఇన్నాళ్ళకు తన కలలు ఫలించాయి. చదువుకున్న అమ్మాయి. అది కూడా MBA.

"పేరయ్యగారూ! ఈ అమ్మాయి నచ్చింది.... వేరే ఆలోచన లేదు. ఈ సంబంధం ఖాయం చేసేయండి-అమ్మాయిని చూడాల్సిన అవసరం కూడా లేదు!" అన్నాడు ఉత్సాహంగా సోంబాబు.

పేరయ్య విస్మయంగా చూసాడు సోంబాబు వంక.

"బాబూ! సోంబాబు! అమ్మాయి చదువూ అదీ..." నసిగాడు.

"ఇంకేమీ ఆలోచించకండి పేరయ్యగారూ! నాకు అమ్మాయీ నచ్చింది. అమ్మాయి చదువూ నచ్చింది.నాన్నగారితో మాట్లాడి ముహూర్తాలు పెట్టించేయండి." హుషారుగా లేస్తూ అన్నాడు సోంబాబు.

అంగరంగ వైభవంగా... సోంబాబు పెళ్లి శారదతో జరిగిపోయింది.

ఆరోజే శోభనం... శోభనం గదిలో పాల గ్లాసుతో అడుగుపెట్టిన శారదను... అపురూపంగా పొదివి పట్టుకుని తీసుకువెళ్ళి... పాన్పు మీద పక్కన కూర్చోబెట్టుకున్నాడు సోంబాబు.

గ్లాసులో పాలు తను సగం త్రాగి మిగతా సగం శారద నోటికందించాడు.

"ఇన్నాళ్ళ నా నిరీక్షణ ఇన్నాళ్ళకు... కాదు కాదు...ఇన్నేళ్ళకు ఫలించింది. చదువుకున్న అమ్మాయిని చేసుకోవాలన్న నా ఆశ నీద్వారా నెరవేరింది. నీ రుణం ఎలా తీర్చుకోను?" గోముగా అన్నాడు సోంబాబు, సిగ్గు లొలికిస్తూ తలదించుకుని ఉన్న శారద ముఖాన్ని మునివేళ్ళతో పైకెత్తుతూ.

"చాల్లేండి సరసం!... నాకంటే ఎక్కువ చదువుకున్న అమ్మాయి యింతవరకూ మీకు దొరకలేదంటే నమ్మేస్తాననుకున్నారా?" చిరుకోపం నటించింది శారద.

"నిజం! నన్ను నమ్ము శారదా! ఎంత మంది అమ్మాయిల్ని చూసినా, నాలుగో, అయిదో తరగతితో చదువుకు ఆపేసినా వాళ్ళే! నీలా MBA చదువుకున్న అమ్మాయి కాదు కదా... కనీసం ఒట్టి BA చదువుకున్న అమ్మాయైనా నన్ను వరించలేదు." అన్నాడు సోంబాబు.

"చాల్లెండి సరసాలు! నేను MBA చదవడమేమిటి?... మా ఊళ్ళో కాలేజీ కాదు కదా కనీసం హైస్కూలైనా లేదు... మా ఊరి బళ్ళో నేను చదివింది రెండోతరగతి వరకే!" చెప్పింది శారద కిలకలా నవ్వుతూ.

దిగ్గున లేచాడు సోంబాబు.

"ఏమిటి!? నువ్వు చదివింది రెండో క్లాసా? హాస్యం ఆడుతున్నావా?" అన్నాడు కోపంగా.

"హాస్యం ఏమిటండీ బాబూ! నా బయోడేటా చూసారు కదా! అందులో రాసి వున్నట్లుగా నేను చదివింది రెండో క్లాసే." చెప్పింది శారద.

సోంబాబుకు అంతా అయోమయంగా అనిపించింది. బయోడేటాలో చూసినప్పుడు శారద MBA అని ఉంది కదా! ఆతృతగా డ్రాయర్లన్నీ వెతికి శారద బయోడేటా బయటికి తీసాడు సోంబాబు.

పేరు శారద MBA

అదే చూపించాడు శారదకు.

అది చూసి ఫక్కున నవ్వింది శారద.

"అయ్యో! శ్రీవారూ! నా పూర్తి పేరు SARADAMBA ఆ బయోడేటా టైప్ చేసినప్పుడు SARADA తరువాత పొరపాటున గేప్ వచ్చి MBA విడిగా పడింది. అది చూసి మీరు శారద అనుకున్నారు... అదీ జరిగింది. అది నా తప్పా?" అంటూ ఫక్కున నవ్వింది శారదాంబ. కాదు కాదు...SARADA MBA.

నోట మాట రాక నిశ్చేష్టుడై ఉండిపోయాడు పాపం పూర్ ఫెలో సోంబాబు, ఫిఫ్త్ క్లాస్!




# డ్రస్ రిహార్సల్

**'కుచలా ఆర్ట్ పిక్చర్స్‌వారి' 'జగదాంబ జంక్షన్ టు స్టీల్‌ప్లాంట్ మెయిన్‌గేట్ వయా గాజువాక' సినిమా పాట రిహార్సల్ కార్యక్రమం బహు రసవత్తరంగా సాగుతోంది.**

**ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటల, పాటలు, సంగీతం, నృత్య దర్శకత్వం- బహుముఖ ప్రజ్ఞాశాలి కనకాంబరాల ఏకాంబరంగారు.**

నృత్యదర్శకత్వం కూడా తనదే కావడంతో ఏకాంబరం పాట మరియు డాన్స్ రిహార్సల్స్ ఏకకాలంలో నిర్వహిస్తున్నారు.

ఐటమ్‌గర్ల్ సుమైత్‌ఖాన్ పై చిత్రీకరింపబడుతుంది ఈ పాట.

పాట బహుపసందుగా రావడానికి ఓ టేబుల్ మీద సీసాలు, గ్లాసులు కూడా తమవంతు సహకారాన్ని అందించడానికి సిద్ధంగా వున్నాయి.

గీత రచయిత ఏకాంబరంనోట పాట జాలువారుతోంది.

నే కొత్త చీరకట్టి... చిట్టిరైక తొడిగి వస్తుంటే నీ కోసం...

నీకోసం వస్తుంటే... మాయదారి చందురూడు...

మరి నేనో అన్నాడోయ్!...

హార్మోనియం తబలిస్టూ శృతిబద్ధంగా వాయిస్తుంటే సుమైత్‌ఖాన్ లయబద్ధంగా నడుమూపుతూ డాన్స్ చేస్తోంది.

అప్పుడే ఆ చిత్రనిర్మాత అనకాపల్లి అప్పల్నాయుడు చేతికర్ర ఊపుకుంటూ లోపలికొచ్చేడు దర్పంగా.

ఆయనకిదే మొదటిసినిమా.


ప్రొడ్యూసర్‌గారు సడెన్‌గా ఎంటరవడంతో హార్మోనిస్టు, తబలిస్టు ఒక్కక్షణం తాము చేస్తోన్న పని ఆపి ఆయనకు వినయంగా చేతులు జోడించి నమస్కారం చేస్తుంటే... నర్తకి సుమైత్‌ఖాన్ ఆ నృత్య భంగిమ లోనే ఆయనకు నమస్కారం చేసింది.

"రండి! రండి ప్రొడ్యూసర్‌గారు..." అంటూ ఆహ్వానించాడు ఏకాంబరం.

"అబ్బే! ఏంలేదు డైరెక్టర్‌గారూ! ఇలా వెళుతూ పాట వినబడుతుంటే ఎలా వస్తుందో చూద్దామని వచ్చాను. మీరు కానివ్వండి..." అన్నారు ప్రొడ్యూసర్‌గారు.

రిహార్సల్ కంటిన్యూ అవుతోంది.

గీతరచయిత ఏకాంబరం మరో చరణం ఆలపిస్తుంటే, హార్మోనిస్టు, తబలిస్టు తమ వాయిద్యాలను వాయిస్తుండగా సుమైత్‌ఖాన్ కైపు కళ్ళతో వగలొలికిస్తూ డాన్సందుకుంది.



"నే ఎఱ్ఱరిబ్బన్ కట్టి... మల్లెపూలు పెట్టి
నీకోసం వస్తుంటే... వస్తుంటే నీకోసం
మాయలేడి నా చెల్లి...
మరి నేనో అన్నాదోయ్!..."

"ఇదో డైరెక్ట్రూ! ఈ పాప ఈ డ్రెస్సులోనే సినిమాలో డాన్స్ చేస్తాదా?" ప్రొడ్యూసర్‌గారు అనుమానంగా అడిగారు.

సుమైత్‌ఖాన్ ధరించిన చిన్న చిన్న గుడ్డ పీలికల వైపు చూపిస్తూ.

"అవును సార్! యీదే డ్రెస్‌తో డాన్స్ చేస్తాది పాప!... దీన్నే డ్రెస్ రిహార్సల్ అంటారు!' వివరంగా చెప్పాడు డైరెక్టర్ ఏకాంబరం.

"మరయితే పాటలో వినిపించే కొత్తచీర, చిట్టి రైక, ఎఱ్ఱరిబ్బనూ, మల్లెపూలు ఒక్కటీ కనిపించవేం పాప ఒంటిమీద?" అనుమానం తీరక అడిగారు ప్రొడ్యూసర్‌గారు.

"మీరు బలేవారు సార్! పాట దారి పాటదే! డ్రెస్సు దారి డ్రెస్సుదే... అలా వుంటేనే కదా పాట హిట్టయ్యేది!" వివరించాడు డైరెక్టర్ ఏకాంబరం.

'పాటలో వినిపించేవన్నీ డాన్సర్ ఒంటిమీద కనిపించకపోతే ప్రేక్షకులు తెర చింపెయ్యరా?'

అప్పల్నాయుడుకేమీ అర్థంకాక... అయోమయంగా చూశాడు.'పిచ్చరు బాగా ఆడి నా డబ్బులు నాకొచ్చేస్తే చాలు!" అనుకుంటూ...

"మరి నేనొస్తాను డైరెక్టరుగారూ! మీ పని మీరు కానివ్వండి" అని సెలవు పుచ్చుకున్నాడు ప్రొడ్యూసర్ అప్పల్నాయుడు.

ఆయన కారెక్కుతుండగా పాటలోని చరణం వినబడుతోంది లోపలినుండి.

"నే కళ్ళ కాటుకెట్టి... నుదుట బొట్టు పెట్టి
వస్తుంటే నీకోసం... నీకోసం వస్తుంటే
మాయదారి ముక్కుపుడక...
మరి నేనో అన్నాదోయ్!..."

అయితే ప్రొడ్యూసర్ అప్పల్నాయుడు భయపడినట్లేమీ జరగలేదు... పిక్చరు హిట్టూ... సుమైత్‌ఖాన్ పాట సూపర్‌హిట్టూ అయ్యి కనక వర్షం కురిసింది. సినిమా రజతోత్సవం జరుపుకుంది. ఆ డైరెక్టర్‌తోనే మరో సినిమా ప్రారంభిస్తున్నట్లు... స్టేజ్ మీద ప్రకటించాడు నిర్మాత అప్పల్నాయుడు ప్రేక్షకుల కరతాళ ధ్వనుల మధ్య.




## పేరులోనే అంతా ఉంది!

తెలుగు నాట అనేక ప్రముఖ పత్రికలను తన రచనలతో అలంకరిస్తూ, అలరిస్తున్న రచయిత– శ్రీ కోనే నాగ వెంకట ఆంజనేయులు.

పేరులో ఏముంది– అనుకునేవారికి పేరులోనే అంతా ఉంది– అనిపిస్తారు రచయిత. 'బుస'ను గుర్తు చేసే 'నాగ' అనే పదం వీరి పేరులో ఇమిడేక 'పస'కు మారుపేరైంది. వెంకటేశ్వరస్వామిని 'వెంకట'గా కుదించిన క్లుప్తత వీరి రచనా ముద్ర. ఎదుటివారి గొప్పతనాన్ని రామనామంలా ప్రస్తుతించడంలోనూ, తన గొప్పతనం ప్రస్తావనను ఎదుటివారికే విడిచిపెట్టడంలోనూ– వీరు సాక్షాత్తూ ఆంజనేయులే. సార్థక నామధేయులు కావడం వల్లనే– సాహితీవ్యాసంగానికి కలం పేరుని స్వీకరించి ఉండరనిపిస్తుంది.

రచన (డిసెంబర్ 2014) మాసపత్రికలో ప్రచురితమైన వీరి 'ఇదీ కారణం'– ఆ పత్రిక తదుపరి సంచికలో సాహితీవైద్యం శీర్షికలో– 'నేటి పెద్దల దయనీయ స్థితిని అల్పాక్షరాల్లో ఇమిడ్చిన లోతైన కథ'గా గుర్తించబడింది. సున్నిత హాస్యాన్ని కూడా జతపరిస్తే– అదే ప్రశంసావ్యాఖ్య... వీరి రచనలన్నింటికీ వర్తిస్తుంది. అందుకు చందమామ, హాస్యానందంలో వీరి రచనలు మెచ్చుతునకలు. వాట్సాప్ బృందాల్లో అలవోకగా చేసే 'ఆమరణ ఆహార దీక్ష' వంటి వ్యాఖ్యలు– హాస్యస్ఫూర్తి వీరికి కర్ణుడికి కవచకుండలాలంత సహజం అనిపింపజేస్తాయి.



ఈ నెల హాస్యానందం 'శ్రీ కోనే నాగ వెంకట ఆంజనేయులు ప్రత్యేక సంచిక'గా వస్తున్న సందర్భంగా వారికి అభినందనలు. సముచితమైన ఈ నిర్ణయం తీసుకున్న 'హాస్యానందం'కు అభినందనలు, ధన్యవాదాలు.

హాస్యానందం పాఠకులకు శుభాకాంక్షలు.

–వసుంధర

## కోనే కొంటె రాతలు

### కోక!

నీ పట్టు'కోక'
ముట్టు'కోక'
అన్నావంటే కట్టు'కోక'
దాచేస్తావనేగా?

### ఏకాకి

'ఏకాకి' లా కూర్చున్న నిన్ను
'ఏ కాకి' పొడిచిందిరా?



### తేడా

వీడు– ఆడవాళ్ళంటే ఆమడ
దూరం పరిగెడతాడు!
వాడు– ఆడవాళ్ళంటే ఆమడ
దూరమైనా పరిగెడతాడు!


### చీరాల

వద్దన్నా 'చీరాల' ఎందుకెళ్ళేవ్?
తప్పదు నిన్ను పట్టుకు 'చీరాల'!





**కోనే నాగ వెంకట ఆంజనేయులు**
**ఫన్ ప్రశ్నలకు -**
**సుదర్శనమ్ పంచ్ సమాధానాలు**

*Cartoons: Samgram*



✦ ‘నిలబడ’ లేని నేటి యువత ప్రేమలో ఎందుకు ‘పడతారు’? మీకేమయినా తెలుసా?

**‘నిలకడ’ కోసం ప్రయత్నిస్తే... పడలేమేమోనని... ప్రేమలో!!**




✦ కోడి కూస్తే కూడా లేవని జనాలు కోడిని కోస్తే లేస్తారెందుకని గురువు గారూ?

**కూసింది కోడే కదా అని లేవరు...! కోసింది పెళ్ళాం అయ్యుండొచ్చు... అందుకు లేస్తారు... లేకపోతే కారం పెడుతుందని!!**



✦ పూర్వకాలంలో మగవాళ్ళు భార్య ఫొటోని పర్సులో పెట్టుకునే వారు. ఇప్పుడు ఎవరూ అలా పెట్టుకోవడం లేదు. ఎందుకని చెప్మా?

**ఇది ‘పూర్వకాలం’ కాదు కాబట్టి!... అయినా ఇపుడు మగాళ్ళ పర్సులన్నీ భార్యల దగ్గరే ఉంటున్నాయి!... ఇంకెక్కడ పెట్టుకుంటారు... ఫోటో?!**



✦ ఉండదని తెలిసి కూడా సీతమ్మ వారు ‘బంగారు లేడి’ ని అడగడంలో ఆంతర్యం ఏమిటి గురూజీ?

**అనాది కాలంనుంచి ఆడలేడీస్ సైకాలజీ మీకు తెలిసినట్లు లేదు సామీ...! అసాధ్యాలు అడగటం వాళ్ళ హక్కు... వాళ్ళు వీళ్ళని సాధించకుండా, వాటిని సాధ్యం చేసి తేగలగటం మగాళ్ళ టాలెంట్(?)!**

✦ 'నేను చేసే ప్రతీ పనీ కరెక్టే' అంటే ఎవరూ నమ్మరేంటండీ బాబూ?

**మీరే చెప్పటం వల్ల...! పక్కవాడితో చెప్పించకపోవటం వల్ల...! ఆ పనులన్ని ఏంటో 'డీటైల్స్' తెలీక పోవటం వల్ల... ఇవి చాలా బాబూ?!**



✦ చిలక జోస్యుడు తన చిలకతో తన జోస్యం ఎందుకు చెప్పించుకోడూ?

**అలా చెప్పించుకున్నాకే... చిలకజోస్యుడిగా సెటిల్ అయ్యాడన్న విషయం... 'చిలక' పదుగురిలో 'పలుకు'తుందేమోనన్న ఫియర్‌తో!**






✦ మాయల ఫకీరు ప్రాణం చిలకలోనే ఎందుకు ఉందో మీకు తెలిస్తే చెప్పరూ?

**మొదట్నుంచీ ఫకీరుగారికి చిలకలంటే ప్రాణం...రాకుమారి చిలకల్ని మాయ చేసి ఎత్తుకొచ్చేవాడు... సింబాలిక్‌గా 'చిలకే నా ప్రాణం' అని చెప్పటానికేమో...(చిలక కాకపోతే ఎలక...ఇంతకీ ఈ పరిశోధన దేని గురించటా?!)**



✦ ఆశ లావు పీక సన్నం – దీనికి ఓ ఉదాహరణ మీ నోటి నుండి వినాలని మా లావు ఆశ?



**'ముక్కు దొడ్డది, హెడ్ బాల్డ్‌ది'!... తీరిందిగా మీ 'లావు'ఆశ?!**



✦ కేజీ వంకాయలు ఎలా యిస్తున్నా వంటే 'తూచి' అని కొంటెగా చెప్పే మా కూరలమ్మికి ఏం జవాబు చెప్పను?

**తూచేనా?... నేను ఆచేమో అనుకున్నా... అని ఆచీ తూచీ చెప్పండి జవాబు... చిలిపిగా! సరిపోద్ది ఇద్దరికీని!!**

✦ 'నెలత'ప్పేది వాళ్లే కాబట్టి ఆడవాళ్ళని 'నెలత' అంటారని చెబితే ఎవరూ నమ్మరేమిటండీ?

**నమ్మనంత మాత్రాన మీకెందుకూ... ఆ కలత?! అదేదో ఆ తప్పించిన వాళ్ళకి గాని!!**





✦ కడవంత గుమ్మడికాయ చిన్న కత్తిపీటకు లోకువవడం ఏమైనా బావుందా చెప్పండి?

**రోలొచ్చి మద్దెలతో మొర పెట్టుకోవటం ఏమైనా బావుందా... ముందు ఇది చెప్పండి!**




# ఎర

**పరమేశం,పార్వతమ్మ ఆదర్శ దంపతులు. పేర్లు కూడా అతికి నట్లు సరిపోయాయి కదూ! కానీ గిట్టని వాళ్ళు వాళ్ళని మరమేకు, పర్వతమ్మ అంటుంటారు. ఎందుకంటే దూరం నుండి వాళ్ళిద్దరూ ఒక్కొక్కసారి పద్దెనిమిది (18) లాగానూ, మరోసారి ఎనభై ఒకటి (81) లాగానూ జంటగా కనిపిస్తుంటారు.**

ఇంకా స్పష్టంగా చెప్పాలంటే వాళ్ళిద్దరూ అదేదో సినిమాలో ఎల్బీ శ్రీరాం, కల్పనారాయ్‌ల జంటలా ఉంటారన్నమాట.

ఒక రోజు హడావుడిగా ఫోన్‌లో...

"హల్లో! డాక్టర్ భీమారావు కావాలండి అర్జెంటు!"


"హల్లో! నేను డాక్టర్ భీమారావునే మాట్లాడుతున్నాను. మీరెవరూ?"

"డాక్టర్‌గారూ! నేనూ పరమేశాన్ని"

"పరమేశమా?"

"అదేనండి పర్వతమ్మ ... అదే అదే... పార్వతమ్మ మొగుణ్ణి!"

"ఆc ఆc! పరమేశం గారూ... మీరా!... ఏంటి సంగతి?"



"మా పర్వతం... అదే పార్వతమ్మ పడుకుంది."

"పడుకుందా!... అయితే?"

"అదేనండి. మధ్యాహ్నం సుష్టుగా భోజనం చేసిన తరువాత హాల్లో అడ్డంగా పడి నిద్ర పోతుంటే..."

"పోతుంటే?"

"ఆవిడ తన గుహలాంటి నోరు తెరిచి గురకపెట్టి నిద్రపోతుంటే..."

"ఏం జరిగిందండీ?"

"ఓ ఎలుకని వేటాడుతూ ఓ పిల్లి మా ఆవిడ చుట్టూ చక్కర్లు కొడుతూ, ఒకదాన్నొకటి తరుముకుంటుంటే..."

"యిది మరీ బాగుందండోయ్, పిల్లి ఎలుక ని తరమడం వరకూ బాగానే ఉంది. ఎలుక పిల్లిని తరమడమేమిటండీ విచిత్రం కాకపోతే?"

"యిందులో విచిత్రం ఏమీలేదు లెండి. అవి రెండూ ఆ పర్వతం చుట్టూ పరుగు పెడుతుంటే, నాకు ఒక్కొక్కసారి ఆ ఎలుకే పిల్లిని తరుముతున్నట్లనిపించిందండి."

"ఓ అలాగా! సరే! సరే!... పాయింట్లోకి రండి!"

"యిదిగో వస్తున్నా! అలా అవి ఒకదాన్నొకటి తరుముకుంటూ తరుముకుంటూ... హఠాత్తుగా ఆ ఎలుక తెరిచి ఉన్న మా ఆవిడ నోట్లోకి దూరిపోయిందండి... దానివెనుకే....!"

"యింకేం చెప్పకండి. నాకంతా అర్థమైపోయింది... యిప్పటికే ఆలస్యం చేశారు. యింకా ఆలస్యమైతే ఆ ఎలుక మీ ఆవిడ నోట్లో జీర్ణం అయినా అయిపోవచ్చు. నేనిప్పుడే బయలుదేరి వస్తున్నాను.

"త్వరగా వచ్చేయండి డాక్టర్ గారూ!"

"యిదిగో బయలుదేరుతున్నాను. నేనొచ్చేలోగా మీరో పని చెయ్యండి"

"ఏమిటి సార్! త్వరగా చెప్పండి!"

"ఏం లేదు... మీ ఆవిడ నోటి ముందు ఏ జంతిక ముక్కో, చేగోడీ ముక్కో పెట్టి ఉంచండి"

"ఆc! అలాగే డాక్టర్ గారూ! అర్థమయింది. మీరు త్వరగా బయలుదేరి వచ్చేయండి"

"అలాగే!" క్లిక్!

✦ ✦ ✦

"రండి డాక్టర్ గారూ!,, రండి రండి!"

"యిదిగో వచ్చేశా! అరే! అదేమిటి? నేను మీ ఆవిడ నోటి ముందు జంతిక ముక్కో, చేగోడీ ముక్కో కదా పెట్టి ఉంచమని చెప్పాను? అలాగైతే ఆ వాసనకి ఎలుక– మీ ఆవిడ నోట్లోంచి బయటికి వచ్చేసినా రావచ్చని అలా చెప్పాను. మీరేమిటి మీ ఆవిడ నోటి ముందు పాలగ్లాసు పెట్టారు?"

"ఆ విషయం నాకు తెలుసు డాక్టర్ గారూ! కానీ ఎలక కంటే ముందు పిల్లిని బయటికి లాగాలి కదా!"

"ఆc!!"

## బాపు బొమ్మకు కోనే కథ

'స్వాతి' సౌజన్యంతో



### ప్రేమాయణంలో

**"హ**లో స్వప్నా!... ఎప్పుడు ఊరినుండి రాక? నిన్ను చూడకుండా ఈ నాలుగు రోజులూ నరకం అనుభవించానంటే నమ్ము! సాయంత్రం పార్కుకొచ్చేయ్! మనం ఎప్పుడూ కూర్చునే బెంచి మీద నీకోసం ఎదురు చూస్తుంటాను."

"అలాగేలే! అవును. ఏమిటీ రాత్రి కాలేజీడే ఫంక్షన్‌లో ఏదో ప్రైజ్ కొట్టేవట? ఏమిటి?"

"అదంతా సాయంత్రం సమక్షంలో విన్నవి స్వాము. ఫోన్ పెట్టెయ్...బై..."

✦✦✦

సాయంత్రం ఆరయ్యేటప్పటికి... పార్కు ముందు ఆటో దిగి తాము మామూలుగా కూర్చునే బెంచికి చేరుకుంది స్వప్న.

ఎదురుగా కూర్చుని వున్న ముసలాయన పేపరు మడిచి ప్రక్కనే పడేసి స్వప్నవైపు దృష్టి సారించాడు.

"యిలా వచ్చి కూర్చో అమ్మాయ్!" పెద్దరికంగా పిలిచేడు ముసలాయన.

ఆయన వంక చిరుకోపంగా చూసింది స్వప్న.

ఇంతలో ఆ ముసలాయన పల్లీలవాడిని పిలిచి పల్లీలు కొన్నాడు.

లాల్చీజేబులోంచి పర్సుతీసి అర్ధరూపాయి యిచ్చాడు పల్లీలతనికి.

యధాలాపంగా పర్సు వంక చూసిన స్వప్న కళ్ళు మెరిశాయి.

"తీసుకోమ్మా!"

"థాంక్స్ తాతగారూ!" నవ్వుతూ తీసుకుంది.

ముసలాయనకు హుషారొచ్చినట్లయింది.

"ఎవరికోసమమ్మా ఎదురుచూస్తున్నావు?"

"ఆ రానివాళ్ళకోసం... ఎంతసేపు ఎదురు చూసి ఏం లాభంలెండి! మామ్మగారు కులాసాగా ఉన్నారా?" అనడిగింది.

"ఆవిడ ఏనాడనగాపోయింది!" అన్నాడు ముసలాయన విచారంగా.

"అయినా ఫరవాలేదు తాతగారు. నేను మీ తోడు నీడగా ఉంటాన్లెండి!" పొడవాటి జడ ముసలాయన మెడచుట్టూ వేసి దగ్గరగా లాక్కుని కన్నుకొట్టింది స్వప్న.

ముసలాయన బిత్తరపోయినట్లు చూశాడు.

"కంగారు పడకండి తాతగారూ. ఈ మీసాలెక్కడ కొన్నారు?" మీసాలు పట్టుకు లాగింది. అవి ఊడొచ్చాయి.

సుధీర్ రూపం బయటపడింది.

"అమ్మదొంగా! ఎలా కనుకున్నావ్?... ఈ వేషానికే నిన్న ప్రైజొచ్చింది!"

"అదే! నీ బర్త్‌డేకి నేను ప్రెజెంట్ చేసిన పర్సు పట్టిచ్చింది నిన్ను. అయినా అబ్బాయి గారికిదేం మోజు! ముసలివేషం మీద!"

"ఏ వేషం వేసినా నా దేవి కోసమే కదా!" నవ్వేడు సుధీర్.




### అంతా నవ్వుల విరామం!

**ఓ** సరదా సాయంత్రం రవీంద్ర భారతిలో 'బాపు' గారిని కలిశాం! నేనూ, కోనే గారూ. బాపు అంటే బాపు కాదు. వారబ్బాయి వెంకటరమణ. అదే నవ్వు, అదే పలకరింపు... ఆయనతో మాట్లాడుతున్నంత సేపూ మేమిద్దరం సాక్షాత్తూ బాపు గారితో వున్నట్టుగానే సంబరపడిపోయాం. అదొక మంచి జ్ఞాపకం.

బాపు గారి అబ్బాయిని కలవడం ఒక ఆనందమైతే అది మిత్రులు కోనే గారితో కలవడం మరింత ఆనందం.



కోనే గారి కంటే ముందు ఆయన పేరే నాకెక్కువ పరిచయం. సమాజానికి ఉపయోగించే, సందేశాత్మక రచనలు ముందు పరిచయం. తర్వాత ఎప్పుడో ఆయన కలిశారు. మంచి హాస్య ప్రియులు కూడా కావడంతో ఇంకా ఎక్కువ దగ్గరయ్యారు. నా ప్రతి కార్టూనుకు మొట్టమొదట స్పందించేది వీరే. సరదా మనిషి. వారి పేరున మన 'సరదా' పత్రిక ప్రత్యేక సంచిక వెలువరించడాన్ని మిత్రుడుగా ఆనందిస్తూ అభినందిస్తున్నాను. **–సరసి**

# బాధే సౌఖ్యమనే భావన రానీయడమే నా ఆనందం వెనుక ర 'హాస్యం'.

-కోనే నాగ వెంకట ఆంజనేయులు

**హాస్య రచనలు చేయటం కత్తిమీద సాములాంటిది... అర్ధశతాబ్దంగా అలాంటి సాముని అవలీలగా చేస్తూ... హాస్య సాహితీ ప్రపంచంలో తనకంటూ ఓ సముచిత స్థానం ఏర్పరచుకున్న రచయిత శ్రీ కోనే నాగ వెంకట ఆంజనేయులుగారు. హాస్య కథలకు ప్రాణం కొసమెరుపు. ఆ మెరుపును ఊహాకతీతంగా మెరిపించి మురిపిస్తారు కోనేగారు. 2003 నుండి హాస్యానందంతో ఆయన అనుబంధం కొనసాగుతోంది. డిశంబర్,22 న ఆయన పుట్టిన్రోజు సందర్భంగా ఈ ప్రత్యేక సంచికలో ప్రత్యేకమైన ముఖాముఖీ ఇది!**



**? హాస్యానందం మీ జన్మదినం (డిసెంబర్ 22) సందర్భంగా ప్రత్యేక సంచిక వెలువరించడం ముదావహం. మీకు శుభాభినందనలు. ఆంజనేయులు గారూ, సాహిత్య రంగంలో మీరీ స్థాయిలో ఉన్నందుకు గర్వ పడుతుంటారా?**

✦ గర్వం అంటూ ఏమీ లేదండి. 'సమ్' తృప్తి మాత్రం ఉంది. హాస్య, బాలల కథల రచయితగా గుర్తింపు రావడం సంతోషం కలిగిస్తుంది.

**? మీ పుట్టినూరు విశేషాలు చెప్పండి.**

✦ మా ఊరు ఏలూరు అనబడే హేలాపురి అండీ. నా బాల్యం, చదువు అంతా మా ఊర్లోనే గడిచింది. బోలెడన్ని అనుబంధాలు, అనుభూతులు మా ఊరితో చాలా ఉన్నాయి!

**? సాహిత్య రంగంలో మీ కుటుంబ పరంగా మీ ముందు ఎవరైనా ఉన్నారా?**

✦ నా ముందు ఎవరూ లేరండీ. నేనే మొదలు, మోడల్. నా తరువాత నా మనవడు సిద్ధు కార్టూనిస్ట్‌గా అంతో ఇంతో పేరు తెచ్చుకుంటు న్నాడు. ఎనిమిదవ తరగతి చదువుతున్నప్పుడే హస్యానందం పత్రికలో కార్టూన్స్ వేసి జూనియర్ కార్టూనిస్ట్ అవార్డు కూడా అందుకున్నాడు. ప్రస్తుతం ఇంజినీరింగ్ చదువులో పడి కార్టూన్స్‌కి కామా పెట్టేడు.

**? మీరీ రంగంలో అడుగు పెట్టడానికి ప్రేరణ?**

✦ మా అమ్మ గారు ఆంధ్రప్రభ, పత్రిక చదివేవారు నా చిన్నప్పుడు. ఆ చిన్న వయసులో నేనూ ఆ పుస్తకాలు తిరగేసే వాడిని... అలా సాహిత్యం పై అభిరుచి పెరిగిందనుకుంటాను. అదీ కాక మా కుటుంబంలో మా బంధువు ఒకాయన అంబటి ఆనంద గోపాల బాబ్జీరావు గారని – AAG బాబ్జీరావు పేరుతో అప్పట్లో వచ్చిన జోకర్, పకపకలు, నవ్వులు పువ్వులు లాంటి హాస్య పత్రికలలో హాస్య కథలు వ్రాసేవారు. ఓ విధంగా ఆయనే నాకు ప్రేరణ అని చెప్పవచ్చును.

**? మీ సాహిత్య ప్రయాణం... మీ ఇష్టాఇష్టాల గురించి వివరించండి!**

✦ చిన్నతనం నుంచీ పుస్తకాలు, పత్రికలూ చదవగా, చదవగా నాకు కూడా నా పేరు అచ్చులో చూసుకోవాలనిపించింది. అందుకు నాందిగా పత్రికలకు ఉత్తరాలు, ప్రశ్నలూ పంపించడం మొదలు పెట్టేను. అవి ప్రచురితమై నా పేరు అచ్చులో అందంగా కనబడడంతో ఆ తరువాత చిన్న చిన్న జోక్స్ వ్రాస్తూ చిన్న కథలు వ్రాయడం మొదలు పెట్టేను. అలా...అలా వ్రాస్తూ... యిప్పుడు యిలా...

ప్రచురితమైన నా నాలుగు వందల పై చిలుకు కథల్లో సుమారు ముప్పై కథలు వివిధ పోటీల్లో బహుమతులు పొందేయి. అందర్నీ సరదాగా నవ్వించేలా సంభాషించడం యిష్టం. ఇంకా పాటలు పాడు కోవడం కూడా నాకు ఎంతో ఇష్టమైన విషయం.

**? మీరు రాసే పిల్లల కథల్లో తప్పని సరిగా మీ స్వంత ఊరి ప్రస్తావన ఉంటుంది. ఇంకా చెప్పాలంటే మీ ఊరి పేరుతోనే 'కథ' మొదలవు తుంది. మీ ఊరిపై మమకారమా...లేక సెంటిమెంటా?**

✦ సెంటిమెంట్ కాదు గానీ అందరిలాగే మా ఊరిపై మమకారం అని చెప్పవచ్చు. ఇప్పటికీ మా ఊరితో నా అనుబంధం కొనసాగుతూనే ఉంది. మా ఊరితో నా అనుబంధం గురించి ఇటీవలే ఓ మాసపత్రికలో

ఓ వ్యాసం కూడా వ్రాశాను. అది చదివి ఎంతో మంది మా హేలాపురి వాసులు అనేకులు ఫోన్లు చేసి ఆ వ్యాసం చదివి మేము కూడా మా బాల్యం లోకి వెళ్లిపోయామంటూ వాళ్ళ అనుభూతులూ, అభినందనలూ తెలియజేశారు.

**? హేలాపురి మీ పుట్టిన ఊరయితే విశాఖ/ఉక్కు నగరి మీ మెట్టినూరుగా భావించ వచ్చా? రెండిట్లో ఏదంటే మీకు ఇష్టం?**

✦ నా పుట్టిన ఊరు హేలాపురి అన్నది అందరికీ తెలిసిన విషయమే. ఇక విశాఖపట్టణం మా అత్తగారి ఊరు కాబట్టి మీరు అన్నట్టు– నేను మెట్టినూరు విశాఖపట్టణం అని భావించవచ్చును. ఇక ఏ ఊరంటే ఇష్టమంటే – హేలాపురి నాకు యిష్టమైన చద్దనం పెడితే విశాఖపట్టణం బిరియానీ పెట్టింది. దాన్ని బట్టి మీరే గ్రహించండి.

**? సరే! మీకు పిల్లల కథలంటే ఇష్టమా? హాస్య కథలంటే ఇష్టమా? రెండూ ఇష్టమేనని మాత్రం చెప్పకండి.**

✦ పిల్లలు కూడా యిష్టపడే హాస్య కథలు అంటే యిష్టమండీ.

**? చందమామలో వందల కథలు ప్రచురితం అయ్యాయి. అలాగే హాస్యానందంలో కూడా. చంద మామ, హాస్యానందం రెండిట్లో దేన్ని ఎక్కువ ప్రేమించారు?**

✦ రెండూ రెండు కళ్ళు అనుకుంటా నండీ. రెండు పత్రికలనూ ఒకేలా ప్రేమించాను, ప్రేమిస్తున్నాను.

**? చందమామ, హాస్యానందం– రెండిట్లో మీకు నచ్చిన అంశాల గురించి చెప్పండి!**

✦ ఏ పత్రికలో అయినా కొస మెరుపు కథలు చదవడానికి ఇష్టపడతాను. అలాగే అటువంటి కథలు వ్రాయడం కూడా చాలా యిష్టం. ఎక్కువగా అలాంటి కథలు వ్రాయడానికే ప్రయత్నిస్తాను. చందమామలో కథలకు వేసే బొమ్మలూ, హాస్యానందంలో కార్టూన్స్ నాకు నచ్చిన అంశాలు.

**? మీరు కథ చెప్పే తీరు చాలా అద్భుతంగా ఉంటుంది. ఆ నేర్పు, కూర్పు ఎక్కడ అలవడింది? మీకు ఈ విషయంలో ప్రభావం చూపిన వ్యక్తులెవరు?**

✦ నేను కథ చెప్పే తీరు అద్భుతంగా ఉంటుందన్న విషయం మీరు చెప్పే వరకూ నాకే తెలియదు. కథలు చదవగా, చదవగా ఆ నేర్పు అలవడిందనుకుంటాను. ఈ విషయంలో నా మీద ప్రభావం చూపిన వారెవరంటే ప్రముఖ రచయిత శ్రీ మల్లాది వెంకట కృష్ణ మూర్తి గారి పేరు ముందుగా చెబుతాను.

**? హాస్యానందం రామూ గారికి కోనే నాగ వెంకట ఆంజనేయులు గారంటే చాలా ఇష్టం. అలాగే మీకు కూడా. ఈ రామాంజనేయ బంధం ఎప్పటి నుండి? మీ యిద్దరి మధ్యా పరిచయం ఎలా ఏర్పడింది? గుర్తుంటే చెప్పండి. లేదంటే గుర్తు తెచ్చుకుని చెప్పండి.**

✦ మా ఇద్దరి మధ్యా రామసేతు ఏర్పడింది మీ కారణంగానే కదా! హాస్యానందంలో మీ తండ్రిగారు శ్రీమళ్ళ జగన్నాధం గారి పేర మీరు నిర్వహించిన పోటీలకు నేను న్యాయనిర్ణేతగా వ్యవహరించే సందర్భం లోనే రామూగారితో ముఖాముఖి పరిచయం ఏర్పడింది.

**? రామూ గారంటే ఎక్కువ ఇష్టమా? రామూ గారు రూపొందించే హాస్యానందం అంటే ఎక్కువ ఇష్టమా? హాస్యానందంతో మీ ప్రయాణం గురించి చెప్పండి?**

✦ రామూ గారి చేతిలో రూపు దిద్దుకున్న హాస్యానందం అంటే యిష్టం. మరోలా చెప్పాలంటే రామూగారూ, హాస్యానందం–రెండూ లేక యిద్దరూ సమానమే కానీ రామూ గారు కొంచెం ఎక్కువ సమానం.

ఇప్పటి వరకూ హాస్యానందంలో ఎనభైకి పైగా కథలు ప్రచురిత మైనాయి. అందులో ఆరేడు కథలకు బహుమతులు కూడా వచ్చాయి. ఇంకా కాఫీ టైమ్, నాటి కార్టూన్‌కి నేటి కామెంట్, మాటలాట లాంటి శీర్షికలు కొంతకాలం నిర్వహించే అవకాశం యిచ్చి ప్రోత్సహించారు రామూగారు. అందుకు ఆయనకు సర్వదా కృతజ్ఞుడనై ఉంటాను.

**? మీ రచనలపై ఓ పాఠకుడిగా మీ అభిప్రాయాన్ని చెప్పమంటే ఏం చెబుతారు?**

✦ అబ్బే... నువ్వింకా బాగా ఎదగా లోయ్ ఆంజనేయులూ!

**? మీరు ఇప్పటి వరకూ ఎన్ని రచనలు చేశారు?**

✦ మొన్న లిస్ట్ చెక్ చేసి చూస్తే 430 పైగానే చిన్నా, పెద్ద కథలు ప్రచురింప బడినట్లు తెలిసింది.

**? మీకు రావాల్సినంత గుర్తింపు వచ్చిందనే భావిస్తున్నారా లేక అసంతృప్తి ఏమైనా ఉందా?**

✦ నాలుగేళ్ల క్రితం వరకూ – 'నా గురించి ఎవరికీ తెలియని అనామక రచయితను నేను' అనే అభిప్రాయంలో ఉండేవాడిని. ఎప్పుడైతే నా చేతిలోకి స్మార్ట్ ఫోన్ వచ్చి సాటి రచయితలతో పరిచయాలు ఏర్పడ్డాయో అప్పటి నుంచీ కథా ప్రపంచంలో నాకు కూడా తగినంత గుర్తింపు ఉన్నదనే విషయం తెలియవచ్చింది. పెద్ద పెద్ద రచయితలు కూడా నా హాస్యాన్ని యిష్టపడతామని తెలియజేస్తుంటే సంబరం కలుగుతుంది. ఇక ఇప్పుడు అసంతృప్తికి తావే లేదు.

**? తెలుగులో గతానికీ వర్తమానానికీ పత్రికల నిర్వహణ ఎలా ఉంది? మీ అనుభవాన్నీ, అభిప్రాయాన్నీ తెలియజేయండి.**

✦ గతంలో మన కథ ప్రచురణకు ఎంపిక అయితే వెంటనే ఆ విషయం తెలియజేసేవారు. తిరిగి ప్రచురణకు ముందు తెలియజేసి కాంప్లిమెంటరీ కాపీ, పారితోషికం కూడా పంపేవారు. ఇప్పుడు ఏవో కొద్ది పత్రికలు తప్ప మిగతా పత్రికలు ఆ సంప్రదాయాన్ని పాటించడం లేదు. అయినా ఇప్పుడు ఉన్న పత్రికలు గతంతో పోల్చితే చాలా తక్కువే కదా! పత్రికల వాళ్ళు మనం పంపిన రచన ప్రచురణకు స్వీకరిస్తున్నదీ, లేనిదీ వెంట వెంటనే తెలియపరిస్తే బావుంటుంది. ఉత్తరం కూడా

> **"ప్రచురితమైన నా నాలుగు వందల పై చిలుకు కథల్లో సుమారు ముప్పై కథలు వివిధ పోటీల్లో బహుమతులు పొందేయి. అందర్నీ సరదాగా నవ్వించేలా సంభాషించడం యిష్టం. ఇంకా పాటలు పాడుకోవడం కూడా నాకు ఎంతో ఇష్టమైన విషయం."**

## కోనే కొంటె కొశ్చెన్లబాబు!



✦ ముఖ్యమంత్రి సీట్లో 'కూర్చోవాలంటే?...'
**ఎలక్షన్లో 'నిలబడాలి.'**

✦ 'వయసు' కామెంట్ ప్లీజ్?
**యుక్త వయసులో తగ్గించి, వృద్ధాప్యంలో పెంచి గొప్పగా చెప్పుకునేది.**

✦ వేసవి కాలంలో సూర్యుడు నిప్పులు 'చెరుగు'తాడెందుకు?
**ఎండ 'దంచేస్తుంది' కాబట్టి!**

✦ డబ్బు కామెంట్ ప్లీజ్?
**ఇప్పుడు దాచుకుంటే వృద్ధాప్యంలో 'కాసు' కుంటుంది.**

✦ 'మలేరియా' ఎవరికొస్తుంది?
**'దో'మలేరియా'లో ఉన్న వాళ్ళకి!**

వ్రాయాల్సిన అవసరం కూడా లేదు ఈ కాలంలో. అందరి చేతిలో ఫోన్లు ఉన్నాయి కాబట్టి ఓ మెసేజ్ లేదా మెయిల్ ద్వారా తెలియపరిస్తే బావుంటుందన్నది నా అభిప్రాయం.

**? మీ పిల్లల కథల పుస్తకాలు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు మూడు సంపుటాలు అచ్చేశారు. మీకు స్వంతంగా పుస్తకాల్ని అచ్చేసుకునే కోరికేలేమైనా ఉన్నాయా?**

✦ స్వంతంగా పుస్తకాలు అచ్చు వేసుకుని అమ్మకానికి పెట్టే తెలివి తేటలు నాకు లేవు. నా హాస్య కథలూ, సామాజిక కథలతో పుస్తకాలు వెలుగు చూడాలనే ఆశ ఉంది. ఎవరైనా పబ్లిషర్ వేస్తామంటే నా కథలు పుస్తక రూపంలో చూసుకోవాలనే ఆశ ఉంది గానీ దాని కోసం ఎలా ప్రయత్నించాలో తెలియదు. స్వంతంగా ప్రచురించుకునే విషయానికి వస్తే అంత ఆర్థిక పరిస్థితి లేదు నాకు ప్రస్తుతానికి.

**? రాతలోడు, పాట్లోడు, నౌలోడు – ఈ మూడింట్లో నౌలోడు గురించి కొంచెం చెబుతారా?**

✦ నౌలోడు నవ్వుతూ నవ్విస్తాడు ఎవరినీ నొప్పించకుండా!

**? రాతలోడు, నౌలోడు వేరు వేరంటారా?**

✦ అంతే కదా మరి! నౌలోడు ఎప్పుడూ నవ్విస్తూనే ఉంటాడు... రాతలోడు అప్పుడప్పుడూ ఏడిపిస్తాడు కూడా.

**? పాట్లోడు గురించి మాకేమీ తెలీదు. మీరు ఎన్ని పాటలు రాశారు. సినిమాలకేమైనా యిచ్చారా?**

✦ పాట్లోడు పాటలు రాయడు. పాటలు పాడుతాడు. అంతేనండి.

**? మీ గురించి మీరేమి అనుకుంటారు?...సాధించిన విజయాల గురించి చెబుతారా?**

✦ నాకు నేనే గొప్ప స్నేహితుడిని! కొంత కాలం ఆంధ్రా యూనివర్సిటీ లోనూ, ఎక్కువ కాలం విశాఖపట్టణం స్టీల్ ప్లాంట్‌లోనూ ఉద్యోగాలు చేశాను. ఉద్యోగంలో సాధించిన విజయాల కంటే రచనా రంగంలో సాధించిన విజయాలే ఎక్కువండీ.

**? సినిమాలు చూస్తారా? ఎలాంటి సినిమాలు ఇష్టం. కామెడీ సినిమాలకు కథలు వ్రాయొచ్చుగా?**

✦ ఒకప్పుడు థియేటర్ కి వెళ్ళి చూసేవాడిని. ఇప్పుడు టీ వీక్షణమే సర్. హాస్యరస భరిత సినిమాలను ఎక్కువ ఇష్టపడతాను. కామెడీ సినిమాలకు కథలు వ్రాయడమా? మనకెవరు ఇస్తారండీ బాబూ అవకాశం? వాళ్లే 'రాసు'కుంటారు కదా!

**? ఎప్పుడే నవ్వుతూ, హాయిగా, ఆనందం కనిపిస్తారు. దీని వెనుక రహస్యమేమిటో చెప్తారా?**

✦ బాధే సౌఖ్యమనే భావన రానీయడమే దీని వెనుక ర'హాస్యం'.



**? యువ కథా రచయితలకు మీరుయిచ్చే సందేశమేమిటి?**

✦ అందరూ చెప్పే మాటే – సందేశాలు యిచ్చేంత పెద్ద రచయితను కాను అనేదే. బాగా వ్రాయాలంటే ముందు బాగా చదవాలి. నేను అదే చేస్తుంటాను. నేను వ్రాయకుండా ఉన్నానంటే దాని అర్థం ఆ సమయంలో చదువుతున్నానని.


**? ఈ ఇంటర్వ్యూకు కొసమెరుపేమైనా ఉందా?**

✦ నా పుట్టిన రోజు సందర్భంగా రాముా గారు హాస్యానందం ప్రత్యేక సంచిక వెలువరించడం నాకు చాలా చాలా ఆనందంగా మరి కాస్త గర్వంగా కూడా ఉంది.

–ఇంటర్వ్యూ: **ఎమ్.వి.జె.భువనేశ్వరరావు**

**బాపు బొమ్మకు కోనే కథ**

'స్వాతి' సౌజన్యంతో



# అర్థరూపాయి - అనర్థం

రైలు ఒక్క కుదుపుతో ఏదో స్టేషన్‌లో ఆగడంతో మెలకువ వచ్చింది గోపాల్‌కి.

పడుకుని పడుకుని విసుగ్గా వుందనిపించి క్రిందకు దిగి క్రింద కూర్చున్న వాళ్ళను కాస్త సర్దుకోమని చెప్పి వాళ్ళ మధ్యలో యిరికేడు.

అన్నట్టు ఉదయం నించీ ఖర్చు పెట్టిన డబ్బుకి ఎకౌంట్ రాయలేదన్న విషయం జ్ఞాపకం వచ్చి జేబులోంచి చిన్న నోటు పుస్తకం బాల్‌పెన్నూ తీసాడు. తను బయల్దేరిన దగ్గరనుంచి పెట్టిన ఖర్చును జాగ్రత్తగా లెక్క రాసాడు.

జేబులోంచి తీసి...డబ్బెంతుందో లెక్క వేసాడు. తన ఎకౌంట్‌తో టేలీ చేసాడు. అర్థరూపాయికి లెక్క తెలియడం లేదు.

జేబులో ఉండవలసిన దానికంటే అర్థరూపాయి తక్కువ వుంది. యింకేం ఖర్చు పెట్టేడు తను? అర్థరూపాయి తక్కువ ఎలా వచ్చింది? మళ్లీ అన్ని జేబుల్లోనూ వెదికేడు... ప్చ్! లేదు.

అతనికి బుర్ర పిచ్చెక్కిపోతోంది. లెక్కంటే లెక్కే! ఒక్క పైసా కూడా తేడా రావడానికి వీల్లేదు. మరయితే ఏమయినట్లు? ఒకటా, రెండా? యాభై పైసలు. మళ్లీ తను ఏమేం ఖర్చులు పెట్టేడో జ్ఞాపకం తెచ్చుకుని నోట్‌బుక్‌తో కంపేర్ చేసాడు. కానీ ఏమీ తేలలేదు.

గోపాల్‌కి అయోమయంగా ఉంది.

కొంపతీసి తన జేబులోంచి ఓ అర్థరూపాయి ఎవడో కొట్టేయలేదు కదా! మళ్లీ తన పిచ్చి ఆలోచనకు తనకే నవ్వొచ్చింది గోపాల్‌కి. జేబు కొట్టేవాడు జేబంతా ఊడ్చేస్తాడు కాని బీడీల కోసమని ఒక్క అర్థరూపాయి మాత్రమే కొట్టేయడు కదా!

ఒకవేళ తను పడుకున్నప్పుడు జేబులోంచి ఓ అర్థరూపాయి జారిపోయి పైబల్ల మీద పడిపోలేదు కదా! ఈ ఆలోచన రాగానే చటుక్కున లేచిపోయి తను పడుకున్న బల్ల మీద కాలు మోపడానికి చోటు లేకపోవడంతో ఆ ప్రక్కన కూర్చున్న ముసలాయన భుజం మీదో కాలు, ఈ ప్రక్కన కూర్చున్న పెద్దమనిషి భుజం మీదో కాలు వేసేసి ఆ బల్లమీద చూశాడు. కరెక్ట్! తన ఊహ కరెక్ట్! అదిగో.. అల్లదిగో... ఆ దుప్పటి అంచున మెరుస్తూ బుజ్జి అర్థరూపాయి బిళ్ళ అనుకుంటూ దాన్ని అందుకోబోయేంతలో క్రింద - భుజాలు నొప్పెడుతున్న యిద్దరు పెద్దమనుషులు తమ భుజం మీది కాళ్ళను ప్రక్కకు ఒక్క తోపు తోశారు.

అంతే దబ్బున క్రింద పడ్డాడు గోపాల్. నడుం కలుక్కుమంది. ఎదుటి బల్ల అంచు తగిలి వెన్నెముక విరిగిందేమో కూడా.

ఆ తరువాత మూడునెలల విశ్రాంతి.

మూడువేల రూపాయల ఖర్చు అయితేనే గానీ మళ్ళీ నడవలేక పోయాడు పాపం పిసినారి గోపాల్.





## అంతా నవ్వుల విరామం!

తెలుగు అక్షరాల్లో అవే హల్లులు అచ్చులు కానీ... ఏమిటో వారి చేతి మీద నుంచి వెలువడితే అలరిస్తుంటాయి... నవ్విస్తుంటాయి, కవ్విస్తుంటాయి, స్థిరంగా కూర్చోనివ్వవు, చదవనివ్వవు, అంతా నవ్వుల విరామం! వారెవరో ఎందుకు అవుతారు? మన కోనే నాగ వెంకట ఆంజనేయులు గారే! ఎప్పుడు... నేను డిగ్రీ చదువుతున్న రోజులనుంచి నిరంతరం తపిస్తున్న, రాస్తున్న కథకులు, స్వాతి బాపు బొమ్మకు కథలలో ప్రతివారం వారు ఉండాల్సిందే... అర్థశతాబ్దంగా హాస్యం పండిస్తున్న మంచి కథకులు కోనేగారి మీద హాస్యానందం ప్రత్యేక సంచికను తీసుకురావడం అభినందనీయం సముచితం... ఇప్పుడున్న హాస్య రచయితలలో ప్రముఖులు కోనేగారే కదా! అభినందనలు సార్!



**-ఈతకోట సుబ్బారావు, సంపాదకులు విశాలాక్షి**

## కోనే చెప్పిన జోక్!

ఆ మధ్య మా అమ్మాయిపెళ్లి చేసి ఓ భారం దింపుకుని నిశ్చింతగా విశ్రాంతి తీసుకుంటున్నాను.

మా ఫ్రెండ్ రామకృష్ణ- వాళ్ళ అమ్మాయి పెళ్లి గురించి దిగులు పడుతుంటే- "నువ్వేం కంగారు పడకు బాసూ... అన్నీ సవ్యంగా జరిగి పోతాయి. మేం చూడు అమ్మాయి పెళ్లి చేసేసి... ఎంత హాయిగా ఉన్నామో." అని ఓదార్చ బోయాను.

"నీకేం గురూ!... నీకు ఒక్క అమ్మాయేు! మాకు ఇద్దరమ్మాయిలు." అన్నాడు వాడు మరింత దిగాలుగా.

"మరింకేం! మాకు హాయి ఒక్క సారే!... మీకైతే ఎంచక్కా హాయి రెండుసార్లు!" అన్నాను నేను.




# 'చిక్కు'డుకాయ

**"హలో!... అమ్మా!"**

**"ఆఁ నేనేనమ్మా! ఎలా ఉన్నావు? ఏంటి విశేషాలు? ఎలా ఉంది నీ కొత్త కాపురం?... అల్లుడుగారు బాగున్నారా?"**

"ఆయనకేం బాగానే వున్నారు తల్లీ! ఎటొచ్చీ నాకే బాగా లేదు."

"ఏమయిందే?"

"ఏమయిందంటే ఏం చెప్పనే తల్లీ! నేను మనింటి కొచ్చేస్తానమ్మా! ఈయనతో నేనింక కాపురం చెయ్యలేనమ్మా! చెయ్యలేను."

"అదేమిటే! పెళ్లై రెండు నెలలు కూడా కాలేదు! అప్పుడే విడిపోవడం వరకూ వచ్చిందేమిటి వ్యవహారం? మొగుడూ పెళ్లాలన్న తరువాత చిన్న చిన్న మనస్పర్థలు రావడం సహజం సర్దుకుపోవాలి."

"రాత్రే సర్దేసానమ్మా బట్టలన్నీ! నీకో మాట చెప్పి బయలుదేరుదామనే ఫోన్ చేసాను."

"అసలేమయిందే? అల్లుడు మంచి వాడనే కదా నిన్నిచ్చి పెళ్లి చేసాం!"

"పెళ్లి కాదమ్మా! నా గొంతు కోసారు!"

"అసలేం జరిగిందో చెప్పవే నా తల్లీ! కంగారుగా ఉంది నాకు."

"అదే చెబుతున్నాను! విను! ఈయనకి వంకాయ, చిక్కుడుకాయ కూరలో టమాటా వేసి వండితే చాలా ఇష్టమని చెప్పేరు మా అత్తగారు - మేం సిటీలో మా ఇంటికి వచ్చేసేముందు."

"అయితే?..."

"సరే! ఆయనకి యిష్టమైన కూర చేసి పెడదామని-క్రితం సోమవారం మా యింటికి దగ్గర్లోనే ఉన్న సంతకి వెళ్లి-నవనవలాడే లేత వంకాయలు, గింజలు ఎక్కువగా ఉన్న లేత చిక్కుడుకాయలు, దేశవాళి టమాటాలు కొనుక్కొచ్చి-కూర చేసి పెట్టేనమ్మా!"


"తరువాత?"

"ఆ కూర చూడగానే ఆయన ఎగిరిగంతేసి- చాలాసార్లు మారు వడ్డించుకుని అన్నమంతా ఆ కూరతోనే నాక్కుని, నాక్కుని తిన్నారమ్మా! కూర కమ్మగా ఉంది. చాలా బాగా చేశావని మెచ్చుకుని ఆ సాయంత్రం నన్ను సినిమాకి కూడా తీసుకు వెళ్లేరమ్మా!"

"సినిమా బాగుందా?"

"బాగుందిలే కానీ....సరే! ఆయన అంత సంబరంగా తిన్నారు కదా అని మంగళవారం కూడా సంతకువెళ్లి నవనవలాడే లేత వంకాయలు, గింజలు ఎక్కువగా ఉన్న లేత చిక్కుడుకాయలు, దేశవాళీ టమాటాలు కొనుక్కొచ్చి కూర వండి పెట్టేను... 'సరే బాగుంది' అంటూ అన్నంలో కలుపుకుని తిన్నారు. నీ చేతి వంట అమృతమోయ్ అని కూడా అన్నారు తెలుసా?"

"సరే... ఆ తరువాత?"






## పేరులోనే అంతా ఉంది!

**హా**స్య రచనలు చేయడం కష్టమైన ప్రక్రియ... అయితే, హాస్య రచనలు చేసి పాఠకులని మెప్పించడం అంతకంటే కష్టమైన ప్రక్రియ. అలాంటి కష్టతరమైన ప్రక్రియని ఇష్టంగా తలకెత్తుకున్న హాస్య రచయితగా, కోనేగారి ఇంత సుదీర్ఘ ప్రయాణం వెనుక, వారికి హాస్యరచనలపై గల అంకితభావాన్ని అర్థం చేసుకోగలను. వారి రచనలలో మెరిసే హాస్యం, చదివింపజేసే శైలీ, చక్కని కొసమెరుపూ, నవ్వించే పాత్రల పేర్లూ ,ఇలా హాస్యకథలని వైవిధ్యంగా నడిపే హాస్యకథా వైద్యుడాయన. ముఖ్యంగా ఆయన హాస్యానందంలో ఎన్నో విభిన్నమైన హాస్యకథలు వ్రాసారు. అలానే, దాదాపు అన్ని పత్రికలలోనూ వారి హాస్య కథలు పాఠకులని కితకితలు పెట్టాయి.ఇలానే వారు మరెన్నో నవ్వించే కథలు వ్రాయాలనీ, మరెన్నో పురస్కారాలు వారిని వరించాలని కోరుకుంటున్నాను. ఇలా ఈ నెల హాస్యానందం, కోనేగారిపై ఓ ప్రత్యేక సంచిక తీసుకు రావడం సంతోషం కలిగిస్తోంది. ఈ ప్రత్యేక సంచిక, వారి సాహితీ ప్రయాణంలో, ఎప్పటికీ గుర్తుపెట్టుకునే ఓ మంచి మైలురాయిగా నిలిచిపోతుందని నా అభిప్రాయం. ఈ సందర్భంగా కోనేగారికి నా మనఃపూర్వక అభినందనలు.



**-గంగాధర్ వడ్లమన్నాటి, విశాఖపట్నం.**

"అంతలా కూర అమృతంలా ఉందన్నారు కదా అని బుధవారం సంతకెళ్లి నవనవలాడే వంకాయలు, గింజలున్న చిక్కుళ్లు, దేశవాళీ టమాటాలు తీసుకొచ్చి కూర చేసి పెట్టేను."

"అలాగా!!"

"మళ్లీ చేసావా? అంటూ ఆయన ఆ కూరతో ఆప్యాయంగా అన్నం తిని... బాగుందన్నారు."

"మరింకేం? ఇంక గొడవ దేనికొచ్చింది?"

"కూర బాగుందన్నారు కదాని గురువారం నాడు కూడా సంతకెళ్లి వంకాయలూ, గింజలున్న....."

"చిక్కుడుకాయలూ, దేశవాళీ టమాటాలూ కొనుక్కొచ్చి వంకాయ, చిక్కుడుకాయ టమాటా కూర వండేవు. అంతేకదూ!?"

"అవునమ్మా! కరెక్ట్!! చూసినట్లే చెప్పేవు... నీకెలా తెలిసింది?"

"నాకే కాదు! యిది చదువుతున్న వాళ్లందరికీ తెలిసిపోయిందిలే గానీ... తరువాతేమయిందో చెప్పు త్వరగా!"

"ఆ కూరతో అన్నం పెడితే నా ముఖంవంక ఒకసారి చూసి గబగబా అన్నం కలుపుకుని తిని ఆఫీస్‌కి వెళ్లిపోయారు."

"తరువాత?"

"తిన్నారు కదా అని శుక్రవారం సంతకెళ్లి నవనవ... గింజలున్న.....దేశవాళీ.....కూర చేసి పెట్టేను."

"తరువాతేమయింది?"

"ఆయన రాగానే అన్నం వడ్డించి భోజనానికి రమ్మని పిలిచేను. ఆయన వచ్చి కూరగిన్నె మూత తీసి చూసి రెండంటే రెండు చెంచాల కూర వేసుకుని మజ్జిగ పోసేసుకున్నారు అన్నంలో."

"అలాగా!"

"అలాగా అంటావేంటమ్మా! శనివారం అంటే ఇవాళ మళ్ళీ సంతకెళ్ళి వంకాయలు, చిక్కుళ్ళు... టమాటాలు తెచ్చి కూరవండి పెట్టేను."

"మళ్ళీ పెట్టేవా?!"

"అవునమ్మా! ఆయనకిష్టమైన కూర కదా అని చేసేను. ఆయన భోజనానికి వచ్చి కూర మీద మూత తీసి చూసి -ఒక్క క్షణం ఆగి ఆ గిన్నె ఎత్తి నా నెత్తిమీద పోసేసి అన్నం తిన కుండానే ఆఫీస్‌కి వెళ్లిపోయారు... ఆయనెందుకలా చేసారో నాకేం అర్థం కాలేదు... నేనేం తప్పు చేసాను?... ఆయనకిష్టమైన కూరే కదా చేసాను?"

"చేసావులే!... అల్లుడు మంచివాడు కనుక అంతటితో సరిపెట్టేడు. అదే మీనాన్నగారైతే నాకు విడాకులిచ్చి యింట్లోంచి గెంటేసి తలు పేసుకునేవారు తెలుసా?"

"అంత తప్పు నేనేం చేసానమ్మా?"

"చాల్లే నోర్మూయ్! పెట్టెయ్ ఫోన్!"

## తాపీధర్మారావు పురస్కారం-2022



**నవంబర్,5న విజయవాడలో ప్రఖ్యాత కార్టూనిస్ట్ శ్రీ సరసిగారికి తాపీధర్మారావు పురస్కార ప్రదానోత్సవం జరిగింది. శ్రీ సరసి గారికి హాస్యానందం అభినందనలు.**




# బస్సులో కస్సు బుస్సుల మిస్సు

**ఆ రోజు ఢిల్లీ నుండి అక్క, బావ వస్తుండడంతో స్టేషన్‌కి వెళ్ళి వాళ్ళను రిసీవ్ చేసుకోడానికి ఓ గంట ముందే పర్మిషన్ తీసుకుని ఆఫీసు వదిలేశాను.**

వచ్చిన ప్రతీసారీ వచ్చీరాని మాటలతో 'పిన్నీ, పిన్నీ' అంటూ నా వెనకెనకే తిరిగే అక్క కొడుకు మూడేళ్ళ సిద్ధూని ఎంత త్వరగా చూస్తానా అని నా మనసు ఆత్ర పడసాగింది.

ట్రైన్ అయిదు గంటలకి. నేను నాలుగు గంటలకే ఆఫీస్ వదిలేసి బస్‌స్టాప్‌కి వచ్చేశాను.

పది నిముషాలు గడిచిపోయినా స్టేషన్ వైపు వెళ్ళే బస్సొక్కటి కూడా రాలేదు.

అసహనంగా వాచ్‌వైపు చూశాను.

నాలుగుం పావు. ట్రైన్ రావడానికి అయిదు, పది నిముషాలు ముందరే స్టేషన్‌కి చేరిపోవాలని నా ఆత్రం.

ట్రైన్ దిగీదిగడంతోనే సిద్ధూ గాడిని ఎత్తుకుని ముద్దులాడాలని నా తహతహ.

మరో పదినిముషాల తరువాత– కిక్కిరిసిన జనంతో స్టేషన్‌వైపు వెళ్ళే బస్సొచ్చి ఆగింది స్టేజ్‌లో.

ఈ బస్ మిస్సయితే రైల్వేస్టేషన్‌కి సమయానికి చేరుకోవడం చాలా కష్టం.

అందుకే తోసుకుని తోసుకుని ఎలాగోలా కష్టపడి బస్సెక్కే శాను.

నిలబడడానికి కూడా చోటు లేదు బస్సులో.

ఒంటికాలు మీద నిలబడి 'హమ్మయ్య' అనుకున్నాను.



ఒకటే తోపులాట.

వెనుకే ఓ వ్యక్తి నన్ను ఆనుకున్నట్లుగా నిలబడి ఉన్నాడు.

ఓర కంట చూశాను.

బాబోయ్! ఆరడుగులపైనే ఉన్నాడా మనిషి. నీట్‌గా 'టక్' చేసుకుని ఉన్నాడు.

బస్ బయలుదేరింది.

కుదుపులకి తూలిపోకుండా బస్ హేంగర్ పట్టుకోడానికి చెయ్యి పైకెత్తేను.

అసలే మన హైట్ అంతంత మాత్రం. ఆ హేంగర్ ఎక్కడో ఆకాశంలో ఉన్నట్లుంది. ఎలాగోలా హేంగర్ దొరకబుచ్చుకుని స్టడీగా నిలబడ్డాను.

బస్ జోరుగా పరుగెడుతోంది.

కుదుపులకు- నా వెనుక ఉన్న కొంగలాంటి మనిషి నా మీద మీద పడిపోతున్నాడు.

కావాలనే పడుతున్నాడో లేక నిజంగానే బస్ కుదుపులకు నిలబడలేకపోతున్నాడో... తెలియడం లేదు.

అయినా బస్‌లో ఒంటరి ఆడపిల్ల కనబడితే తాకకుండా మీద పడకుండా కుదురుగా నిల్చోలేరు కదా ఈ మగరాస్కెల్స్. తిట్టుకున్నాను.

ఎదురుగా ఏ స్కూటరో అడ్డొచ్చినట్లుంది బస్ డ్రైవర్ సడెన్‌గా బ్రేక్ వేశాడు.

బస్ హేంగర్ పట్టుకున్నా నేను ముందుకు తూలేను.

నాతోపాటు నా వెనుక నుల్చున్న... 'పెద్ద మనిషి' కూడా తూలి నా మీద పడిపోతున్నాడు.

నాక్కోపం నషాళానికంటింది.

"ఏయ్ మిస్టర్! సరిగ్గా నిలబడ లేరా?" సీరియస్‌గా అన్నాను.

వెనక్కి తల తిప్పి చూడడానికి అవకాశమే లేదు ఆ రష్‌లో.

"సారీ మేడమ్" మృదువుగా అన్నాడతను. సారీ చెప్పేడు గానీ, మధ్య మధ్యలో అవకాశం దొరికినప్పుడల్లా నా మీద పడిపోవడం మాత్రం మానలేదా పొడుగు రాస్కెల్.

ఓ మలుపు దగ్గర నేను ముందుకు తూలితే- అతను కూడా తూలి నామీద పడిపోయాడు కావాలనే.

ఇంక నిగ్రహించుకోవడం నా వల్ల కాలేదు.

"ఏయ్ మిస్టర్! ఏంటిది? మీద మీద పడిపోతున్నావ్ ఇందాకట్నుండి?" సీరియస్‌గా ఏకవచనంలోకి దిగిపోయాను.

"సారీ అండి! మీరేమీ అనుకోకపోతే... బస్ హేంగర్ పట్టుకుంటారా?... నేను సాయం చేస్తాను కావాలంటే..." సౌమ్యంగా అన్నాడతను.

హేంగర్ పట్టుకునే వున్నాగా? యింకా ఏం సాయం చేస్తావ్ నాయనా?... ఆ వంకతో చేతులు తాకాలనా నీ ప్లాన్?

మన దగ్గర ఆ పప్పులేం ఉడకవ్!

"తమరి సాయం ఏం అఖ్ఖరలేదులెండి. నేను ఆల్ రెడీ పట్టుకునే ఉన్నాను హేంగర్." కాస్త కంఠంలో కోపం మేళాయించి చెప్పేను.

"లేదు మిస్! దయచేసి మీరు బస్ హేంగర్ పట్టుకోండి!... తూలిపోరు... నేను హెల్ప్ చేస్తాను!" అన్నాడతను కూల్‌గానే.

వీడికేమైనా పిచ్చా? నేను పట్టుకునే ఉన్నాగా హేంగర్!

ఆ వంకతో మాటలు కలపాలనేగా వీడి వెధవ ప్లాన్!

"మహానుభావా! నేను బస్ హేంగర్ పట్టుకునే ఉన్నాను. నన్నొదిలేయండి ఇక" చికాగ్గా అన్నాను.

"లేదండీ మీరు పొరబడుతున్నారు.... మీరు బస్ హేంగర్..." అంటూ అతనింకా ఏదో అనబోతుంటే చిర్రెత్తుకొచ్చింది నాకు.

"ఇంకే హేంగర్ పట్టుకోమంటావయ్యా? యిదిగో పట్టుకునే ఉన్నా!" అంటూ తల తిప్పి నా చేతిలోని హేంగర్ వైపు చూసి నోట మాట రాక అలాగే ఉండిపోయాను.

నా చేతిలోఉన్నది బస్ హేంగర్ కాదు..... అతని మెడలోంచి వేలాడుతున్న టై.

నెక్ టై!

చచ్చేంత సిగ్గు పడ్డాను.

అయితే ఇందాకటి నుండీ అతను కావాలని నా మీద పడడం లేదన్న మాట.

కుదుపుల్లో నేను బస్ హేంగర్ అనుకుని అతని 'టై' ని గుంజేస్తుంటే నా మీద పడక ఏం జేస్తాడు పాపం...!

చటుక్కున అతని 'టై' ని వదిలేసి-

"సారీ" చెబుతూనే ఉన్నాను బస్ దిగిపోయే వరకూ.




## 'కొంటె' 'కోనే వాడు'

శ్రీయుతులు కోనే నాగ వెంకట ఆంజనేయులుగారి పై హాస్యానందం ప్రత్యేక సంచిక వెలువరించడం ముదావహం. ఆనాటి 'చందమామ' లో కథల నుండి, వందలాది బాలల కథలు, హాస్యకథలు వ్రాసి ఎన్నో బహుమతులు పొంది, వన్నె కెక్కినవారు. ఇక ఆయన వ్రాసిన జోక్స్ ఎన్నో ఆయనకే తెలీదు. అవి వివిధ మాధ్యమాల్లో తిరిగి తిరిగి ఆయన దగ్గరకే వస్తే చదివి గుంభనంగా నవ్వుకుంటారు తప్ప, ఇది నాదే అని చెప్పరు... ఎవరైనా అడిగితే తప్ప! అంతటి నిరాడంబరమైన వ్యక్తి. హాస్య కథలకి ఆయన ఎంచుకునే కథా వస్తువు వైవిధ్యంగా ఉంటూ, ప్రతీ వాక్యంలో హాస్యపు చెణుకులు తొంగి చూస్తూనే ఉంటాయి.



విశాఖలో జరిగే సాహితీ సభల్లో ఆయనని కలిసినప్పుడల్లా ఎంతో ఆప్యాయంగా మాట్లాడే గొప్ప మనసున్న వ్యక్తి. కోనే నాగ వెంకట ఆంజనేయులు గారికి శుభాభినందనలు తెలుపుతూ, మరిన్ని హాస్య కథలు, సాహిత్యం ఆయన కలం నుండి జాలువారాలని ఆశిస్తున్నాను.

**-పి.వి.రామశర్మ, కార్టూనిస్ట్, హాస్యకథా రచయిత**


# మరపురాని స్వగతాలు



సహధర్మచారిణితో



నాలుగు తరాల 'కోనే'గారి కుటుంబం



తల్లిదండ్రులతో




రచయిత, దర్శకులు జనార్ధన మహర్షితో

ప్రియమైన కథకులు గ్రూప్ వారి సన్మానం






సాహితీ మిత్రులతో



డాక్టర్ కె.వి.రమణాచారి గారి చేతుల మీదుగా
బాల సాహిత్య పురస్కారం అందుకుంటూ




ముళ్లపూడి వెంకటరమణ కథల పోటీలో బహుమతి అందుకుంటూ



డాక్టర్ సి.నారాయణ రెడ్డి గారితో



దర్శకులు వంశీ గారితో




హాస్యానందం 200వ సంచిక సక్సెస్ మీట్‌లో




నారంశెట్టి బాల సాహిత్యపీఠం వారి సన్మానం




# వాకింగు-వా...క్వనూ!

**“డాడీ!...” వాకింగ్ నుండి ఇంట్లోకి అడుగు పెడుతూనే గావుకేక పెట్టింది రాణి.**

**వెంటనే కాళ్లకున్న వాకింగ్ బూట్లు విప్పి చెరో దిక్కుకూ విసిరికొట్టింది. మీ దిక్కున్న చోట చెప్పుకోండి అన్నట్లు.**

ఆ విధంగానే ఆ రెండు ‘బూట్లూ’ వాటి దిక్కున్న చోట ‘చెప్పు’ కున్నాయి.

ఓ బూటు పడమర దిక్కుగా ఉన్న ఖరీదైన ఎల్.యి.డి. టీ.వీకి చెప్పుకుంది.

ఆ టీవీ కోపంతో వెంటనే ముక్కలు ముక్కలై భళ్లున క్రిందకు రాలింది.

మరో బూటు ఉత్తరం దిక్కుగా ఉన్న గాజు షోకేసుతో చెప్పుకుంది. నేనేనా తక్కువ? అన్నట్లు ఆ షోకేసు కూడా తను బద్దలవడమే కాకుండా ఆ దగ్గరలోనే వున్న అందమైన ఫ్లవర్ వాజుల్నీ, గాజుబొమ్మల్ని కూడా తనతోపాటు జలజలా క్రిందకు రాల్చింది.

గాబరాగా, పరుగు పరుగున మేడ దిగి వచ్చాడు కోటీశ్వరుడు కోటేశ్వరరావు.

ఈలోగా మనం కొంచెం వెనక్కి వెళదాం.

✦✦✦

రాణి-కోటేశ్వరుడు కోటేశ్వరరావు ఏకైక గారాల పుత్రిక.

పద్దెనిమిదేళ్ల అందాల భరిణె, అపరంజి బొమ్మ. ఏడు మల్లెల ఎత్తు పరువాల కొమ్మ. చూసిన ప్రతీ యువకుడి మతి పోగొట్టే అప్సరసలను తలదన్నే అందగత్తె రాణి.

రాణి-రోజూ తమ బంగళా ముందున్న రోడ్డుమీద మార్నింగ్ వాక్ చేస్తుంటుంది.

ఓ రోజు ఆమెకు ఎదురుగా వాకింగ్ చేస్తూ ఐపాడ్‌లో పరవశంగా పాటలు వింటూ వస్తున్నాడో పాతికేళ్ల యువకుడు.

రాణి చూపు ఆ యువకుడి వైపు మళ్లింది.

ఆ యువకుడు రాణి ప్రక్కనుంచి వెళుతూ... వెళుతూ.....

రాణి ముఖం కందగడ్డై పోయింది.



‘ఎంత పొగరు వాడికి?!!...’ మనసులోనే తిట్టుకుంది.

ఆ మరునాడు ఉదయం వాకింగ్‌లో...

మళ్లీ అదే కుర్రాడు రాణికి ఎదురై...

గిలగిలలాడింది రాణి.

ఏమనుకుంటున్నాడు తనని ఆ రాస్కెల్!

మరునాడు...ఆ మరునాడు...ఆ మరునాడు... నెలరోజులుగా యిదే తంతు!

వాకింగ్ చేస్తూ!... రాణి ఎదురవగానే ఆ యువకుడు...ఆ రాస్కెల్....

రాణి ఒళ్లు ఉడికిపోతోంది... రోజూ ఆ యువకుణ్ణి చూసి కోపంతో!

ఏం చూసుకుని ఆ పొగరు వాడికి?

కోటీశ్వరుడి కూతురిని, అందాలబొమ్మని... తనని....తనని.....

ఆవేశంతో రగిలిపోతోంది రాణి.

ఉహూఁ యింక ఈ అవమానం భరించడం తన వల్లకాదు. యింక ఊరుకోకూడదు.

వాడి అంతు తేల్చాల్సిందే! డాడీతో చెప్పి వాణ్ణి....వాణ్ణి....

అయ్యో! యిదీ గతం!

✦✦✦

యిక ప్రస్తుతంలోకి వస్తే... పరుగు, పరుగున కూతురు దగ్గరకు వచ్చాడు కోటీశ్వరరావు గాబరాపడుతూ... లేస్తూ!

“ఏమయింది తల్లీ?!” అడిగేడు ఆరుద్ర లాగా...సారీ...ఆదుర్దాగా!

నౌకరు వినయంగా అందించిన మంచినీళ్ల గ్లాసు అందుకుని గటగటా త్రాగింది రాణి.

ఆయాసం కాస్త తగ్గింది గానీ ఆవేశం పిసరంతైనా తగ్గలేదు ఆమెకు.

కోపంతో బుసలు కొడుతూనే ఉంది.

ఏం జరిగిందో అర్థం కావడంలేదు కోటీశ్వరరావుకి. అదే అడిగేడు.

“ఏం జరిగిందమ్మా! చెప్పు తల్లీ! నిన్నెవరైనా ఏమైనా అన్నారా? ఏ కుర్రాడైనా నిన్ను అల్లరి పెట్టేడా? చెప్పమ్మా చెప్పు!” అని అడిగేడు.

“అవును డాడీ! భరించరాని అవమానం జరిగింది నీ కూతురికి. యింకా నేనెందుకు బ్రతికి ఉన్నానో అర్థం కావడంలేదు డాడీ... అర్థం కావడంలేదు!” అని ఆపింది రాణి.

“అసలు విషయం చెప్పమ్మా!”

“ఆ చిన్న డాబా యింట్లో ఉండే కుర్రాడు నెలరోజుల్నుండీ వాకింగ్‌లో రోజూ నాకు ఎదురవుతున్నాడు డాడీ!”

“ఏం చేసాడమ్మా వాడు?”

“అదే చెబుతున్నాడు డాడీ! నెలరోజుల్నంచీ వాకింగ్‌లో రోజూ నాకు ఎదురవుతున్నాడు... ఐపాడ్‌లో పాటలు వింటూ నన్ను దాటుకుని వెళ్లిపోతున్నాడు గానీ... ఈ నెలరోజుల్లో వాడు ఒక్కసారంటే... ఒక్కసారి కూడా అందాల భరిణెను, అపరంజిబొమ్మను, ఏడుమల్లెల ఎత్తు పరువాల కొమ్మను...వగైరా...వగైరా... అయిన నావైపు ఒక్కసారి కూడా కన్నెత్తి చూడలేదు డాడీ వాడు! ఎంతపొగరో వాడికి!... అలాంటివాణ్ణి ఊరికే వదలకూడదు డాడీ!... నలుగురు రౌడీల్ని పెట్టి చితక్కొట్టించు డాడీ! అప్పుడుగానీ నా కసి తీరదు!... నా పగ చల్లారదు.” ఆక్రోశంగా చెప్పింది రాణి సోఫాలో కూలబడుతూ.

ఏం మాట్లాడాలో అర్థంకాక కోటేశ్వరరావు నిశ్చేష్టుడై అలా నిలబడిపోయాడు.




**నవ్వులకు చిరునామా మా నాగాంజనేయులు**

ఇవాళ అసలు సిసలైన, హృద్యమైన హాస్యం పండిస్తున్న కొద్దిపాటి రచయితలలో మిత్రుడు నాగాంజనేయులు ముందు వరుసలో ఉంటారు.

సుమారు గత యాభై సంవత్సరాలుగా అటు చందమామలోని బాలల కథల నుండి, ఇటు పెద్దల సాంఘిక కథల వరకు నాలుగు వందలకు పైగా చక్కని కథలను తెలుగు పాఠకులకు అందించిన రచయిత ఈయన. అందునా నూట డెబ్బై వరకు కేవలం హాస్య కథలు వచ్చాయంటే, ఈ రంగంలో ఆయనకున్న సత్తువ మనకు అర్థమవుతుంది!

కేవలం హాస్యానికి ప్రాధాన్యత ఇచ్చి, ఆరోగ్యకరమైన హాస్య కథలు అందించే హాస్యానందం పత్రిక వారే ఈయన రాసిన కథలు యనభై కి పైగా వెలువరించారు. ఈ కథల్లో చాలావరకు హిందీలోకి, కన్నడంలోకి అనువదింపబడటం ఓ హాస్య రచయితగా నాగాంజనేయులుగారి ప్రజ్ఞా పాటవాలను తెలియజేస్తుంది.

నాగాంజనేయులుగారు ముప్పైకి పైగా కథలు వివిధ పత్రికలు నిర్వహించిన కథల పోటీలలో బహుమతులు సంపాదించడం ఒక ఎత్తు అయితే, రకరకాల వ్యాపార ప్రకటనల పోటీలలో కూడా బోలెడు బహుమతులు సంపాదించడం మరో ఎత్తు.

అన్నివేళలా చిరునవ్వుతో మిత్రులను పలుకరిస్తూ, హాస్యోక్తులు విసురుతూ, వాట్సాప్ మెసేజ్ లో కూడా చతురోక్తులు గుమ్మరిస్తూ, నవ్వుల పరిమళాలను పంచిపెట్టే మా కోనే నాగ వెంకట ఆంజనేయులుగారి గురించిన వివరాలతో, విశేషాలతో హాస్యానందం వారు ఒక ప్రత్యేక సంచికను తీసుకురావడం హర్షించదగ్గది. హాస్యానందం వారి ఉత్తమ హాస్య అభిరుచికి ఈ సంచిక ఒక తార్కాణంగా మిగిలిపోతుంది. హాస్యానందం సంపాదక వర్గానికి, మిత్రుడు నాగాంజనేయులు గారికి నా అభినందనలు.



**–ద్విభాష్యం రాజేశ్వరరావు,విశాఖపట్నం.**




# ఊరూ...పేరూ...

**"హలో..."**

**"హలో..."**

**"భద్రాచలం ఉన్నారాండి?"**

**"భద్రాచలం తిరుపతి వెళ్ళేరండి"**

**"అరె! చాలా అర్జంటే! పోనీ సింహాచలం ఉన్నారా?"**

"సింహాచలం భద్రాచలం వెళ్ళేరండి!"

"సరే! తిరుపతిని పిలవండి ఫోన్లోకి..."

"తిరుపతి అన్నవరం వెళ్ళేరు సార్!"

"సరిపోయింది అన్నవరాన్ని పిలవండయితే!"

"సారీ సార్! ఆయనా లేరు- సింహాచలం వెళ్లేరు."

"అరె! యిప్పుడెలా? ఒక్కరూ దొరకడం లేదే!"

"..... ..... ....."

"సరే! భద్రాచలం అన్నవరం నుండి ఎప్పుడొస్తారు?"

"భద్రాచలం వెళ్ళింది అన్నవరం కాదు సార్ తిరుపతి!"

"తిరుపతా అన్నవరం వెళ్ళింది?"

"కాదు సార్ తిరుపతి వెళ్ళింది అన్నవరం!"

"అదేగా నేనన్నాను!"

"కాదుసార్!... అన్నవరం వెళ్లింది సింహాచలం!"

"అదేమిటి? సింహాచలం వెళ్లింది భద్రాచలం కదా?"

"కాదు సార్! భద్రాచలం వెళ్ళింది తిరుపతి!"

"బాబూ! కన్ఫ్యూజన్‌గా ఉందయ్యా! యిప్పుడు సింహాచలం వెళ్ళింది భద్రాచలం కదా!"

"కాదుసార్! సింహాచలం వెళ్ళింది అన్నవరం!"

"మరైతే అన్నవరం వెళ్లింది తిరుపతి కాదా?"

"కాదండీ బాబూ! అన్నవరం వెళ్ళింది సింహాచలం!"

"బాబూ సరిగ్గా చెప్పు. అన్నవరం వెళ్లింది సింహాచలమా లేక తిరుపతా?"

"ఓరినాయనోయ్! నాకు పిచ్చెక్కుతోంది. అన్నవరం వెళ్లింది తిరుపతి కాదు సింహాచలం!"

"మరి యిందాక సింహాచలం వెళ్లింది భద్రాచలం అన్నారు కదండీ!"

"అవునండీ సింహాచలం వెళ్లింది భద్రాచలమే- భద్రాచలం వెళ్లింది మాత్రం తిరుపతే!"

"తిరుపతి భద్రాచలం వెళ్ళడమేమిటండీ! తిరుపతి వెళ్లింది అన్నవరం అన్నారు కదా యిందాక?"

"బాబూ! అన్నవరం వెళ్ళింది తిరుపతే! కానీ సింహాచలం వెళ్లింది మాత్రం అన్నవరం!"

"మళ్ళీ సింహాచలం వెళ్లింది అన్నవరం అంటారేంటండీ. అన్నవరం వెళ్లింది తిరుపతి కదా?"

"తిరుపతి కాదండీ బాబూ! తిరుపతి వెళ్ళింది భద్రాచలం."


"తిరుపతి వెళ్ళింది భద్రాచలం అంటారేమిటి మళ్ళీ. తిరుపతి వెళ్లింది అన్నవరం అని నువ్వేగా చెప్పావ్ కదా?"

"కాదయ్యా బాబూ- నువ్వు కన్ఫ్యూజ్ అయ్యి నన్ను కన్ఫ్యూజ్ చేస్తున్నావు. తిరుపతి వెళ్ళింది అన్నవరమే! కానీ అన్నవరం వెళ్లింది మాత్రం సింహాచలం."

"ఓరి నాయనోయ్!... అంతా గందరగోళంగా ఉంది. ఎవరెక్కడికి వెళ్ళేరో ఏమీ అర్థం కావడం లేదు నాయనోయ్! ఎవరి పేరున్న వాళ్ళు ఆ వూరికి వెళ్ళినా బాగుండేదిరా తండ్రోయ్...ఫోన్ పెట్టెయ్... పెట్టేయ్ ఫోన్!!"

**"క్లిక్!"**





## బాలి బొమ్మకు కోనే కథ

'విశాలక్షి' సౌజన్యంతో

### పండుగ పిండి వంటలు

**హా**ల్లో పేపర్ చదువుకుంటున్న రామచంద్ర ముక్కు వంటగదిలోంచి వస్తున్న తీపి వాసనలకు ఉక్కిరి బిక్కిరి అవుతోంది.

లేచి వంటగదిలోకి తొంగి చూశాడు.

అక్కడ భార్య విశాల సంక్రాంతి పండక్కి రాబోయే కొడుకు, కూతురు కుటుంబాల కోసం పిండి వంటల ఫ్యాక్టరీ తెరిచింది.



మూకుట్లో అరిసెలు వేగుతున్నాయి.

అప్పుడే తయారైన జంతికలలోంచి ఓ జంతిక తీసుకుని హాల్లోకి వచ్చాడు రామచంద్ర... జంతిక నోట్లో పెట్టుకుని పరపర లాడించ బోయాడు.

నేనున్నానంటూ... రెండు రోజుల నుంచీ సలుపుతున్న పంటి పోటు... పలకరించి కంట్లోంచి నీళ్లు కార్పించింది. బాధతో బుగ్గ పట్టుకుని జంతిక పక్కన పెట్టేశాడు రామచంద్ర.

ఈ లోగా విశాల ఓ పళ్ళెంలో ఓ అరిసె పెట్టి తీసుకువచ్చి యిచ్చింది భర్తకి. ఆశగా ప్లేటు అందుకుని ఆత్రంగా అరిసె కొరికిన రామచంద్రకి చుక్కలు కనిపించాయి పంటి నొప్పికి.

అరిసె ప్లేటులో పడేశాడు. ఓ గంట తరువాత ఓ గిన్నె నిండుగా వెన్న ఉండలు తీసుకు వచ్చి యిచ్చింది విశాల.

ఇవి మెత్తగానే ఉంటాయి కదా అని నోట్లో వేసుకోగానే పళ్ళు జివ్వున లాగేశాయి.

బాధతో విలవిల లాడుతున్న రామచంద్రని చూస్తూ– "అయ్యో రామచంద్రా! ఇంత మెత్తని దాన్ని కూడా కొరకలేక పోయారా?" ఎగతాళి చేస్తూ గిన్నె అందుకుని– ఒక్కొక్క ఉండా ఎగరేసుకుని నోట్లో పడేసుకుంటూ వంటగదిలోకి వెళ్ళిపోయింది విశాల.

అది చూసి పళ్ళు పటపటా కొరకబోయి నొప్పి జ్ఞాపకం వచ్చి ఆ ప్రయత్నం విరమించుకున్నాడు రామచంద్ర.

పండక్కి వచ్చిన సంతానం –పిండి వంటలు ఆరగిస్తుంటే తానేమీ తినలేక గింజుకు పోయాడు రామచంద్ర.



పండుగ నాలుగు రోజులూ కులాసాగా గడిపి యింక సెలవులు లేవని ఎక్కడి వాళ్లు అక్కడికి వెళ్లి పోయారు.

పండక్కి ఊరు వెళ్లి పోయిన పళ్ళ డాక్టర్ తిరిగి వచ్చేశాడని తెలిసి అదే రోజు క్లినిక్‌కి వెళ్ళి పుచ్చి పోయిన జ్ఞాన దంతం పీకించుకుని వచ్చాడు.

నొప్పి పోయి హాయిగా ఉంది... రామచంద్రకి.

ఇంటికి వచ్చి "ఈ జంతికలు, అరిసెలూ మళ్ళీ ఎప్పుడు చేస్తావు?" అడిగేడు భార్యని.

"అప్పుడేనా? మళ్ళీ సంక్రాంతికే" చెప్పింది విశాల. నిట్టూర్చేడు రామచంద్ర పండుగ పిండి వంటలు తినలేక పోయినందుకు.

కాసేపు తరువాత రామచంద్ర చేతికి ఓ ప్లేట్ అందించింది విశాల. దానిలోని జంతికలూ, అరిసెలూ,వెన్న ఉండలూ, పాకుండలూ చూసి రామచంద్ర కళ్ళు మెరిశాయి.

"మీ కోసం ఉంచకుండా ఎలా ఉంటాననుకున్నారు" అన్నది భర్త వైపు నవ్వుతూ చూస్తూ విశాల.

రామచంద్ర భార్య వైపు ఆప్యాయంగా చూస్తూ అరిసె కొరికేడు.

### కోనే కనిపెట్టినవి...





భార్యల్లో రకాలు రెండు.

**ఒకరు–** భర్తను భక్తితో సేవించేవారు

**రెండు–** భర్తను ఫలహారంలా సేవించేవారు



హైదరాబాద్‌లోని ఓ హోటల్లో వాష్ బేసిన్స్ పైన వరుసగా కనిపించిన మూడు బోర్డులు

**LADIES WASH GENTS**

### సినీ మూస మాటలు



- ఏంపీక్కుంటారో పీక్కోండిరా!
- నాకేయిలా ఎందుకు జరుగుతుంది?
- చట్టం తన పని తాను చేసుకుపోతుంది.
- చెప్పు తెగుద్ది!
- తియ్యండ్రా బళ్ళు!
- నువ్వు అంత పుడింగివా?
- మా ఆవిడ అదో టైపులెండి!

### మందుబాబులు మందు కొడుతున్నప్పుడు గ్లాసులు తగిలించి శబ్దం చేసేది ఎందుకో తెలుసా?

మందుని కళ్ళు చూస్తాయి కైపుగా. ముక్కు వాసన గ్రహిస్తుంది మురిపెంగా... నోరు తాగుతుంది ఆబగా... ఇక మిగిలింది చెవులు!... అవేం పాపం చేసాయి? అవి చిన్న బుచ్చుకోకూడదని గ్లాసులు తాకించి చెవులకింపుగా శబ్దం చేసి వాటికి న్యాయం చేస్తారు మందుబాబులు. అదీ సంగతి!




# కూర 'గాయాలు'

**నామీద కోపం వచ్చినప్పుడల్లా మా ఆవిడచేసే పనేమిటంటే – నాకెంతో యిష్టమైన వస్తువునేదో ఒకదాన్ని పాడుచెయ్యడం లేదా పెరట్లో నేనెంతో ప్రేమగా పెంచుకుంటున్న ఏ పూల మొక్కనో అశోకవనంలో హనుమంతుడిలా పెరికివెయ్యడం!**

తీసుకువెళతానన్న రోజున ఆమెని సినిమాకి తీసుకువెళ్ళలేదన్న కోపంతో– పెరట్లో నేనెంతో అపురూపంగా పెంచుకుంటున్న – గుత్తులు గుత్తులుగా కాయలు కాస్తున్న పచ్చిమిరపమొక్కను వ్రేళ్ళతో సహా పీకి పారేసి... నీ దిక్కున్న చోట చెప్పుకోమందోసారి! ఆవిడ తప్ప నాకు మరొక దిక్కులేదు కాబట్టి ఈ విషయం ఇంతవరకూ ఎవరికీ చెప్పుకోలేదు. ఇప్పుడు మీకు చెప్పడమే!

మరోసారి – మా చంటాడు అరిచి ఘీ పెట్టి రోడ్డుమీద ఈ మూల నుంచి ఆ మూలకీ... ఆ మూలనుంచి ఈ మూలకీ నాలుగైదుసార్లు దొర్లి దొర్లి ఏడ్చి నానా హంగామా చేసినా – వాడు అడిగిన బుల్లికారు బొమ్మ కొనివ్వలేదని... సింగపూర్ నుంచి మా అన్నయ్య నాకెంతో ప్రేమగా పంపించిన రంగురంగుల టీ కప్పుల సెట్టులోని ఓ బుజ్జి టీ కప్పును పగలగొట్టి – పంచదార పలుకులంత చిన్నగా చితక్కొట్టేసింది. చందమామ కథల్లోని రాక్షసుడు చేత్తో కొండల్ని పిండిపిండి చేసేసే టైపులో.

అయితే ఇక్కడ మరో విశేషముందండోయ్!

ఎప్పుడైనా నాకిష్టమైన వస్తువు పాడైపోయి కనిపించే వరకూ... మా ఆవిడ నామీద కోపంగా వుందని తెలియకపోవడం! అంత గుంభనంగా అలుగుతుందావిడ నా మీద. యిక అప్పుడు ఆలోచించి... చించి... ఏ విషయంలో ఆవిడకు కోపం వచ్చి వుంటుందో ఊహించి... జ్ఞాపకం తెచ్చుకుని ఆవిడ కోసం చల్లార్చే మార్గం అన్వేషించి ఆచరణలో పెడతానన్నమాట.

ఎప్పుడు ఏ విషయానికి మా ఆవిడకు నామీద కోపం వస్తుందో, అసలు ఎందుకు అలుగుతుందో ఆపైవాడికే ఎరుక... అంటే మా పైపోర్షన్‌లో అద్దెకుంటున్న లావుపాటి అనంతలావు... సారీ... అనంత రావుకని కాదు నా ఉద్దేశ్యం.

ఇంకా పైనుండే ఆ సర్వేశ్వరుడికని.

ఓసారి ధైర్యం తెచ్చుకుని అడిగేశాను. ఎందుకే యిలా చీటికీ మాటికీ కోపం తెచ్చుకుని అలుగుతావని.

ఆ చిన్న మాటకే ఆవిడకి కోపం పొడుచుకొచ్చేసిందని – నా పార్కర్ పెన్ను పాళీ విరిగిపోయి వుండడం గమనించేవరకూ నాకు తెలి'సిరా' లేదు.



యింతకీ యిప్పుడీ సోదంతా... క్షమించాలి... సొదంతా ఎందుకు చెప్పాల్సి వస్తున్నదంటే...ప్రస్తుతం యాజాన్ టుడే... మా ఆవిడ ఎందుకనో గానీ నామీద చాలా కోపంగా వుంది. ఆ విషయం నేను రోజూ వేసుకునే నా కుడికాలి చెప్పు (అంటే నేను రోజు కుడి కాలి చెప్పు ఒకటి మాత్రమే వేసుకుని తిరుగుతానని కాదని గమనించ ప్రార్థన) తెగిపోయి వుండడం గమనించిన తరువాత తెలిసింది నాకు.

మా పిల్లలిద్దరినీ బుజ్జగించి కూపీలాగిన తరువాత తెలిసిందేమిటంటే... ఉదయం నుండీ ఆవిడ విపరీతమైన తలనొప్పితో బాధ పడుతోందిట... నేనొక్కసారైనా తలనొప్పి ఎలా వుందని అడగకపోవడమే ఆవిడ కోపానికి కారణమట.

సర్లే! తలనొప్పితో పడుకుంది కదా... ఈ పూటకింకేం వంట చేస్తుందిలే అనీ...ఆ విధంగా ఆవిడ కోపం పోగొట్టి ప్రసన్నం చేసుకోవచ్చుననీ ఆలోచించి – "పోనీ ఈ పూటకి హోటల్ నుండి కేరేజ్ తెచ్చేసుకుందామా?" అనడిగేను ఎంతో హుషారుగా.

ఆ మాట వినడంతోనే అంత నీరసంలోనూ నామీద ఇంతెత్తున్న లేచింది ఒంటికాలిమీద– చెరువులో చేపలు పట్టే కొంగలా!

"హత్తెరీ! రోజూ కష్టపడి నేను వండిపెడితే లొట్టలేసుకుంటూ తినడం కాదు! హోటల్ లేదు గీటల్ లేదు... ఈ రోజు మీరే వంట చెయ్యండి!" అని హుకుం జారీ చేసి ముసుగులోకి దూరిపోయింది.

మా ఆవిడ ఏదైనా ఒక్కసారి చెప్పిందంటే ఒక్కసారి చెప్పినట్లే! యింక తిరుగుండదు దాంట్లో! అంతటి రజనీకాంతి!

సరే! యింక చేసేదేమిలేక ఈ రోజుకి నేనే చెయ్యి కాల్చుకుందామని డిసైడైపోయాను.

అన్నం కుక్కర్లో పడేయచ్చు. అదేం పెద్ద కష్టం కాదు. కూరవండడమే కాస్త యిబ్బంది. యింతకు ముందెప్పుడూ కూరవండిన పాపాన పోలేదు మనం మరి! ఎలాగూ ఈ రోజు ఆదివారమే కాబట్టి ఆ కూర వండడం కూడా నెమ్మదిగా నేర్చేసుకుంటే సరి!... ఎప్పటికైనా పనికొస్తుంది.




## అక్షరాలతో ఆడుకునే చిదానందుడు

**"త**లనొప్పా? అమృతాంజనం రాయండి. మూత తెరిచిన తక్షణమే నివారణ ప్రారంభం!"... ఇది ఒకప్పుడు రేడియోలో తరచూ వినబడిన ప్రకటన.

"తలనొప్పా? 'కోనే' వారికి ఫోన్ చేయండి. ఆయన 'హలో' అన్న తక్షణమే నివారణ ప్రారంభం." ఇది ఇప్పుడు ఆయన అభిమానులు అనుకునే మాట.

'కోనే నాగ వెంకట ఆంజనేయులు' అనే పేరు సుమారు యాభై ఏళ్ల నుండి వివిధ పత్రికలలో నేను తరచూ చూస్తూనే ఉండేవాణ్ణి. కానీ, నా బుర్రలో ఆ పేరు గట్టిగా తిష్ఠవేసి పాతుకుపోయింది మాత్రం 'హాసం' పత్రిక ద్వారానే! ఒకే పదంలోని అక్షరాలనూ, ఒకే వాక్యంలోని పదాలను అటూ ఇటూగా పేర్చి, (ఏ)మార్చి కొత్త మాటలను సృష్టించి నవ్వు పుట్టించడంలో ముళ్లపూడి, అవసరాల, భరాగో... తదితర హాస్య రచయితల కోవలోనికి 'కోనే' వారు చేరుతారని నా నిశ్చితాభిప్రాయం. పైగా చాలా మంది రచయితలకు లేని స్వరం ఆయనకు ఒక వరం. తెలుగు, హిందీ, సినీ గీతాలైనా, పేరడీ పాటలైనా ఆయన శ్రుతి శుభ్రంగా పాడి శ్రోతలను, ప్రేక్షకులను మెప్పించగలరు. అంతేగాక, ఏళ్లనాటి పాత పత్రికలు, సంచికలు జాగ్రత్తగా దాచి వాటికి తగిన చికిత్స చేసి అవసరమైనవారికి అందించడం ఆయనకు ఉన్న అదనపు అభిరుచి. కొన్ని పత్రికలు ప్రారంభ సంచిక నుండి చివరి సంచిక వరకు ఆయన భాండాగారంలో భద్రంగా వున్నాయి. గ్రంథాలయాలలో అలభ్యమైన రచనలను జెరాక్సు తీసి ఆయా రచయితలకు పంపడం కొందరికే సాధ్యం. ఆ కొందరిలో ఒకరు మన 'కోనే' వారు.

'కోనే' గారి రాతలో ఎంత హాస్యం ఉట్టిపడుతుందో మాటలో కూడా అంతే మోతాదులో హాస్య చతురత తొణికిసలాడుతుంది. వ్యాఖ్యాతగా సాహితీ సభలను వారు నడిపిన తీరు అమోఘం, అద్వితీయం. ఇది ప్రత్యక్ష సాక్షులకు అనుభవైక వేద్యం.

విశాఖలో 'క్రియేటివ్ కామెడీ క్లబ్' ప్రారంభించిన నాటి నుండి మొదలైన మా ప్రత్యక్ష పరిచయం స్నేహంగా పరిఢవిల్లి నేటికీ పరిమళాలు వెదజల్లుతూనే ఉంది. 'కోనే' వారు అజాతశత్రువు, వివాదరహితులు, వినమ్రులు. మందస్మిత వదనంతో కనిపించే నిత్య సంతోషి. మంచితనానికి మరో పేరు, మానవత్వానికి చిరునామా.



ఇన్ని సుగుణాలు గల మా మిత్రుని గుర్తించి ఒక ప్రత్యేక సంచిక తీసుకురావడం 'హాస్యానందం' పత్రిక ఉత్తమ అభిరుచికి నిలువెత్తు నిదర్శనం. హాస్యం ఆవశ్యకతను అభిలషించే వారికి మరీ ముఖ్యంగా 'హాస్యానందం' పాఠకులకు 'కోనే' వారి స్నేహం నిత్యవసరం. అత్యవసరం. ఇది సత్యం. 'నవ్వు'స్కారం.

**–మేడా మస్తాన్ రెడ్డి,విశాఖపట్టణం**

వంటగదిలోకి దూరేను.

బియ్యం కడిగి కుక్కర్లో పడేశాను. ఫ్రిజ్ తెరిచి చూశాను... కూరగాయలు ఎక్కువగా లేవు. కేబేజీ ఒకటి కనబడితే అదే వండుదా మని తెచ్చేను.

ఒక్కొక్క ఆకూ విప్పదీసి చూశాను.

ఆకులన్నీ అయిపోయాయి గానీ... కేబేజీ లోపల ఏమీలేదు. యిదేమిటి లోపల ఏమీ లేదేమిటి? కొంపతీసి కేబేజీ పాడైపోయిందా ఏమిటి ఖర్మ! ఫ్రిజ్‌లో పెట్టినా పాడైపోతే ఎలా?

ఆకులన్నీ చెత్తబుట్టలో పారేసి మా ఆవిడ్ని లేపేను.

"కూర చేద్దామని కేబేజీ ఒలిస్తే లోపల ఏమీ కనిపించలేదు. అన్నీ ఆకులే! పాడైపోయిం దేమో మరి. ఇప్పుడేం చెయ్యమంటావ"ని అడిగేను గరిటె భుజం మార్చుకుంటూ వంటల భీముడిలా ఫోజు ఇస్తూ!

నేను చెప్పినంతసేపూ జాగ్రత్తగా విని ఆఖర్న బుర్ర కొట్టుకుంది మా ఆవిడ.

గరిటెకావాలా అని అడగబోయి తీరా ఆ గరిటె రివర్స్‌లో మననెత్తి బొప్పికట్టించదు కదా అని ఆలోచించి... ఆ ప్రయత్నం విరమించు కున్నాను.


"మీరెక్కడి మనిషండీ బాబూ! కేబేజీ లోపల ఏదో వుంటుందని వెతికేరా? కేబేజీ ఆకుల తోనే కదండీ కూర చేసేది. ఇన్నేళ్ళొచ్చినా ఇంత చిన్న విషయం కూడా తెలీదా! మీకన్నా చిన్న పిల్లలు నయం!..." అంటూ ఒక్కసారిగా




విరుచుకుపడింది నా మీద... బాగా వేగిన అప్పడంలా! అంత తలనొప్పీ ఎక్కడికి ఎగిరి పోయిందో మరి!

"నాకేం తెలుసు ఆ విషయం?... ముందే చెప్పొచ్చుగా, ఆకులతోనే కూర చెయ్యాలని! ఇప్పుడా ఆకులన్నీ చెత్తబుట్టలో పారేసానే!... ఇప్పుడెలా? మొక్కజొన్న పొత్తుల ఆకులన్నీ విప్పితే–లోపల కండె వున్నట్లు కేబేజీలో కూడా అలాంటి కండె ఏదో వుంటుంది–దాన్ని తరిగి కూర చేస్తారని అనుకున్నాను నేనింకా. నాకేం తెలుసు–ఆకులే వండాలని? నేనెప్పుడైనా కేబేజీ పండించేనా? వండేనా?"

"సర్లేండి... ఇంకా ఏం వున్నాయి కూరలు ఫ్రిజ్‌లో?..." అనడిగింది కొంచెం శాంతంగా




ఫ్రిజ్ తెరిచి చూసొచ్చి చెప్పేను.

"పచ్చి బఠానీకాయలున్నాయ"ని.

"అవైనా వండగలరా పోనీ?" అనడిగింది అనుమానంగా.

"ఎందుకు వండలేను! తప్పకుండా వండు తాను. నువ్వు పడుకో!" అని దుప్పటి కప్పే సేను మరో మాట మాట్లాడే అవకాశం ఇవ్వ కుండా. ఏదో ఒకటి చెడగొట్టినంత మాత్రాన యింక అన్నీ చెడగొడతానా! డాక్టర్లు మాత్రం ఒకరిద్దర్ని చంపరా ఏమిటి?... వండుతా!... చూపిస్తా నా తడాఖా!... రుచి చూపిస్తా నా నలభీమపాకం.

ఫ్రిజ్‌లోంచి బఠానీకాయలన్నీ బయటకు తీసేను.

అవన్నీ వంటగదిలో కుప్పపోసి కాయలన్నీ ఒలిచి గింజలన్నీ ఏరి పెరట్లోకి తీసుకువెళ్ళి మొక్కల్లో పారేసాను.

గరంమసాలా వేసి తొక్కలతో ఘుమఘుమ లాడేలా కూర వండేను. ఉప్పు చూద్దామని కాస్త కూర నోట్లో వేసుకుని నమిలేను కసా పిసా. అదేమిటి–రుచీపచీ లేదేమిటి కూర–ఇంత ఘుమఘుమలాడుతున్నా?

ఉడకబెట్టిన గడ్డి నమిలినట్లుగా వుంది!... ఏమిటిలా జరిగింది?... ఎంతాలోచించినా నాకేం పాలుపోవడంలేదు.

గత్యంతరం లేక మళ్ళీ మా ఆవిడ్ని నిద్ర లేపేను. బఠానీ తొక్కలతో నేను కూర వండిన వైనం పూసగుచ్చినట్లు చెబితే అంతా విని మళ్ళీ

బుర్ర బాదుకుంది... అంత లావు తలనొప్పిని కూడా లెక్కచేయకుండా.

గింజలతోనే చెయ్యాలట కూర!... నాకేం తెలుసు. ఆ ముక్క నేను కూర వండేముందే చెప్పొచ్చుకదా!

నానా మాటలూ అంది నా బుర్ర వాచి పోయేలా!

మరి చిక్కుడు కాయతొక్కలతోనే కదా కూర వండేది... యిదీ అంతేననుకున్నాను! అని దబాయించబోయి ఎందుకైనా మంచిదని మానేసాను. చిన్న పొరపాటుకి నన్ను యిన్ని మాటలంది గానీ ఆవిడ చేసే పనులు బాగున్నా యేమిటి? మీరే నాకు న్యాయం చెప్పండి.

ఘుమఘుమలాడే వేడి చారంటే నాకెంతో ఇష్టం. ఆ విషయం మా ఆవిడకీ తెలుసు... మరో కూరేమీ లేకపోయినా చారుతోనే అన్నం అంతా జుర్రుకుని తినేయగలను... కానీ ఇబ్బంది ఎక్కడొచ్చిందంటే...

చారునిండా దిక్కుమాలిన అయిటమ్స్ అన్నీ వేస్తుంది మా ఆవిడ. కరివేపాకు, చింతపండు, టమాటా ముక్కలు, వెల్లుల్లి, ఆవాలు, సింగినాదం, జీలకర్ర....ఇలా ఏవేవో వేసేస్తుంది. అవన్నీ ఏరుకుని అన్నం తిందామనుకునే లోపల చారు చప్పగా చల్లారిపోయి అన్నం తినబుద్ధయ్యేది కాదు! ఈ చెత్తంతా వెయ్యకుండా చారు కాయలేవా... అని ఎన్నిసార్లు మొత్తుకున్నా వినిపించుకోదు.

చివరికి విసిగిపోయి చారులో ఈ చెత్తంతా వేస్తే అన్నం తినేదిలేదని బెదిరించాను ఓసారి.

నా మాటలు ఆవిడ చెవికెక్కేయో లేదో నాకప్పుడు తెలియదు.

ఆ మరునాడు అన్నానికి కూర్చున్నాను.

కంచంలో అన్నం, ఓ గిన్నెలో కూర, మరో గిన్నెలో పెరుగు, గ్లాసులో చల్లని నీళ్ళు, ఆ పక్కన ఆవకాయ... మరో గిన్నెలో మరిగి పొగలు కక్కుతున్న నీళ్ళు– అందులో ఓ గరిటె!

"ఇదేమిటి?"అనడిగితే... "చారు" అని పెడసరంగా జవాబు చెబితే నాకు తిక్కరేగి... ఆ వేడి నీళ్ళ గిన్నె తీసుకుని బలంగా ఒక్క విసురు విసిరేను. ఆ మరుగుతున్న నీళ్ళు ఒలికి నా చెయ్యి కాలి బొబ్బలెక్కడం... ఆ గిన్నె తగిలి టేబుల్ మీదున్న ఆవకాయ జాడీ క్రింద పడి

## బాపు బొమ్మకు కోనే కథ

'స్వాతి' సౌజన్యంతో



## మీసాల భార్య

**చా**లారోజులుగా ఖాళీగా వున్న తమ ఎదురింటి ముందో లారీ ఆగి ఉండడం గమనించి ఎవరో అద్దెకు దిగారని ఊహించాడు మురళి.

ఆ తరువాత అతను ఆ యింటిని గురించి పెద్దగా పట్టించుకోలేదు. కానీ పట్టించుకోవాలని అతనికి ఆ సాయంత్రమే తెలిసింది.

కారణం ఆ యింట్లో తళుకు తళుకు మంటున్న ఓ మెరుపుతీగె.

మరునాడు మురళి ఆఫీస్‌కు వెళ్ళడానికి తయారై బయటికి వచ్చాడు.

ఎదురింటి గుమ్మంలో ఆమె. మురళి చూపు తనవైపు మళ్ళగానే ఆమె సిగ్గుపడుతూ పమిట కొంగు నోట్లో కుక్కుకుంది.

తనను చూసి ఆమె సిగ్గులమొగ్గైపోవడం చూసి మురళి హుషారుగా సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు.

సాయంత్రం ఆఫీస్‌నుండి యింటికి రాగానే ఎదురింటి గుమ్మంలో మళ్లీ ఆమె.

మురళి తనను చూడగానే ఆమె సిగ్గుతో తలమునకలవుతూ చీరచెంగులో ముఖం దాచుకుంది.

మురళికి నమ్మకం ఏర్పడిపోయింది.

ఆమె తనను ప్రేమిస్తుందని అటు తరువాత మురళి కూడా ఆమెను గాఢంగా ప్రేమించడం మొదలుపెట్టేడు.

ఓ శుభముహూర్తాన మురళి తన మనోభీష్టం తన తల్లిముందుంచాడు.

అతని తల్లి ఆశ్చర్యపోయింది – 'ఆ పిల్లను పెళ్ళి చేసుకుంటావా?' అని.

మురళి నిష్కర్షగా చెప్పేసాడు... తను పెళ్ళంటూ చేసుకుంటే ఆమెనే చేసుకుంటాననీ, లేని పక్షంలో ఆజన్మబ్రహ్మచారిగా ఉండిపోతానని.

ఒక్కగానొక్క కుమారుడి కోరిక తీర్చడం తమ ధర్మమని భావించిన మురళి తల్లిదండ్రులు ఈ వివాహానికి ఒప్పుకున్నారు.

రంగరంగ వైభవంగా ఆ ముద్దుగుమ్మతో మురళి వివాహం జరుగుతోంది.

పెళ్లిపీటల మీద కూడా ఆమె ముఖానికి రుమాలు అడ్డుపెట్టుకుని సిగ్గుపడుతూనే వుంది.

'యింకెంతసేపులే నీ సిగ్గు. రాత్రవనీ నీ సిగ్గు దోస్తాను.' అనుకున్నాడు మురళి లోలోన నవ్వుకుంటూ.

అనుకున్న ముహూర్తం రానే వచ్చింది.

శోభనం గదిలోకి కూడా ముఖానికి రుమాలు అడ్డుపెట్టుకుని సిగ్గుపడుతూ వచ్చిన భార్యను చూసి మురళి మురిసిపోయాడు.

ఆమె లేత పెదవులను తనివితీరా ముద్దాడాలని తహతహలాడుతూ రుమాల్తో పెదవులను దాచుకున్న ఆమె చేతిని... నెమ్మదిగా తప్పించి... ఆమె పెదవులందుకోబోయాడు తమకంగా.

అంతే! ఆ సమయంలో అతను పెట్టిన ఆర్తనాదానికి పూలతో అలంకరించబడిన పందిరి మంచం గజగజలాడింది.

అతని ఆర్తనాదానికి కారణం–ఆమె మూతి మీద కనపడిన మీసాలే!

బద్దలై... ఎర్రటి నూనె ఏరులై పారడం ఒకే సారి జరిగేయి.

లేకపోతే చారులో ఏమీ వెయ్యవద్దన్నానని– ఒట్టి నీళ్ళు మరగబెట్టి తెచ్చి అదే చారనుకో మంటుందా!... అవన్నీ వెయ్యకుండా చారు కాచడం కుదరదని చెప్పొచ్చుగా బడాయి కాక పోతే!

"ఏమిటా ఆలోచన?!!" మా ఆవిడ గర్జనతో ఉలిక్కిపడి వర్తమానంలోకి వచ్చిపడ్డాను.

ముఖం అమాయకంగా పెట్టి ఆమె ముఖం లోకి చూసేను బేలగా.

"ఇంతవరకూ చేసిన నిర్వాకం చాలు గానీ బజారెళ్ళి కూరగాయలు పట్టుకురండి! నేనే ఎలాగో ఓపిక చేసుకుని కూర వండుతాను. పిల్లలు ఆకలితో అలమటిస్తుంటారు." అంటూ మంచం దిగింది నీరసంగా.

"నేను కూరలు తేవాలా?..." అడిగేను ఆశ్చర్యంగా.

"ఏం తేలేరా?..." తిరిగి నన్నే అడిగింది అసహనంగా.

తినడానికి తప్ప నేనింకెందుకూ పనికి రానని మా ఆవిడ అప్పుడప్పుడు వాకృచ్చు తుంది (వాగుతుంది)... లొట్టలేసుకుంటూ కమ్మగా తినడం తప్ప... కూరగాయల బేరం కూడా తెలియదని దెప్పుతుందెప్పుడూ!... ఎప్పుడో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం కాయగూరలు కొనే డ్యూటీ ఆవిడదే!

ఈరోజు తనకు ఒంట్లో బాగాలేదు కాబట్టి నేను మార్కెట్‌కి వెళ్ళి తీరవలసిందేనన్నమాట. అయితే మాత్రం...

"ఏం తేలేరా?!" అనంటుందా?"

"ఎందుకు తేలేను! ఏం కూరలు తీసుకు రావాలో చెప్పు!" అన్నాను 'నరుడా ఏమి నీ కోరిక?' అన్న టైపులో.

"ఏవో నాలుగు రకాల కూరలు తెండి... పుచ్చులూ అవీ జాగ్రత్తగా చూసుకుని తీసుకు రండి." అంటే పుచ్చులున్నాయో లేదో చూసు కుని అవే తేవాలా సరిగ్గా చెప్పకపోతే ఎలా? (స్వగతం)

"ఆ చేత్తోనే రెండు కొబ్బరికాయలు చూసి పట్టుకురండి... లేతగా వుండే బెండకాయలు అరకేజీ కూడా. ఇంకా మీకు నచ్చినవో రెండు మూడు రకాల కూరలు తీసుకురండి." అంటూ నా చేతికో బిగ్ షాపరూ, ఓ వంద రూపాయల నోటూ ఇచ్చింది.

నాకు తెలుసులే! నువ్వేమీ అంత విడమరిచి చెప్పనక్కర్లేదు... మనసులోనే అనుకుంటూ మార్కెట్‌కి బయలుదేరేను.

మార్కెట్ మా ఇంటికి రెండు ఫర్లాంగుల దూరంలోనే వుంది. నడిచే బయలుదేరేను. నాకు నచ్చిన కూరలు కొంటూ సంచీ నింపుకో సాగేను.

కొబ్బరికాయల దుకాణం దగ్గర ఆగి బాగా పెద్దగా వున్న రెండు లేత కొబ్బరికాయలు బేర మాడి కొన్నాను.


మరో దుకాణంలో అరకేజీ వంకాయలు కొని... సంచిలో పోసుకుంటుంటే– అదే దుకా ణంలో బెండకాయలు కూడా కనిపించేయి. కానీ అన్నీ లేతగా వున్నాయి.

"ఏం బాబూ! బెండకాయలన్నీ ఇవేనా?...

## ఈ నెల 'దినం'



### డిశంబర్,2- బానిసత్వ నిర్మూలన దినోత్సవం






ముదర బెండకాయలు లేవా?" అనడిగేను. ఆ లేత బెండకాయల వైపు తిరస్కారంగా ఓ చూపు చూసి.

ఓ క్షణం నా ముఖంలోకి చూసి- "ఎందుకు లేవు బాబూ... వున్నాయి! ఎన్ని కావాలి? ఓ కేజీ తూచేదా?"

"కేజీ ఒద్దు గానీ... ఓ అరకేజీ తుయ్యి! బాగా ముదరగా వుండాలి సుమా కాయలు!" హెచ్చరించేను. గంపలో దాచుకున్న బెండకాయలు తీసి తూచసాగేడు.

హమ్మా! ముదర బెండకాయలన్నీ లోపల దాచుకున్నావా బాబూ!... మా ఆవిడ ముందే చెప్పడం మంచిదయింది. వీణ్ణి నమ్ముకుని వుంటే ఎందుకూ పనికిరాని లేత బెండకాయలు అంటగట్టి వుండేవాడు. ఆ తరువాత ఇంటిదగ్గర మా ఆవిడతో నానా తిట్లూ తినాల్సి వచ్చేది. బ్రతికిపోయాను... బెండకాయలు సంచీలో వేసుకుని ఇంకా కొన్ని రకాల కూరగాయలు, ఉల్లిపాయలు, అల్లం, కొత్తిమీర... వగైరాలతో బేగ్ నింపుకుని భారంగా యింటికి నడక సాగించేను.

ఇంటికెళ్ళేసరికి మా ఆవిడ తలకి గుడ్డ కట్టుకుని వంట ప్రయత్నంలో వుంది.

"ఏవోయ్! ఇవిగో కూరగాయలు చూసుకో!" సంచీ వంటగదిలో పెట్టేసి టీవీ ముందు సెటిలై పోయాను.

టీవీలోంచి భీకర ధ్వనులేవో వినపడుతుంటే టీవీ రిపేరుకొచ్చిందేమోనని భయపడ్డాను.

కాదు! మా ఆవిడ కూరగాయలు సర్దుతూ... గొణుగుతోంది.

"అయ్యో! అయ్యో! ఈ కొబ్బరికాయలేమిటి ఇంత లేతగా వున్నాయి. ఈ బెండకాయలేమిటి ఇంత ముదరగా వున్నాయి?" గొంతులో కోపం చిందులేస్తుంటే నా గుండెల్లో రాయిపడింది. అయిపోయింది.

నా ప్రియమైన వస్తువు దేనికో మూడిందీ రోజు.

"ఏమయిందే?" అడిగేను బెరుగ్గా-చెరుగ్గెడలా వంగిపోతూ.


"ఏమిటీ బెండకాయలు? మనుషులు తినడానికేనా?... ఈ కొబ్బరికాయలెందుకైనా పనికొస్తాయా అసలు!" బుసలు కొడుతూ రంకెలు వేస్తోంది.

"నువ్వేగా చెప్పేవ్! లేత కొబ్బరికాయలు రెండు. ముదర బెండకాయలు అరకేజీ అనీ...." లేని ధైర్యం ఎరువు తెచ్చుకుని దబాయించడానికి ప్రయత్నించేను.

# బాలి కార్టూన్‌కి క్యాప్షన్

## నవంబర్ నెల క్యాప్షన్ ఫలితాలు

### బహుమతి పొందిన క్యాప్షన్




-ఎన్.ధీరజ

### మరికొన్ని క్యాప్షన్లు

✦ నాకు ధైర్యం చెప్పకుండా, ఒకరికి ఒకరు చెప్పుకుంటున్నారు ఎంటీ?!

– కె.చందన

✦ ఇప్పుడెలా మొదలెడదాం. –సీతారామరావు కొడాలి

✦ యూట్యూబ్ నుండి వీడియో డౌన్లోడ్ చేయండి.. చూస్తూ చేసేద్దాం.

–దాసరి చంద్రయ్య

✦ సన్నగా తరగాలా, లావుగా తరగాలా అని అడుగుతావేంటీ? – పెండేల


✦ గుసగుసలు ఆపి మీ ముగ్గురు నాకు అప్పిచ్చారు అది గుర్తుంచుకోండి.

–కాకరపర్తి సుబ్రహ్మణ్యం

✦ వీడి మెదడు మోకాల్లో ఉందట, ఇక్కడే ఆపరేషన్ చేసేద్దాం డాక్టర్స్.

–నిమ్మగడ్డ కృష్ణ.

ప్రఖ్యాత చిత్రకారులు, కార్టూనిస్టు శ్రీ బాలిగారు గీసిన ఒక బొమ్మ ఇక్కడ ఇస్తున్నాం. ఈ బొమ్మకి తగ్గట్టు... నవ్వొచ్చేట్లు క్యాప్షన్ రాసి పంపండి.




ఉత్తమ క్యాప్షన్‌కి బాలిగారి కార్టూన్ పుస్తకం బహుమతి!
బాగుండే కొన్ని క్యాప్షన్లు ప్రచురిస్తాం.

**నిబంధన:** ఒక డైలాగ్ మాత్రమే ఉండాలి. నవ్వు వచ్చే విధంగా రాయాలన్నది ముఖ్య గమనిక!

మీ క్యాప్షన్‌లు చేరవలసిన ఆఖరి తేదీ: **డిశంబర్,20.**

ఈ మెయిల్‌కు మీ క్యాప్షన్ పంపండి-

**hasyanandam.mag@gmail.com**.

"రామ రామ నేనలా చెప్పేనా? నేను చెప్పింది లేత బెండకాయలు, ముదర కొబ్బరికాయలు. అన్నీ తారుమారు చేసి తీసుకొస్తారా?... ఒక్కరోజు నేను వెళ్ళలేక మిమ్మల్ని పంపిస్తే అంతా కంగాళీ చేసుకొస్తారా?" ఆగకుండా అనకొండలా బుసలు కొడుతూనే వుంది.

అయితే లేత బెండకాయలు, ముదిరిన కొబ్బరికాయలు మంచివా?... మరయితే నాకెందుకలా చెప్పింది? లేకపోతే నేనే తప్పుగా అర్థం చేసుకున్నానా? నాకేం అర్థం కావడం లేదు. అర్థం కావడానికి యింకేమీ లేదు. ఎప్పట్లాగ ఈ పనీ చెడగొట్టి వుంటాను... అందులో నో డౌట్! నెమ్మదిగా వంటగది గుమ్మంలోంచి లోపలికి తొంగి చూసాను.

ప్రహసనం యింకా పూర్తయినట్లు లేదు.

"ఆనపకాయ కొన్నారు. బాగానే వుంది. రెండెందుకు కొన్నారు? ఒకటి అయిపోయాక మరొకటి కొనుక్కోవచ్చు కదా! అప్పటికిది పాడైపోదూ! ఏం మనిషో ఏంటో! రెండు ఆనపకాయలేం చేసుకోను?... నా నెత్తినేసి కొట్టుకుంటాను. సరిపోతుంది!" రౌద్రరసం, విసుగు రసం (వుందా అసలు?) గొంతులో మిళాయించి అంది.

"రెండేమిటి? ఆనపకాయ ఒకటే కదా కొన్నాను?..." అన్నాను గుండ్రటి ఆనపకాయను చేతిలోకి తీసుకుని.

"మరి ఇదేమిటంటా?!" అంది బ్యాగ్‌లోంచి పొడుగాడి దొకటి చేతిలోకి తీసుకుని చూపిస్తూ.

నవ్వొచ్చింది నాకు.

"ఓసి పిచ్చిమొహమా!... యిది సొర కాయ!" అన్నాను నీ తెలివితేటలింతేనా అన్నట్లు.

గొంగళి పురుగును చూసినంత కంపరంగా చూసింది మా ఆవిడ నా వైపు. "రామ!...రామ! ఆనపకాయన్నా, సొరకాయన్నా ఒకటేనండి! గుండ్రంగా, పొడుగ్గా రెండు


**హాస్యానందం సౌజన్యంతో**

**ప్రపంచ డయాబెటిస్ దినోత్సవం (14,నవంబర్) సందర్భంగా**



**శ్రీపూటుకూరి సుబ్బారావుగారి స్మారకంగా**

**రామ్‌కుమార్స్ డయాబెటిస్ అకాడమీ & డాక్టర్స్ స్మైల్ క్లబ్, గుంటూరు వారు నిర్వహిస్తున్న**

# చక్కెర 'కేళి'

## ఎస్.ఎమ్.ఎస్ పోటీలు

**బహుమతి పొందిన 20 మెసేజ్‌లకు**
**250 రూపాయలు చొప్పున బహుమతి+ ప్రశంసాపత్రం.**

*నిబంధనలు:*

- షుగర్ వ్యాధి రాకుండా జాగ్రత్తలు లేదా వచ్చిన తరువాత జాగ్రత్తలు సూచిస్తూ మెసేజ్‌లు పంపించండి.
- పేషెంట్లను కించపరిచేటట్లు, భయపెట్టేటట్లు మెసేజ్‌లు ఉండకూడదు.
- ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడే మెసేజ్‌లకు మొదటి ప్రాముఖ్యత.
- మెసేజ్‌లు కచ్చితంగా నాలుగు లైన్లు దాటకుండా, తెలుగులోనే ఉండాలి!
- ఫలితాలు జనవరి,2023 సంచికలో ప్రచురించబడుతుంది.
- మెసేజ్‌లు ఈ కింది మెయిల్‌కి పంపండి–

**hasyanandampoteelu@gmail.com**

**ఎస్.ఎమ్.ఎస్‌లు చేరవలసిన ఆఖరి తేదీ: డిశంబర్, 10, 2022**





రకాలుగానూ వుంటాయవి." ఇంకేమనాలో తోచక రెండు చేతులూ జోడిస్తూ అంది మా ఆవిడ.

ఆనపకాయన్నా, సొరకాయన్నా ఒకటేనా! మరి ఆ విషయం నాకు చెప్పాలా వద్దా? ఆనప కాయలు గుండ్రంగా, పొడుగ్గా రెండు రకాలుగా వుంటాయని నాకెలా తెలుస్తుంది? నాకేమైనా దివ్యదృష్టి వుందా?


ఎందుకొచ్చిందిరా బాబూ! యింకా ఇక్కడే వుంటే మిగతా కూరగాయలకు కూడా ఏవేవో వంకలు పెట్టి నేనెందుకూ పనికిరానని మరో సారి నిర్ధారించుకుంటుందని అక్కడినుంచి జారుకుని వీధిలోకి వెళ్ళిపోయాను... కాదు.... కాదు. పారిపోయాను హమ్మయ్య!!!

## బాలి బొమ్మకు కోనే కథ

'విశాలక్షి' సౌజన్యంతో

# రక్తి కట్టిన భక్తి

**భా**ర్య యిచ్చిన గ్లాసుడు ఫిల్టర్ కాఫీ తృప్తిగా గుటకాయ స్వాహా చేసిన రంగనాధం ఖాళీ గ్లాసు టీవీ బల్ల మీద పెట్టేసి– ఎలాగూ యింత దూరం వచ్చాను కదా అని టీవీ ఆన్ చేసి రిమోట్ చేత బట్టుకుని సోఫాలో ఒరిగిపోయి, తనకిష్టమైన ఛానల్ పెట్టుకుని చూస్తూ మురిసి ముక్కలై పోసాగేడు.



ముప్పై ఐదేళ్లు అలుపెరుగని టెన్షన్‌తో కూడిన ఉద్యోగం చేసి ఈ మధ్యనే రిటైరైన రంగనాధం – విశ్రాంత జీవితాన్ని ఏ టెన్షన్ లేకుండా ఆనందంగా గడుపుతూ కాలక్షేపం చేస్తున్నాడు.

టీవీలో పిల్లి నడకలు నడుచుకుంటూ వీలై నంత ఎక్కువ వగలు ఒలకబోస్తున్న సుంద రాంగులను చూస్తూ రంగనాధం కూడా ధారా ళంగా చొంగ ఒలకబోసుకుంటున్నాడు.

అప్పుడే యిల్లు ఊడ్చుకుంటూ హాల్లోకి చీపురు కట్టతో ప్రవేశించిన సావిత్రి–

"నా కళ్ళజోడు పవర్ తగ్గిపోయింది. కొత్త అద్దాలు వేయించండి మహాప్రభో! అని చెప్పి నెల రోజులైపోయింది. ఆ సంగతి చూసేదే మైనా ఉందా?... కళ్ళు సరిగ్గా కనబడక చస్తు న్నాను!" అన్నది చీపురు ఝుళిపిస్తూ.

"ఆс!...అదీ...అదీ...సాయంత్రం వెళతా నులే!" అన్నాడు రంగనాధం టీవీ మీద నుంచి దృష్టి మరల్చకుండానే.

టీవీ లో సౌండ్ విని–

"మళ్లీ పెట్టేరా ఆ పేషను టీవీ?... అవి చూసే వయసేనా మీది అని అడుగుతున్నాను. ఛానల్ మార్చండి. భక్తి టీవీలో చాగంటి వారి ప్రవచనాలు వస్తాయి!" ఝూడించింది సావిత్రి.

"ఆ...ఆ... పెడుతున్నానులే!" అన్నాడు నసుగుతూ... యిష్టం లేనట్టుగా రంగనాధం.

మరు నిముషంలో చాగంటి వారి గొంతు ఖంగుమంది.

"........... తరువాత భజన కుండేటటు వంటి గొప్ప లక్షణాలేమిటంటే...." చాగంటి వారి ప్రవచనం వింటూ తన్మయురాలవుతూ తన ఊడ్పుల పని కొనసాగిస్తోంది సావిత్రి.

అయిదు నిముషాల తరువాత –

"...........తరువాత భజన కుండేటటు వంటి గొప్ప లక్షణాలేమిటంటే...." చాగంటి వారి ప్రసంగం అనర్గళంగా కొనసాగుతోంది.

వంట గదిలోకి వెళుతూ సావిత్రి పరవ శంగా వింటోంది.

రంగనాధం కళ్ళు రెండూ కళ్ళజోడును చీల్చుకుంటూ వచ్చి టీవీ కి అతుక్కుపోయి ఆనంద పారవశ్యం చెందుతున్నాయి.

"...........తరువాత భజన కుండేటటు వంటి గొప్ప లక్షణాలేమిటంటే...." చాగంటి వారి ప్రసంగం కొనసాగుతూనే ఉంది.

వంటగదిలో ఉన్న... సావిత్రిలో ఏదో సందేహం!

హాల్లో టీవీ చూస్తున్న రంగనాధం కళ్ళలో ఆనంద సందోహం!

సావిత్రి పరుగు పరుగున టీవీ దగ్గరగా వెళ్లి కళ్ళు పెద్దవి చేసి చూసింది.

టీవీలో పేషనమ్మాయి గుడ్డ పీలికలు ధరించి అందాలు చిందిస్తుంటే –

"...........తరువాత భజన కుండేటటు వంటి గొప్ప లక్షణాలేమిటంటే..." అంటూ చెప్పిన విషయాన్నే మళ్లీ మళ్లీ కనిపించకుండా చెబుతున్న చాగంటి వారు–

అక్కడ జరుగుతున్నది ఏమిటో అర్థ మయిన సావిత్రి రౌద్రావతారం దాల్చింది.

ఎలాగూ ఆవిడకు కళ్లు సరిగ్గా కనిపిం చవు కదా అని...

ఫ్యాషన్ టీవీ సౌండ్ వినబడకుండా తగ్గిం చేసి – సెల్ ఫోన్లో చాగంటి వారి ప్రసంగానికి అనుసంధానం చేసి – అయిదు నిముషాల ప్రసంగం ముగియగానే మళ్లీ మళ్లీ రిపీట్ బటన్ నొక్కుతూ అదే ప్రసంగాన్ని కొనసాగి స్తున్న వైనం సావిత్రికి తెలిసిపోయేసరికి...

టీవీకట్టేసి సెల్ ఫోన్లో ప్రసంగం ఆపేసి ఆ రోజు తనకు పడబోయే శిక్షను తలుచు కుంటూ బయట అరుగు మీదకు పారిపో యాడు పాపం రంగనాధం.



# ఓ పెన్‌డ్రైవ్ కథ

**"........పక్కనే ఉంటాడమ్మా..... పట్టించుకోడు.....' కూనిరాగం తీస్తూ అంట్లన్నీ బరబరా తోమేస్తున్న పనిమనిషి దగ్గరకు గునగున నడుచుకుంటూ వచ్చింది కుతూహలమ్మ.**

చుట్టుపక్కల ఇళ్లల్లో జరిగే కీచులాటలూ, గొడవలూ అత్తా-కోడళ్లు జుట్టూ జుట్టూ పట్టు కోవడాలూ లాంటి ముఖ్యమైన విషయాలు తెలుసు కోవడమంటే ఎంతో మక్కువ కుతూహలమ్మకి... పైగా ఆయా యిళ్లల్లో పని చేసేది కూడా రంగమ్మే కావడంతో ఆవిడ వినోదానికి హద్దేలేదు.

రోజూ రంగి పనిలోకి రాగానే వాళ్ల యిళ్లల్లోని కబుర్లు చెప్పించుకుని సరదా పడిపోవడం కుతూహలమ్మ దినచర్యలో మొట్టమొదటిది. ఆ పోసుకోలు కబుర్లు చెప్పినందుకు రంగికి బోలెడన్ని కానుకలు సమ ర్పించుకుంటుంది.

✦ ✦ ✦

రంగి వంచిన తల ఎత్తకుండా యిల్లు ఊడుస్తోంది.



"ఏంటే రంగీ! అంత హుషారుగా ఉన్నావ్! ఏంటి విశేషం?" అడిగింది.

"విశేషమా పాడా!... మా ఆయన గురించేనమ్మా! ఏదీ పట్టించుకోడు కదా మాయదారి సచ్చినోడు. పట్టించుకుని ఉంటే ఈపాటికి యిద్దరు పిల్లల తల్లినై ఉండేదాన్ని!" అంటూ అంట్లు కడిగిన నీళ్లతోపాటు కాసింత సిగ్గూ ఒలక బోసింది రంగి.

"ఓసి నీ సిగ్గు చిమడా! అన్నట్టు నిన్న ఆ ఎదురింటి విశాలాక్షి యింట్లోంచి పెద్ద పెద్ద కేకలు వినపడ్డాయి. ఏమైందే వాళ్లింట్లో?!" కుతూహలంగా అడిగింది కుతూహలమ్మ.

"ఆ ఇంట్లో రోజూ జరిగే బాగోతమే కదమ్మా!... మీకు తెలియనిదేముంది! ఆవిడ, బాబు గారినసలు లెక్క చెయ్యదు కదా! రోజూ బజారుకెళ్లి యింటికి కావల సిన సరుకులూ, కూరగాయలూ తెస్తారు కదా! సంచీ బోర్లించి-అది బాగాలేదు... యిది కుళ్లిపోయింది... అంటూ వంకలు పెట్టి నానాతిట్లూ తిడుతుందాబాబు గారిని ఆ మహాతల్లి" చెప్పింది రంగి.

"అదా సంగతి! ఎలా భరిస్తున్నాడే బాబూ! అంత గయ్యాళిని?! ఆ మహాను భావుడు చాలా అమాయకుడిలా ఉన్నాడే! అదే మన బాబుగారైతేనా...." వాక్యం ముగించకుండానే... నువ్వే ఊహించుకో అన్నట్టూ దీర్ఘం తీసింది కుతూహలమ్మ.

✦ ✦ ✦

"రంగీ! నీ 'టీ' కప్పు వరండాలో గట్టుమీద పెట్టేను తాగేసి పనిచేసుకో... ఆఁ అన్నట్లు ఆ వెనకింటి లలితమ్మగారింట్లో ఆవిడకీ, వాళ్లత్త గారికీ నిన్న ఏదో గొడవ జరిగినట్టుంది కదా! ఏమిటి సంగతి!..." తనకు అసలు ఏ మాత్రం ఆసక్తి లేనట్లు అడిగింది కుతూహలమ్మ.

"ఏదో అయిందిలెండమ్మా!.. ఆయన్నీ చెప్పడానికి నాదగ్గర టైమూ లేదు... తీరికా లేదు. అడ్డు లెగండి. గది ఊడవాలి..." చీపురుకట్టను చూపిస్తూ అంది రంగి.

"ఊడుద్దువుగానిలేవే... నీకోసం నాలుగు పాతచీరలు తీసి పెట్టేను. వెళ్లేటప్పుడు పట్టుకెళుదువుగాని... యింతకీ ఏం జరిగిందే?" అంది రంగి మాటల్ని తేలిగ్గా తీసి పారేస్తూ కుతూహలమ్మ.

రంగి గది ఊడవడంలో బిజీగా వుంది.

"చెప్పవే!... ఆ లలిత ఏడుపు కూడా వినిపించింది నాకు."

అప్పుడొచ్చింది హుషారు రంగికి.

"ఆ సంగనాచిదమ్మా దొంగేడుపమ్మా!... మొగుణ్ణి కొట్టి మొత్తుకుందట ఒక యిల్లాలు అలా ఉంటుంది ఆయమ్మ యవ్వారం..." చీపురుకట్టతో విన్యాసాలు చేస్తూ చెప్పింది రంగి.

"ఏం జరిగిందే?" బి.పి. పెరిగిపోతుండగా అడిగింది కుతూహలమ్మ.

"యింకేం జరగాలమ్మా! నిన్న ఆ లలితమ్మ గారి అత్తగార్ని బాబుగారు వాళ్ల ఊరునుంచి తీసుకువచ్చారు కదా! ఆవిడ రాగానే ఈవిడ వీరంగం ఎత్తుతుంది. యిల్లు రణరంగం అవుతుంది. 'హత్తేరి' ఆవిడ వస్తే యింట్లో నెలకి రావలసిన రేషన్ సరుకును పదిరోజుల్లో అయిపోతాయి కదా! యిప్పుడు ఆవిడ్ని ఎందుకు తీసుకువచ్చావని' బాబుగారి మీద పెద్ద పెద్ద కేకలు వేసి నానా రభసా చేసి పైగా నెత్తీ నోరూ బాదుకుని ఏడుపొకటి..." ఆవేశంగా చెప్పి అంతలోనే చల్లారిపోయిన రంగి...

"అయినా ఊళ్లో వాళ్ల విషయాలన్నీ మీకెందుకమ్మా!... నాకు తీరికలేదు యింకో యింట్లో పనికి వెళ్లాద్దా! ఆ చీరలేవో నా ముఖాన కొడితే వెళ్లొస్తాను." అంటూ చీరలు మూట కట్టుకుని




## పెన్నుతో పెట్టిన విద్య

హాస్యానందం లాంటి విశిష్ట పత్రిక, ఒక రచయిత వివరాలతో ఒక ప్రత్యేక సంచిక తీసుకురావడం నిజంగా ఒక అపురూపమైన సంగతి... ముదావహమైన సంగతి. ఏ రచయితకైనా ఇంతకంటే గొప్ప గుర్తింపు, సత్కారం ఉండవు.

ఈ అక్షరాభిషేకం అందుకున్న భాగ్యశాలి నా మిత్రుడు శ్రీ కోనే నాగ వెంకట ఆంజనేయులు గారికి శుభాభినందనలు. ఈ రకంగా నా మిత్రుడిని 'అట్టపై కెక్కించిన' ఆ పత్రిక సంపాదకులకు కృతజ్ఞతాభివందనాలు.

శ్రీ కోనేవారిని చూసినా చూడకపోయినా వారి పేరు తలస్తే చాలు మన పెదాల మీద చిరునవ్వు మొలకెత్తుతుంది.

ఆయన రాతల్లోనే కాదు, మాటల్లోనూ అద్వితీయులే. అక్షరాలచేత నాట్యం ఆడిస్తూ, పదాలతో చెడుగుడు ఆడుతూ అప్పటికప్పుడు సరికొత్త చిత్ర విచిత్ర హాస్య పదాలను సృష్టించడం, మళ్ళీ వాటితో మాల కట్టి నవ్వించడం ఆయనకు పెన్నుతో పెట్టిన విద్య. ఆయన ప్రతి రచనా హాస్యతాళింపుతో గుబాళిస్తుంది. అలాగని విరగబడి నవ్వించకుండా, సంసార పక్షపు హాస్యం చిందించడంలో అందెవేసిన చేయి శ్రీకోనే వారిది. ఎన్నో చక్కని, చిక్కని కథలు రాయడమే గాక ఎన్నో బహుమతులూ అందుకున్నారు... ముఖ్యంగా హాస్య రచనలకు. వారి చమత్కార వైభవానికీ, హాస్య చతురతకూ మరోసారి అభినందనలు.

శ్రీకోనే వారు ఇదివరకు చందమామలో ఎన్నో బాలల కథలు అత్యద్భుతంగా రాశారని ఈ మధ్యే తెల్సింది. అదికూడా ఒకరు తన బాల్య జ్ఞాపకాల్లో అప్పటి కొందరు బాల సాహిత్య రచయితలతో పాటు శ్రీ కోనే వారి పూర్తి పేరు రాయడం ఆశ్చర్య పరిచింది . వెంటనే మిత్రుడిని అభినందించాను. ఈ సందర్భంగా మరోసారి నా మిత్రుడికి అభినందనలు.

శ్రీ కోనే పాటగాడు కూడా. అతడి సుస్వరం విన్న ఎవరైనాసరే అభినందించకుండా ఉండలేరు. అతడిలో మల్టీటాలెంట్ వుంది గనుకే ఒక సభలో స్టాండింగ్ కామెడీ ప్రదర్శన ఇమ్మని కోరాను కూడా.

ఇకపోతే శ్రీ కోనేవారు మంచి స్నేహశీలి. నేను అమెరికాలో ఉన్న గత ఏడాదిలో ఆయన నేను కోరిన మ్యాగజైన్లు ఆన్‌లైన్‌లో నాకు పంపించి ఎంతగానో సహకరించారు. వారికి ఈ సందర్భంగా పత్రికా ముఖంగా మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.



శ్రీకోనే వారికి హాస్యామృతమే గొప్ప టానిక్కు. అది చిరకాలం తను తాగుతూ, మనచేత తాగిపిస్తూ మనందర్నీ ఆరోగ్యవంతులుగా ఉంచుతారని ఆశిస్తున్నాను. ఉంచాలని మనసారా కోరుతున్నాను.

**–సింహప్రసాద్,**

ప్రముఖ కథ నవల నాటక రచయిత. హైదరాబాద్.




**'కొంటె' 'కోనే వాడు'**

**(కొంటె)** కోనే, నాగ వెంకట (ప్రసన్న) ఆంజనేయులు గారు! గళం ఎత్తితే గాయక 'కిశోరుడు' ఆయన గొంతులో పలుకుతాడు. 'పంచ్'లు విసురుతూ పది మందికి నవ్వులు పంచుతాడు.

చెల్లెళ్ళు, తమ్ముళ్ళు 'అన్నాయ్' అని పిలిచే ఆత్మీయుడు. కామెడీ కథలు రాసినపుడు ముళ్ళపూడి వెంకట రమణుడు పూనుతాడు. చందమామకు కథలు రాసినపుడు పిల్లలకు తానే పేదరాసి పెద్దమ్మ ఔతాడు. యాభైకు పైగా వత్సరాల సాహితీ క్షేత్రంలో సామాజిక, హాస్య, బాలల కథల పంటలు పండించిన కృషీవలుడు. బాపు బొమ్మలకు కథలు రాసి ప్రాణప్రతిష్ఠ చేసినవాడు. సమూహాల మధ్య, మిత్రుల మధ్య 'కొంటె' 'కోనే వాడు'. తన ప్రతిభ తనకే తెలియని 'ప్రసన్న' ఆంజనేయుడు.



**-డాక్టర్ ఎమ్. సుగుణరావు**

విసవిసా నిష్క్రమించింది రంగి.

కుతూహలమ్మ కడుపు నిండలేదు. చెప్పేదేదో పూర్తిగా చెప్పకుండా సగంలో ఆపేస్తే ఎలా? రాత్రికి నిద్రెలా పడుతుంది? యింకా వెనక వీధి అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న రాగిణి యింట్లో గొడవేంటో చెప్పలేదు. గ్రూప్‌హౌస్‌లో వుంటున్న శ్రావణి వాళ్లింటి విశేషాలు చెప్పకుండా వెళ్లిపోయింది. యిలాగైతే ఎలా?... అందరిళ్లల్లోని సంగతులూ చెప్ప డానికే కదా దానికి కూరా నారా యిస్తున్నది! బోలెడన్ని పాతచీరలూ, జాకెట్లూ దానికి పోస్తున్నదీ! అన్నీ మూట కట్టుకుని తీసుకుపోవడానికి తీరిక ఉంటుంది గానీ... కబుర్లు చెప్పడానికి తీరిక ఉండదేం? కడుపు రగిలిపోయింది కుతూహలమ్మకి.

మరునాడు ఉదయాన్నే రంగి పనిలోకి రాగానే–

"ఒసేయ్ రంగీ! నిన్న ఆ లలితమ్మగారింట్లో గొడవ గురించి పూర్తిగా చెప్పకుండానే వెళ్లిపోయావ్. యివాళేనా పూర్తి చేస్తావా మహా తల్లీ" అని నిలదీసింది కుతూహలమ్మ.

"అమ్మా! నిజంగానే నాకు టైములేదు... అందరిళ్లల్లో పనే చెయ్యనా! వాళ్లందరి సంగతులూ చెబుతూ కూర్చోనా?... యిదిగోండి పెన్‌డ్రైవ్. యిందులో నేను పని చేస్తున్న ప్రతీ యింట్లోని సంగతులూ, గొడవలూ అన్నీ వివరంగా రికార్డ్ చేసి పెట్టేను. వినేసి నేను వెళ్లిపోయేటప్పుడు తిరిగి యిచ్చేయండి. తరువాత యశోదమ్మ గారికి కూడా యివ్వాలి." అంటూ జాకెట్లోంచి చిన్న పాలిథిన్ కవర్లో భద్రపరిచిన పెన్‌డ్రైవ్ అందించింది.

ఆశ్చర్యపోతూ... పెన్‌డ్రైవ్ ప్లే చేసుకుని వింటున్న కుతూహలమ్మ ముఖం ఆనందంతో వెలిగిపోయింది. కాసేపటికి... ఆ వెలుగు యింకా పెరిగిపోయింది. సడన్‌గా చిచ్చుబుడ్డిలా వెలిగిపోతున్న కుతూహలమ్మ ముఖం ఆరిపోయిన చిచ్చుబుడ్డిలా మారిపోయింది. వెంటనే కందగడ్డలా ఎర్రబడిపోయింది. కంప్యూటర్‌లోంచి పెన్‌డ్రైవ్ లాగి పడేసి గబగబా రంగి దగ్గరికి పరుగెత్తు కొచ్చి–

"యిదేమిటే!... యిందులో నేనూ, అయ్యగారూ దెబ్బలాడుకున్న విషయాలు కూడా ఉన్నాయేమిటే?" అడిగింది ఆదుర్దాగా.

"అవునమ్మా! మీ ఒక్కళ్లవే కాదు. నేను పని చేస్తున్న యిళ్ల వాళ్లందరి గొడవలూ యిందులో వున్నాయి. ఏం వాళ్లు మాత్రం మనుషులు కారా? వాళ్లకి మాత్రం మీ యింటి గొడవలు తెలుసుకోవాలని ఉండదా?... కానీ నా పని ఆపేసి ఎంతమందికని చెప్పిందే చెబుతాను? అందుకే అందరిళ్లల్లోని గొడవలూ యిందులో రికార్డు చేసేసాను. మీలాగా వేరే వాళ్ల యిళ్లల్లోని గొడవల గురించి అడిగిన వాళ్లందరికీ ఈ పెన్‌డ్రైవ్ యిచ్చేసి నా పని చేసుకుంటాను." చెప్పింది రంగి.

కుతూహలమ్మ నోట మాట రాక నిశ్చేష్టురాలయింది.

"ఆ రోజునుంచీ కుతూహలమ్మ –ఇతరుల ఇళ్లల్లోని గొడవల గురించి రంగిని అడగడం మానేసింది. అని రాస్తాననుకున్నారా?

అబ్బా! ఆశ! అలా రాయడానికి యిదేమైనా గీతకథా? చందమామ కథా? హాస్యకథై తేనూ!

కుతూహలాలు ఎప్పటికీ పోవు... పైగా పెరుగుతాయి కూడాను.

అవి అజరామరాలు.




Life member scheme




# పేలు

**'ఛీ! ఛీ!! ఛీ!!! ఈ గవర్నమెంట్ ఆఫీస్‌లలో సూపర్నెంటు పోస్టంత దిక్కుమాలిన పోస్టు యింకొకటుండదు. స్టాఫ్‌లో ఎవరే తప్పు చేసినా పైవాడికి నచ్చ చెప్పుకోవాల్సిందీ... వాడు నచ్చుకోకపోతే వాడితో తిట్లూ, చివాట్లు తినాల్సిందీ సూపర్నెంటే!**

ఈ ఆఫీసులో అటువంటి సూపర్నెంటు గిరీ వెలగబెడుతున్న నాకు నా స్టాఫ్ కారణంగా దినదిన గండంగా ఉంది నా పై ఆఫీసర్స్‌తో.

ఆఫీస్ స్టాఫ్‌లో ఒక్కరికీ సరైన డ్రాఫ్టింగ్ రాదు... కూడికలు రావు. తీసివేతలు ససేమిరా!

స్టేట్‌మెంట్లు, డ్రాఫ్ట్ లెటర్స్ అన్నీ తప్పుల తడకలుగా తయారుచేసి నా టెబుల్ మీదకి పంపించేస్తారు. వాడే చూసుకుని కరెక్ట్ చేసుకుంటాడులెమ్మని.

చాలా చికాగ్గా ఉంది ఇలాంటి సిబ్బందితో వేగడం. అన్నీ ఒక్కడినీ ఎంతకని చూసుకోగలను?

ఇప్పుడు చెక్ చేస్తున్న స్టేట్‌మెంట్ అంతా తప్పుల తడికే! ఆ రామలక్ష్మి నిర్వాకం ఇది.

"రంగయ్య!" పిలిచేను ప్యూన్‌ని.

"బాబూ..." అంటూ నెమ్మదిగా లోపలికి వచ్చాడు రంగయ్య.

నా అదృష్టం బాగుండి పిలిచిన వెంటనే పలికేడు. లేకపోతే నాలుగైదుసార్లు పిలిచినా రాడు మహానుభావుడు. యిక్కడ ప్యూన్‌గానీ వాళ్ళ ఊళ్ళో ఊరి పెద్దల్లో ఒకడు మరి.

"ఆ బి.2 క్లర్క్ రామలక్ష్మిని ఇలా రమ్మను!" చెప్పాను...ఫైల్లో తలదూరుస్తూ.

అయిదు నిముషాలు గడిచినా రామలక్ష్మి జాడలేదు.

"రంగయ్య!... ఏదయ్యా రామలక్ష్మి? రమ్మన్నానని చెప్పేనా?" రంగయ్యని పిలిచి అడిగేను.

"చెప్పేను బాబూ!... పేలు చూసుకుంటున్నారు... వస్తానని చెప్పమన్నారు!" అన్నాడు రంగయ్య.

ఆఫీస్ అవర్స్‌లో పేలు చూసుకోవడమేమిటి? యింటిదగ్గర చేసుకోవాల్సిన పనులు ఆఫీస్‌లో చెయ్యడమేమిటసలు?

"సరే!... ఆ ఏ3 స్టెనో భారతిని డిక్టేషన్ తీసుకోవడానికి రమ్మను... అర్జెంటు!" అన్నాను.

హాల్లోకి వెళ్ళిన రంగయ్య వెంటనే తిరిగొచ్చాడు.


"చెప్పేను బాబూ! ఆయమ్మా పేలు చూసుకుంటున్నారండి. వస్తానని చెప్పమన్నారు!" అన్నాడు.

ఛీ... ఛీ... ఛీ...బొత్తిగా ఎవరికీ డిసిప్లీన్ లేదు. సూపర్నెంట్ అంటే భయం, భక్తి అంతకంటే లేదు. ఆఫీస్‌లో పేలు చూసుకోవడమేమిటసలు?

"సరే!... ఈ ఆడాళ్ళతో పనవ్వదు గానీ ఆ టైపిస్టు మాధవరావుని పిలుచుకురా!" అన్నాను చిరాగ్గా ఫైలు మూస్తూ.

రెండు నిముషాల తరువాత గదిలోకి వచ్చింది మాధవరావు అనుకుని తలెత్తి చూస్తే అతను కాదు-రంగయ్యే !

"మాధవరావుగారు కూడా పేలు చూసుకుంటున్నారండి. పది నిముషాల్లో వస్తానని చెప్పమన్నారు!" చెప్పేడు తాపీగా.



హే భగవాన్! ఏమిటిది!... మాధవరావు కూడా పేలు చూసుకుంటున్నాడా! ఏమయింది యివాళ ఆఫీస్‌లో వాళ్ళందరికీ.

ఆడంగులు పేలు చూసుకుంటున్నారంటే అర్థం ఉంది... మగాళ్ళు పేలు చూసుకోవడమేమిటి?

లాభంలేదు... నేనే వెళ్ళి చూడాలి. ఆఫీస్‌లో పేలు చూసుకోడాలు, జడలు వేసుకోడాలు లాంటివి కుదరదని గట్టిగా వార్నింగివ్వాలి.

లేచి హాల్లోకి వెళ్ళేను.

ఒక్కళ్ళూ వాళ్ళ సీట్లలో లేరు.

అందరూ– డిస్పాచ్ క్లర్క్ సుందరం టేబుల్ చుట్టూ చేరిపోయారు.

టేబుల్ మీదున్న పెద్ద సైజు బైండ్‌బుక్ తెరచి ఏదో వెతుక్కుంటున్నారు అందరూ.

నా రాక నెవరూ గమనించలేదు.

"ఏంచేస్తున్నారయ్యా సుందరం మీరంతా"? గద్దించి అడిగేను.

అంతా ఉలిక్కిపడ్డారు.

"ఏం లేదు సార్! పేలు చూసుకుంటున్నాం" చెప్పేడు సుందరం పేజీలు తిరగేస్తూనే.

"ఏమిటీ?... నువ్వూ పేలు చూసుకుంటున్నావా? అయినా పుస్తకంలో పేలు చూసుకోవడమేమిటి?" డౌటొచ్చింది నాకు.

వెళ్ళి బ్రౌన్ కలర్ అట్ట వేసి ఉన్న ఆ బైండ్ బుక్ తిప్పి చూశాను.

మబ్బు విడిపోయింది ! నవ్వొచ్చింది నాకు.

ఈ మధ్యన మా జీతాల స్కేల్స్‌రివైజ్ అయి– మా అందరిజీతాలు పెరిగాయి. నిన్ననే హెడ్ ఆఫీస్ నుంచి మెసేజ్ వచ్చింది. కొత్త స్కేల్స్‌లో ఎవరెవరి బేసిక్ పేలు... ఎక్కడెక్కడ ఫిక్స్ అయ్యాయో... వివరంగా వర్కవుట్ చేసినా డిటైల్స్ పంపిస్తున్నామని ఆ బుక్ వచ్చిందన్న మాట. స్టాఫ్ అంతా ఆతృతగా తమ బేసిక్ పేలు ఎక్కడ ఫిక్స్ అయ్యాయో చూసుకోవడంలో బిజీగా ఉన్నారన్నమాట.

అదీ సంగతి.

"ఓ. కే. గో ఎహెడ్. మీరంతా చూసుకున్న తరువాత... ఆ బుక్ నా రూమ్‌లోకి పంపించండి" అన్నాను నవ్వుకుంటూ నా రూమ్‌లోకి వచ్చేస్తూ!

మరి నేనూ చూసుకోవాలి కదా 'పేలు'!




## చంద్రుడికో నూలు పోగు

**'కోనే** నాగ వెంకట ఆంజనేయులు' ఈ పేరు ఎంత పెద్దదో ఆయన రచనా ప్రక్రియల లిస్ట్ కూడా అంతే పెద్దది...అని మనందరికీ తెలిసినదే.

మరి మీకు తెలియనివి నాకు తెలిసినవి కొన్ని ఉన్నాయనుకుంటున్నాను.

అవి ఏమిటంటే.... మేమందరం ఆయనను పిలిచేది 'కోనే ' గారు అనే. ప్రియమైన రచయితలు గ్రూప్ ద్వారా ఆయన పరిచయం. గ్రూప్‌లో కొంతమంది తాము పెట్టే ప్రతి మెసేజ్ చివర, వాళ్ళ పేర్లు కూడా టైప్ చేసే వాళ్ళు.

ఒరోజు 'మీ పేర్లు డిస్‌ప్లే అవుతాయి... ప్రతిసారీ అలా పెట్టనక్కర లేదు... చదవటానికి స్ట్రెయిన్‌గా ఉంటుంది' అని అందరినీ ఉద్దేశించి గ్రూప్‌లో మెసేజ్ పెట్టాను.

వెంటనే స్పందించి, నా విన్నపం మన్నించి, అలా రాయటం మానేసిన ఏకైక వ్యక్తి ఆయన. అంత సీనియర్ రైటర్ అలా చేయటం నన్ను విస్మయానికి గురిచేసింది.

ఆ తరువాత 'యమునమ్మ' అనే 'ఆత్మీయ సంబోధనను' గ్రూప్‌కు పరిచయం చేసింది ఆయనే. కార్టూన్స్, కామెడీ, సామాజిక కథలు... విభిన్న ప్రక్రియలలో రచనలు చేసినా ఎక్కువ రాసింది హాస్య కథలు మరియు పిల్లల కథలు. ఇదంతా గమనిస్తే, ఇతరులను నవ్వించటం, దైవస్వరూపులుగా భావించే పిల్లలను ఆనందింప చేయటం ఆయన స్వభావం అనిపిస్తుంది.

ఆనాడు స్వాతిలో 'బాపు బొమ్మకు', నేడు విశాలాక్షి లో 'బాలి బొమ్మకు' కూడా కథలు రాయటంలో జైత్రయాత్ర కొనసాగిస్తున్నారు. ఆ స్పాంటేనిటీ అక్కడతో ఆగ లేదు. గ్రూప్స్‌లో కూడా సందర్భానుసారంగా, స్పాంటేనియస్ గా జోక్స్ కట్ చేసి 'ఔరా' అనిపిస్తారు. గ్రూప్‌లో పాటలు కూడా పాడి ఎంటర్‌టైన్ చేస్తారు. చందమామ కథల్లో అందె వేసిన చెయ్యి కోనే గారిది.

మా పరిచయం నాలుగేళ్ల క్రితమే అయినా ఎప్పుడో పాతికేళ్ళక్రితం తను రాసిన కథలో దంపతులకు, నాదీ, శ్రీవారిది పేర్లు వాడటం(మా పర్మిషన్ లేకుండా?) ఓ విస్మయం.

'భీమరూప ధరి', 'కోనే నాగ వెంకట ఆంజనేయులు' గారిని 'సూక్ష్మరూప ధరి' 'కోనే' గారుగా నాలుగు వాక్యాలలో పరిచయం చేయటం సాహసమే.

ఆయనకి అందరూ ఆత్మీయులే... అందరికీ ఆయన ఆత్మబంధువే. కానీ వారి గురించి ఇలా ఆప్తవాక్యం రాయటం, నాలాంటి పిల్ల రచయిత్రికి మాత్రమే లభించిన సువర్ణావకాశం.



ఇలాగే కోనే గారు అందరినీ తన రచనలతో నవ్విస్తూ, అలరిస్తూ...మరెన్నో ప్రత్యేక సంచికల మీద ప్రత్యక్షమవ్వాలని మనసారా కోరుకుంటూ... నమస్సులతో...

**–సి. యమున.**




# స్కూల్ కెళ్ళనమ్మా!

**"ఒరేయ్ గోపీ! లేరా!... తెల్లారింది."**

**"ఊ!"**

**"లేరా నాయనా!... ఏడైపోయింది టైము."**

**"అబ్బా ఉండమ్మా! కాసేపు పడుకోనీ."**

**"తెల్లగా తెల్లారిపోతే యింకా నిద్రేమిట్రా! లేలే!... స్కూల్‌కి టైమవుతోంది."**

"అబ్బా! స్కూల్‌కా?..."

"అవున్రా! రోజు వెళ్ళేదేగా... ఇవాళ కొత్తగా అడుగుతున్నావేంటి?"

"నేను వెళ్ళనమ్మా స్కూల్‌కి!"

"ఏం?... ఇవాళ ఆదివారం కాదు నాన్నా!... శనివారం! ఇవాళ స్కూలుంటుంది."

"ఉంటే ఉందిలేవే!... నేను మాత్రం వెళ్ళను."

"ఇదేమిట్రా! ఇవాళ కొత్తగా స్కూల్‌కి వెళ్లనంటావేంటి?"

"వెళ్లబుద్ధి కావడం లేదమ్మా! ప్లీజ్-వెళ్ళనే!"

"అలా అంటే ఎలా నాన్నా!... స్కూల్‌కి వెళ్ళకపోతే ఎలారా! నా కన్న కదూ! లేరా నా చిట్టి తండ్రి."

"వెళ్లనే అమ్మా ప్లీజ్!..."

"ఎందుకనిరా? ఒంట్లో బాగా లేదా ఏమిటి?"

"ఒంట్లో బాగానే ఉంది లేవే... అయినా వెళ్ళను!"

"ఏ కారణం లేకుండా స్కూల్ మానేస్తానంటే ఎలారా?"

"కారణం లేకుండా మానేస్తాననడం లేదమ్మా!"

"ఏమిట్రా కారణం?"

"మరే....మరే...."

"ఏంటి మరే....మరే! కారణం చెప్పు."

"స్కూల్లో పిల్లలందరూ నన్ను కొడుతున్నారమ్మా!"

"ఏంటీ?! నిన్ను కొడుతున్నారా! ఎందుకు ఏం చేసావు నువ్వు?"

"వాళ్ళని నేనేం చెయ్యలేదమ్మా!"

"ఎవరినీ ఏమీ చేయకపోతే ఎందుకు కొడతారు?... ఇంతకీ ఎవరు నిన్ను కొట్టింది?"


"ఎంతమంది పేర్లని చెప్పను-మొన్నటికి మొన్న ఆ సిద్ధూగాడు... నేనలా వెనక్కి తిరగ్గానే రాయి తీసుకుని తలమీద కొట్టేడమ్మా!"

"ఊరికే ఎందుకు కొడతాడు...ఏదో అని ఉంటావు వాణ్ణి!"

"నేనేం అనలేదమ్మా!... హోం వర్క్ ఎందుకు చెయ్యలేదురా?... అని అడిగాను అంతే! నేను వెనక్కు తిరగ్గానే రాయితో నా బుర్ర బద్దలు కొట్టేడమ్మా! రక్తం కూడా వచ్చింది తెల్సా!"

"ఉండు వాళ్ళమ్మతో చెబుతాను వాడి పని!"

"అంతకు ముందు ఆ సాయిగాడు... పంపు దగ్గర నీళ్ళతో ఆడుతుంటే - వద్దురా అన్నానని... నేను వెనక్కి తిరగ్గానే నోట్లో నీళ్ళు పోసుకుని నా చొక్కా మీద ఊసి... పారిపోయాడమ్మా!"



"ఈసారి మనింటికి రానీ... వెధవని కాళ్లిరగ్గొడతాను!"

"వీళ్లిద్దరే కాదమ్మా! ఇంకా చాలామంది పిల్లలు నన్నేడిపిస్తున్నారమ్మా!"

"ఇంకెవ్రా!"

"అయిదో క్లాసులో ఉండే ఆ తేజాగాడు...."

"వాడా? వాడేం చేసాడు?"

"మొన్న హాఫ్‌యియర్లీ పరీక్షల్లో వాడికి లెక్కల్లో సున్నా మార్కులొచ్చాయమ్మా! అదేంరా అని అడిగేను. అంతే! నేనటు తిరగ్గానే నా చొక్కా మీద ఇంకు జల్లేడమ్మా!"

"వాడి సంగతి నేను చూసుకుంటా గానీ నువ్వు లే!"

"ప్లీజమ్మా! వెళ్ళమనకమ్మా స్కూల్‌కి."

"తప్పు నాన్నా! అలా అనకూడదు. లేచి తయారవ్వు."

"వద్దమ్మా! మాస్టార్లందరూ కూడా నన్ను నానా తిట్లూ తిడుతున్నారమ్మా?"

"మాస్టార్లు తిడుతున్నారంటే ఏదో చేసే ఉంటావు నువ్వు!"

"నేనేం చెయ్యలేదమ్మా! ఆ సోషల్ మాస్టారున్నారే. ఆయన పాఠాలు సరిగ్గా అర్థమయ్యేలా చెప్పడం లేదమ్మా! కాస్త అర్థమయ్యేలా చెప్పండి అన్నానంతే!"

"ఏమన్నారు?"

"నా ఎదురుగా ఏమీ అనలేదు గానీ... నేనలా వెళ్ళిపోగానే- నన్ను నానా తిట్లూ తిట్టేరటమ్మా-రమేష్ చెప్పేడు."

"అలాగా! వాడికేం రోగం!"

"ఆ ఇంగ్లీష్ మాస్టారు కూడా తిడుతున్నారమ్మా నన్ను."

"ఎందుకు నాన్నా?"

"ఏదో పదానికి స్పెల్లింగ్ అలా కాదు మాస్టారు ఇలా అని చెప్పేనమ్మా! అంతే!!"

"అంటే ఏమన్నాడు?"

"అప్పటికి ఊరుకుని-టీచర్స్ రూంలో నన్ను నానా తిట్లూ తిట్టేడటమ్మా! ఆ ఫ్యూన్ రంగయ్య చెప్పేడు నాతో."

"పోనీలే కన్నా! వాడి పాపాన వాడే పోతాడు."

"ఆ సైన్స్ మాస్టారయితే, ఓసారి మీరు చేసిన ప్రయోగం తప్పు మాస్టారూ అన్నానని...."

"నా ప్రయోగాల గురించి నీకేం తెల్సురా రాస్కెల్... అని ప్రక్కకెళ్లి తిట్టేరమ్మా - నాకు వినపడింది కూడా."

"పోనీలే బాబూ! పద్దవాడెప్పుడూ చెడ్డవాడు కాదు కదా! లే! లేచి స్కూల్‌కెళ్లవుగాని."

"ఏంటమ్మా నువ్వు! యిన్ని చెప్పినా యింకా స్కూల్‌కి వెళ్లమంటావేమిటి!"

"తప్పదురా కన్నా! పిల్లలు కొట్టినా-మాస్టార్లు తిట్టినా-ఎవరెలా ఏడిపించినా సరే-నువ్వు ఆ స్కూల్‌కి వెళ్లక తప్పదురా కన్నా!"

"ఎందుకని?"

"ఎందుకంటే నువ్వు ఆ స్కూల్‌కి హెడ్‌మాస్టారివి కాబట్టి!"

బాపు బొమ్మకు
కోనే కథ

'స్వాతి' సౌజన్యంతో



## పందికొక్కు

"ఏమండోయ్!... ఈ పందికొక్కుతో వేగలేక చస్తున్నాను. మీరు పూనుకుని ఏదో ఒకటి చెయ్యకపోతే ఈ సంసారం గుల్లైపోతుంది." భార్య మహాలక్ష్మి మాటలకు "సాయంత్రం వచ్చేటప్పుడు ఎలుకల బోను తెస్తాలే" అంటూ ఆఫీస్‌కు వెళ్ళిపోయాడు ఓ గవర్నమెంట్ ఆఫీస్‌లో పనిచేస్తున్న నిత్యానందం.

ఆఫీస్‌లో ఆనాడు క్లయింట్స్ నుండి లంచాల రూపంలో వసూలైన డబ్బుతో అతి తక్కువ మొత్తం ఖర్చుపెట్టి ఓ ఎలుకల బోను కొన్నాడు నిత్యానందం.

బోనులో ఒక ఉప్పు చేప ముక్కగుచ్చి వంటింట్లో పెట్టారు.

మరునాడు చూస్తే బోనులో పందికొక్కు లేదు, బోనులో గుచ్చిన ఉప్పు చేప ముక్క కూడా లేదు, పప్పు బియ్యంలో ఉప్పుచేప ముక్క నంజుకుని విందారగించిందా పందికొక్కు.

"మాయదారి ముండ!" అని తిట్టింది మహాలక్ష్మి.

"మళ్ళీ రాత్రికి ఏదైనా ఉపాయం ఆలోచిద్దాంలే..." అని చెప్పి ఆఫీస్‌కి వెళ్ళిపోయాడు నిత్యానందం.

ఆరోజు నిత్యానందానికి ఆఫీస్‌లో ఆనందం దొరకలేదు. ఎవరో క్లయింట్ దగ్గర లంచం తీసుకుంటూ అవినీతిశాఖ వారికి 'ఎర్ర చేతులతో' పట్టుబడిపోయాడు నిత్యానందం. తిన్నగా తీసుకువెళ్ళి రిమాండ్‌లో ఉంచారు నిత్యానందాన్ని.

ఆరాత్రి సెల్‌లో ఉండగా హఠాత్తుగా తనయింట్లో చేరి మేస్తున్న పందికొక్కు జ్ఞాపకం వచ్చింది నిత్యానందానికి.

ఆ పందికొక్కు తననుచూసి పరిహాసంగా నవ్వుతూ- "ఓయ్!... నిత్యానందం నీకూ, నాకూ ఏమిటితేడా? నువ్వు ప్రజల్ని దోచుకు తింటుంటే, నేను నిన్ను దోచుకుతింటున్నాను.... నువ్వు చేసేది ఒప్పూనూ. నేను చేసేది తప్పూనా? నన్ను బోనులో పెట్టాలని చూస్తావా?... యిప్పుడు ఎవరమ్మా బోనులోకి వెళ్లింది? నేను నా పొట్టనిండేవరకే తింటాను కాని నువ్వు... పొట్ట పగిలేలా తిన్నా తృప్తి లేదు నీకు. అందుకే నేను బోనులో పడలేదు. నువ్వు పెట్టిన బోనులో నువ్వేపడ్డావ్! నిన్నే 'పందికొక్కు' అందామన్నా అది మా జాతికే అవమానం. ఛీ!" అన్నట్లుగా అనిపించి సెల్ వూచలకు తల కొట్టుకున్నాడు నిత్యానందం.




# మిస్టరీ

**"మన వీధిలోకి కొత్తగా వచ్చిన ఆ బోసినోరు ముసలాయన్నీ, ఆయన భార్యనీ గమనించేరా?" అనడిగింది మా శ్రీమతి నేనింకా పూర్తిగా గుమ్మంలో అడుగుపెట్టకుండానే.**

ఈ మధ్యనే మా యింటికి నాలుగిళ్ళ అవతల యింట్లో కొత్తగా అద్దెకు దిగిన ఆ వృద్ధ దంపతులను నేనూ చూసాను.

కానీ ఆఫీసు నుండి రాగానే నా చేతిలో కాఫీ కప్పు కూడా పెట్టకుండా– ఆ ముసలాళ్ళ విషయం ముచ్చటించాల్సినంత అవసరమేమొచ్చిందో అర్థం కాలేదు నాకు.

"గమనించేను గానీ – బోసినోరు ఆయనది కాదు ఆవిడదోయ్ భార్యామణిరత్నం" అన్నాను, మల్లెపూల పొట్లం మా ఆవిడ చేతికి అందిస్తూ–అప్పుడైనా నా చేతికి కాఫీ కప్పు అందిస్తుందేమోనన్న ఆశతో.

"బోసినోరు ఆయనదో ఆవిడదో అన్నది అంత ముఖ్యమైన విషయం కాదుగానీ – అసలు విచిత్రమైన విషయం తెల్సా మీకు?" అని అడిగింది వంటగదివైపు వెళ్ళే ప్రయత్నమేమీ చెయ్యకుండానే.

"ఏమిటోయ్ అది?" కుతూహలంగా అడిగేను నేనింక కాఫీకి నీళ్ళు వదిలేసుకుని.

"అదేనండి. వాళ్ళిద్దరూ ఎంత అన్యోన్యంగా ఉంటారో తెల్సా! యిద్దరికీ డబ్భై ఏళ్ళ పైనే వయసుంటుంది..."


"ఏమిటీ? యిద్దరికీ కలిపా?"అడిగేను మధ్యలోనే ఆవిడ వాగ్ధాటికి అడ్డం పడుతూ.

"అబ్బబ్బా! మీకంతా వేళాకోళమే కదా! చెప్పేది వినండి – ఆయనకి డబ్భై అయిదు, ఆవిడకి డబ్భై ఏళ్ళూ ఉంటాయి. ఎక్కడికి వెళ్ళాలన్నా యిద్దరూ కలిసే వెళతారు. ఉదయం ఒక్క పాలపేకెట్ కోసం అర కిలోమీటరు దూరంలో ఉన్న పాలబూత్‌కి యిద్దరూ కలిసి వెళ్ళడంతో ప్రారంభమవుతుంది వాళ్ళ దినచర్య. ఆ తరువాత మార్కెట్‌కి వెళ్ళి కూరగాయలు తెచ్చుకోవాలన్నా... పచారీ కొట్లో సామానులు తెచ్చుకోవాలన్నా, యిక్కడికీ, అక్కడికని కాదు ఎక్కడికి వెళ్ళాలన్నా యిద్దరూ కలిసే వెళుతుంటారు" అని చెప్పి, ఊపిరి పీల్చుకోడాని కన్నట్లు ఒక్క క్షణం ఆగింది శ్రీమతి.

ఆ గేప్ చాలు కదా మనం మధ్యలో కలగజేసుకోడానికి.

"అందులో విచిత్ర మేముందోయ్!... ఈ వయసులో పిల్లలంతా ఉద్యోగరీత్యానో, పెళ్ళిళ్ళయిపోవడం వల్లనో ఎక్కడెక్కడో ఉండి ఉంటారు. యిప్పుడు వీళ్లిద్దరే కదా ఒకరికొకరు తోడు అందుకే అలా కలిసి తిరుగుతూ కష్ట సుఖాలు పంచుకుంటుంటారు." అన్నాను గుక్క తిప్పుకోకుండా.

"అబ్బబ్బా! మీకంతా తొందరే కదా! నేను చెప్పేది పూర్తిగా వినకుండా మీ లెక్చరేమిటి? అంతా విని



అప్పుడు చెప్పండి...” చిరువిసుగుతో అంది శ్రీమతి.

“అమ్మా!... తల్లీ!... చెప్పమ్మా!... తప్పయి పోయింది. చెంపలేసుకుంటున్నాను” అన్నాను చెంపలు ఉత్తుత్తినే వాయించుకుంటూ.

“అదికాదండి... అంత అన్యోన్యంగా ప్రతి పని కలిసి చేసే ఆ ముసలాళ్ళిద్దరూ–భోజనం మాత్రం కలిసి చెయ్యరట! అదేం విచిత్రమో! ఈ విషయం మన పనిమనిషే కాదు – మొన్న వాళ్ళని చూడడానికి వెళ్లిన మన పక్కింటి పంకజాక్షి కూడా ఎంతో విచిత్రంగా చెప్పింది...” అంటూ బుగ్గలు నొక్కుకుంది మా ఆవిడ.

నాకూ విచిత్రంగానే అనిపించింది వాళ్ళ విషయం.

అంతకలిసి మెలిసి అన్యోన్యంగా ఉండే ఆ దంపతులు భోజనం కూడా తప్పని సరిగా కలిసే చెయ్యాలి కదా!

మరిదేమిటి?

వాళ్ళిద్దరూ ఒకరి తరువాత ఒకరు భోజనం చెయ్యడమేమిటి?... యిదేదో పరిశోధించాల్సిన విషయమే.

ఆ మరునాడు రాత్రి భోజనాల సమయానికి నేను ఆ వృద్ధ దంపతుల యింటికి వెళ్ళేను.

నన్ను పరిచయం చేసుకునే ఉద్దేశ్యంతోనూ ప్లస్ వాళ్ళ మీల్స్ మిస్టరీ విడుతుందేమోననీను.

సరిగ్గా అదే సమయంలో ఆ ముసలాయన భోజనం చేస్తున్నాడు.

పదినిమిషాల్లోనే ఆయన భోజనం ముగించి... నాతో ముచ్చట్లాడుతున్న సమయంలో ఆ ముసలావిడ భోజనం చేసింది.

అంతా గమనించిన నాకు మిస్టరీ విడిపోయింది.

యిద్దరిలో–ఒకరు ఒకసారి, మరొకరు మరొకసారి బోసినోటితో ఎందుకు కనిపిస్తారో కూడా అప్పుడే అర్థమయింది నాకు.

పాపం!... ఆ ముసలాళ్ళిద్దరికీ కలిపి ఒకటే పళ్ళసెట్టు!






## పెన్నుతో పెట్టిన విద్య

నింగిలోని చందమామ... నెలకోకసారే నిండు పున్నమి వెలుగులు చిమ్ముతుంది. అదే చందాన అలనాటి చందమామ కూడా నెలకోకసారి వెలువడుతూ, ఇంటింటా వినోద విజ్ఞానపు వెలుగులు నింపేది. ఆనాటి చందమామలో కొందరు రచయితలు రెగ్యులర్‌గా కథలు రాస్తూ, చందమామంత శాశ్వత నామం సంపాయించుకున్నారు. చందమామ పేరు చెబితే, వాళ్ళ పేరు గుర్తుకు రావలసిందే.


అటువంటి ప్రతిష్ఠను స్వంతం చేసుకున్న కొద్దిమంది రచయితలలో హేలాపురి గ్రామ స్రష్ట కోనే నాగ వెంకట ఆంజనేయులు ఒకరు. హేలాపురి గ్రామం సృష్టించి, చందమామ పాఠకుల మనసుల్లో ఆ గ్రామానికి శాశ్వత స్థానం కల్పించిన ఘనుడు కోనే నాగ వెంకట ఆంజనేయులుగారు. ఆయన రాసిన చందమామ కథలు పిల్లలకి ఎంత ఇష్టమో, పెద్దలకూ అంటే ఇష్టం.

కోనే నాగ వెంకట ఆంజనేయులు గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. పిల్లలకథలు, అపరాధ పరిశోధన కథలు,సామాజిక కథలు, బొమ్మలకి కథలు... ఇలా అనేక పార్శ్వాలను స్పృశిస్తూ రాస్తున్న రచయిత.

అన్నట్టు, ఆయన ఓ కార్టూన్ గీతాకారుడు కూడా! అయితే, ఒక కార్టూన్ అలనాటి ఆంధ్ర పత్రికలో వచ్చాక, 'గంగి గోవుపాలు గరిటెడైనను చాలు' కదా అనుకుని, మానేశారు! ఆయన ఎంతగా పిల్లల కథల రచయితో, అంతగానూ హాస్య రచయిత కూడా. పీపాలకొద్దీ హాస్యరసం సేవించినంత హాస్య శైలి ఆయన సొంతం.

మాటల్లో ఆయన్ని ఢీ కొనాలంటే, మనదగ్గర ఎన్ని పన్నులూ, మరెన్ని పంచులూ ఉన్నా లాభం ఉండదు. ఆయన్ని చూస్తూనే, అవన్నీ సొంత చూట్టాన్ని చూసినట్టు గబుక్కున మన పొదిలోంచి దూకేసి పారిపోయి, ఆయన బుర్రలోకి వెళ్ళి కూర్చుని, మనల్ని వెక్కిరిస్తాయి. ఇహ మన పని ఖాళీ!

డాలస్ నుంచి ప్రవాస భారతీయులు భాస్కర్ రాయవరం గారు వారం వారం నిర్వహించే బి ప్లస్ కథాకళ కార్యక్రమంలో 09.03.22 తేదీన చందమామ రచయితల గురించిన చర్చలో, కోనే నాగ వెంకట ఆంజనేయులుగారి పేరు ప్రస్తావనకి వచ్చింది. అలాగే, ఆల్‌టైమ్ బాక్సాఫీస్ రచయిత, ప్రఖ్యాత శ్రీమల్లాది వెంకట కృష్ణమూర్తి తన 'నవల వెనక కథ' పుస్తకంలో కోనే వారి ప్రస్తావన చేశారు. చందమామ రోజులనుండీ కోనే వారి పేరు చదువుతూ పెరిగిన నాకు, అయిదేళ్ల క్రితం ఆయనతో పరిచయం కలిగింది. అప్పట్నుంచీ, అప్పుడప్పుడు పలకరింపులూ... ఎప్పుడూ రచయితలపులూ కోనే సాగుతూనే ఉన్నాయి.



కోనేగారి విశిష్ట సంచిక తెచ్చి, హాస్యానందం పత్రిక హాస్య ప్రియులకి మంచి విందు చేసింది!

– పి.వి.ఆర్. శివకుమార్.




# అమ్మగారి హత్య!

**"హల్లో...."**

**"హల్లో! ఎవరండీ?..."**

**"నేనురా! మీ అయ్యగారిని."**

**"అయ్యగారు! మీరా?... నమస్కారమండి. ఎప్పుడొస్తున్నారయ్యా ఊరునుండి?"**

"నేను రావడానికి ఇంకా రెండు మూడు రోజులు పడుతుంది గానీ ఈలోగా నువ్వొక పని చెయ్యాలిరా!"

"చెప్పండి బాబయ్యా!"

"జాగ్రత్తగా విను."

"వింటున్నాను బాబయ్యా!"

"కార్డ్‌లెస్‌లోనేగా మాట్లాడుతున్నావు."

"అవునయ్యా."

"అలా ఫోన్ మాట్లాడుతూనే వంట గదిలోకి వెళ్ళు."

"వెళ్ళేను బాబయ్యా..."

"గేస్ స్టౌ దగ్గర కూరగాయలు కోసే కత్తి ఉంటుంది చూడు."

"ఉంది బాబూ!"

"ఆ కత్తి తీసుకో."

"తీసుకున్నాను బాబయ్యా."

"కత్తి పదునెలా ఉందో చూడు."

"స్స్!....బాగా పదునుగా ఉంది బాబయ్యా!"

"ఉంది కదా! ఆ కత్తి తీసుకుని అమ్మగారి గదిలోకి వెళ్ళు."

"వెళ్ళేను బాబూ! అమ్మగారు గురకలు పెడుతూ నిద్రపోతున్నారు సార్!"

"కత్తి పొజిషన్‌లోకి తీసుకో."

"బాబూ!..."

"చెప్పింది చెయ్!"

"అలాగే బాబూ!"

"కత్తిని సూటిగా అమ్మగారి గుండెల్లో దింపేయ్!"

"బాబూ! బాబోయ్!!"

"నోర్మూసుకుని చెప్పింది చెయ్."

"నా వల్లకాదు బాబోయ్! నన్నొదిలేయండి!"

"చెప్పింది చెయ్‌రా! నీకేం కాదు. నేనున్నాను కదా!"

"వద్దు సార్!"

"పొడుస్తావా లేదా! నేను చూసుకుంటానన్నానుగా నీకేం కాకుండా."

"భయంగా ఉందయ్యా!"

"నేనుండగా నీకెందుకురా భయం?"

"సరే బాబూ! మీదే భారం!"

"వెరీగుడ్! పొడిచెయ్! ఒక్కటి కాదు రెండు మూడు పోట్లు పొడిచెయ్ గుండెలో కసిదీరా!"

"కసా....కసా.....కసా......పొడిచేసాను సార్! బాబోయ్ రక్తం.... దేవుడోయ్ రక్తం....."

"కదుక్కుందువుగాని లేరా! పనైపోయింది కదా!"

"అయిపోయింది బాబూ!"

"ముక్కు దగ్గర వేలు పెట్టి చూడు ప్రాణం పోయిందో లేదో."

"పోయింది సార్?"

"ఇప్పుడు శవాన్ని ఈడ్చుకుంటూ యింటి వెనక్కి తీసుకెళ్ళు."

"తీసుకెళ్ళేను సార్?"

"ఇప్పుడా శవాన్ని మన ఇంటి ప్రహారీగోడ అవతల వున్న చెరువులో విసిరి పారేయ్!"

"చెరువులోనా?"


"అవున్రా!"

"మన ఇంటి వెనక చెరువెక్కడుంది సార్! అక్కడుంది పోలీస్‌స్టేషన్ కదా!"

"పోలీస్‌స్టేషనా! యింతకీ ఇదే నంబర్ - 22334455 కాదా?"

"కాదు సార్! 22334456!

(క్లిక్)



## సృష్టిలో నవ్వే లక్షణం ఒక్క మనిషికే ఉంది !
## విచారించడానికి సవాలక్ష కారణాలు!
## డామిట్!... ఇందుకేనా మనుషులున్నది?
## ఆ సవాలక్ష కారణాలని మరుగున పడేయడానికే

హాస్యానందం

**చందాదారులుగా చేరండి...**

**నవ్వే లక్షణాన్ని మీ స్వంతం చేసుకోండి!**

| సంవత్సర చందా- రూ 300/-లు | రెండేళ్ళ చందా- రూ 500/-లు |
|---|---|

**జీవితచందా- రూ 5000/-**

**ఇంటిల్లీ పాదినీ నవ్వించే పని పెట్టుకున్న ఏకైక తెలుగు మాస పత్రిక**

**జీవిత చందాదారులకు ఆఫర్లు:**

✦ వీరికి పత్రిక ప్రతినెలా రిజిస్టర్ పోస్ట్‌లో పంపబడుతుంది.

✦ సంవత్సరంలో ఒక నెల వీరి కోరిక మేరకు 'శుభాకాంక్షలు' ప్రకటన ప్రచురిస్తాం!

మరిన్ని వివరాలకు
9 8 4 9 6 3 0 6 3 7 నెంబరకు
సంప్రదించండి!




Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P




## శ్రీ దండెంరాజు ఫౌండేషన్, బెంగళూరు

స్థాపక నిర్వాహకులు

డా॥ డి.ఎన్. వి. రామశర్మ గారి సౌజన్యంతో

ఉగాది సందర్భంగా హాస్యానందం నిర్వహిస్తున్న

# ఈ మినీ హాస్యకథల పోటీకి అందరికీ ఆహ్వానం!

## 1000 రూపాయలు చొప్పున 15 కథలకు బహుమతులు & ప్రశంసా పత్రం

**అంశం: అమ్మాయే నవ్వితే...**



**నిబంధనలు:**


- మహిళల్ని కించపరిచే విధంగా కథలు ఉండకూడదు.
- డి.టి.పి. చేసి పంపేవారు A4 పేజీ దాటరాదు.
- వ్రాతప్రతి రెండు A4 పేజీలు దాటరాదు.
- సున్నితమైన హాస్యంతో పాటు ఏదైనా సామాజిక అంశం ఉంటే బాగుంటుంది. కొసమెరుపు హాస్యకథలకి ప్రాణం కాబట్టి ప్రాముఖ్యం ఇవ్వబడుతుంది.
- కథ ఇంతకు ముందు ఎక్కడా ప్రచురించబడలేదనీ, ఏ పత్రిక పరిశీలనలో లేదనీ, కాపీ కాదనీ హామీ పత్రం ఇవ్వాలి.
- మీ కథల చివరి పేజీలోనే హామీ పత్రం, చిరునామా రాయాలి. విడిగా పంపకండి
- బహుమతి పొందిన కథలు హాస్యానందం **మార్చి, 2023** సంచికలో ప్రచురించబడతాయి.
- బహుమతి ప్రదానోత్సవ సభ విజయవాడలో నిర్వహించబడుతుంది. వివరాలు మార్చి సంచికలో.

మీ కథలు ఈ కింది మెయిల్‌కి పంపవలెను.

hasyanandampoteelu@gmail.com

కథలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ: **జనవరి-30, 2023**

Hasyanandam December 2022. RNI No. APTEL 08387/01/1/2003-TC



చవకబారు వస్తువులు విలువైనవి కావు...
విలువైన వస్తువులు చవకగా ఉండవు!!

Jaquar

**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548